www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 18-1-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 312 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా.1:22 తదుపరి పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.10:14 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.6:46-8:29, దుర్ముహూర్తం: సా.4:29-5:14, అమృతఘడియలు: తె.5:01-6:44, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 5:58 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





సాయిరెడ్డికి ఈడీ సమన్లు

వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో వైసీపీ మాజీ ఎంపీకి పిలుపు

- 22న విచారణకు రావాలంటూ నోటీసు జారీ
- ఇప్పటికే విచారించిన సిట్ అధికారులు
- స్కామ్ సంగతులు తెలిపిన సాయిరెడ్డి
- రాజ్ కసిరెడ్డే కీలకమని నాడు వెల్లడి
- ముడుపులను దేశం దాటించారన్న సాయిరెడ్డి
- విజిల్ బ్లోయర్ అవుతానంటూ అభ్యర్థన

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో ఆ పార్టీ మాజీ కీలక నేత విజయసాయి రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీన హైదరాబాద్ ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని తెలిపింది. మద్యం వ్యాపారుల నుంచి భారీ స్థాయిలో కమీషన్లు, ఆ సొమ్ము అక్రమ మార్గంలో విదేశాలకు మళ్లింపు వెనకున్న వాస్తవాన్ని వెలికి తీసేందుకు ఈడీ నడుం బిగించింది. అందులో భాగంగా విజయవాడ జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని గతంలో ప్రశ్నించిన ఈడీ.. డిస్టిలరీస్ యజమానులు, మధ్యవర్తులను సైతం విచారించింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్

మిగతా 11వ పేజీలో...

హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

> 'సన్‌రైజ్ ఏపీ'లో భాగంగా సోలార్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అలాగే పంప్డ్ స్టోరేజ్, విండ్ పవర్‌కు రాష్ట్రం అనుకూలం. ఈ మూడూ గ్రీన్ అమ్మోనియం తయారీకి అనుకూలంగా ఉంటాయి. అలాగే దేశంలో మొదటి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతిలో రాబోతోంది.
> - సీఎం చంద్రబాబు



పంప్డ్ స్టోరేజ్, విండ్, సోలార్ పవర్‌కు రాష్ట్రం అనుకూలం

- అన్ని రాష్ట్రాలకూ వచ్చిన పెట్టుబడుల్లో 25% మనకే..
- భవిష్యత్తులో యూనిట్ విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.1.19కి తగ్గిస్తాం
- ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి
- సంపద సృష్టికి ఏపీని మించిన రాష్ట్రం లేదు
- కాకినాడలో 'గ్రీన్ అమ్మోనియా' ప్లాంట్‌లో భారీ యంత్రాలను ప్రారంభించిన చంద్రబాబు, పవన్



కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌లో భారీ యంత్రాలను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కాకినాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రాష్ట్రం హైడ్రోజన్ వ్యాలీగా మారుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. సౌర, పవన, జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్‌లాంటి విద్యుదుత్పత్తికి, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి రాష్ట్రం ఎంతో అనుకూలంగా మారిందన్నారు. గ్రీన్ ఎనర్జీ(హరిత ఇంధనం)పై చర్చ వస్తే ప్రపంచవ్యాప్తంగా త్వరలో కాకినాడ పేరు వినిపించనుందని తెలిపారు. కాకినాడలో 'ఏఎం గ్రీన్' కంపెనీ నిర్మిస్తున్న గ్రీన్ అమ్మోనియం ప్లాంట్‌లో భారీ యంత్రాల ఏర్పాటును సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి

మిగతా 14వ పేజీలో...

ప్రాజెక్టు స్వరూపం ఇదీ..

- 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.90 వేల కోట్లు) పెట్టుబడి.
- మొత్తం 3 దశల్లో ప్రాజెక్టు అభివృద్ధి.
- తొలిదశలో 2027 నాటికి ఏడాదికి 5 లక్షల టన్నుల ఉత్పత్తి.
- 2వ దశలో 2028 నాటికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి.
- 3వ దశలో 15 లక్షల టన్నుల ఉత్పత్తే లక్ష్యం.

గత ప్రభుత్వంలో వేధింపులే

- పారిశ్రామిక వేత్తలను వైసీపీ నేతలు భయపెట్టారు
- సమీక్షల పేరుతో విద్యుత్ ఒప్పందాలు ఆపేశారు
- కానీ, మా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది
- గ్రీన్ అమ్మోనియం ఉత్పత్తితో ప్రపంచపటంలోకి రాష్ట్ర ప్రగతి: డిప్యూటీ సీఎం పవన్

గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం పరుగులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

14

బొగ్గు కోసం.. నీచ కథనం!



ఎక్కడో ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ కోసం టెండర్లు పిలవడమేమిటి? ఆ టెండర్ల ఖరారులో జాప్యం జరగడమేమిటి? ప్రతిగా ఎన్టీవీలో ఒక అనైతిక కథనం ప్రసారం అవడమేమిటి?

> కోమటిరెడ్డి వెంకటరెడ్డి వల్ల తమ లక్ష్యం దెబ్బతింటున్నదని భావించిన ఎన్టీవీ యాజమాన్యం రంగంలోకి దిగింది. ఫలితమే మంత్రి రాసలీలలు అనే కథనం.

తమ చానల్‌లో ప్రసారమైన కథనంతో తమకు సంబంధం లేదని, తమ చైర్మన్ నరేంద్ర చౌదరి ఆదేశాల మేరకే ఆ కథనాన్ని రూపొందించామని ఎన్టీవీకి చెందిన జర్నలిస్టులు పోలీసుల విచారణలో చెప్పారు. న్యాయంగా అయితే ఈ వ్యవహారంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం సమర్థనీయం కాదు.

> తాము అధికారంలో ఉన్నప్పుడు గిట్టని మీడియా సంస్థలను, అందులో పనిచేసే జర్నలిస్టులను వేధించిన కేసీఆర్ అండ్ కో, జగన్ అండ్ కో ఇప్పుడు ఎన్టీవీ తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారు. ఇదే కేసీఆర్ తాను అధికారంలో ఉన్నప్పుడు 'ఆంధ్రజ్యోతి' పత్రికకు ప్రకటనలు ఇవ్వకుండా వేధించిన విషయం తెలిసిందే. ఇక.. జగన్ విషయంలో ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. జర్నలిస్టులు, మీడియా సంస్థల అధిపతులపై ఏకంగా రాజద్రోహం కేసులు పెట్టించిన ఘనత ఆయన సొంతం.

మీడియాకు స్వేచ్ఛ ఎంత ముఖ్యమో హద్దులు కూడా అంతే ముఖ్యం. ప్రింట్ మీడియా ఇప్పటికీ ఎంతో కొంత బాధ్యతతో పనిచేస్తోంది. ఎలక్ట్రానిక్ మీడియా, అది కూడా యూట్యూబ్ చానళ్లు వచ్చిన తర్వాత పరిస్థితి అదుపు తప్పింది. విచ్చలవిడితనం పెరిగిపోయింది. ప్రజల్లో కూడా ఈ ధోరణిపై ఏహ్య భావం ఏర్పడింది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

బస్సుల్లో పురుషులకూ 'ఉచితం'

2

- రేషన్‌కార్డు ఉన్న గృహిణులందరికీ ప్రతినెలా 2వేలు
- సొంత ఇల్లు లేని పేదలకు నగరాల్లో కాంక్రీట్ ఇళ్లు
- తమిళనాట అన్నాడీఎంకే ఎన్నికల హామీలు



గర్భిణులకు పారాసెటమాల్ సురక్షితం

- పుట్టబోయే పిల్లలకు ఆటిజం ముప్పులేదు
- స్పష్టం చేసిన లాన్సెట్ తాజా నివేదిక
- ట్రంప్ వ్యాఖ్యలతో చెలరేగిన గందరగోళానికి ముగింపు పలికిన పరిశోధనా పత్రం

2

నాకు పని దొరక్కపోవడానికి.. మతమే కారణమేమో!



- ఛావా చిత్రం విభజనవాదాన్ని సొమ్ము చేసుకుంది
- ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్
- మతం మార్చుకో.. పని దొరుకుతుందేమో: వీహెచ్‌పీ



మంచు కురిసే వేళలో..

13

- ఉదయం 10 గంటల వరకు పొగ మంచు
- అరకు లోయలో 3.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ద్వారకా తిరుమలలో ఉదయం 9 గంటలకు మంచుతెరల నడుమ భానుడు



మాల్దాలో శనివారం వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

వలసలే బెంగాల్‌కు పెద్ద సమస్య

2

- ఈ పాపం మమతదే.. చొరబాటుదార్లతో నింపేశారు.. ఘర్షణలకు కారణం ఇదే
- 'ముంబై' ఫలితమే బెంగాల్‌లో సాధిస్తాం.. బీజేపీ వెంటే జెన్ జీ తరం: నరేంద్ర మోదీ
- పట్టాలెక్కిన తొలి వందే భారత్ స్లీపర్ రైలు.. జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని
- 4 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లకూ శ్రీకారం.. 3 వేలకోట్ల రైల్, రోడ్డు ప్రాజెక్టులు ప్రారంభం



రుషికొండ ఐటీ పార్కులో జీసీసీలు ఏర్పాటు కానున్న ఇన్‌స్పైర్‌ఎడ్జ్ భవనం

జీసీసీ హబ్‌గా విశాఖ

- మార్చి నుంచి 'ఇసాయ్ ఫార్మా' కార్యకలాపాలు!
- అదే వరుసలో ఎన్‌టీటీ, లులులెమన్
- ఆ తర్వాత క్యూలో ఏఎన్ఎస్ఆర్, రహేజా
- క్యాంపస్ నిర్మాణంపై క్యాప్‌జెమినీ ఆలోచన

13

- రుషికొండ ఐటీ పార్కులోని హిల్-2పై 'ఇన్‌స్పైర్‌ఎడ్జ్' భవనాన్ని లీజుకు తీసుకున్న సంస్థలు

నల్లమల సాగర్‌పై ముందుకే..

కేంద్ర జల సంఘం అనుమతి సాధించండి

కృష్ణా వరద జలాలతో సీమ సస్యశ్యామలం

- తెలంగాణతో ఇచ్చిపుచ్చుకునే వైఖరితో ఉందాం
- సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుదాం
- ఏడాదిలోగా పూర్వోదయ కింద ఉత్తరాంధ్ర స్కీమ్‌లు పూర్తి
- జల వనరుల సమీక్షలో చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం - నల్లమల సాగర్ అనుసంధాన పథకంపై ముందుకే వెళదామని జల వనరుల శాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నదీ జలాల విషయంలో తెలంగాణతో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరిద్దామన్నారు. దావోస్‌కు వెళ్లే ముందు

మిగతా 13వ పేజీలో...

ముంచిన బరి

జూదంతో జనం జేబులకు గండి

అప్పులు చేసి మరీ కోడి పందేలు

- చివరికి నెత్తిన చేతులతో లబోదిబో
- చిన్న బరుల నిర్వాహకులకు పెద్ద నష్టం
- ముడుపుల డబ్బూ తిరిగి రాలేదు
- పెద్ద బరులకు కోట్లలో లాభాలు
- కుక్కుట శాస్త్రంతో పందేలు కొట్టిన పొరుగు రాష్ట్రాల వారు

11



శుక్రవారం కాకినాడలో బరి వద్ద పందేలు కాసేందుకు డబ్బులతో సిద్ధమవుతున్నారిలా..

పండగ సందడి తిరిగెళ్లిపోతోంది..

13

- సంక్రాంతికి వచ్చిన వారు తిరుగు ప్రయాణం.. హైదరాబాద్ రహదారి కిటకిట
- క్యూ కట్టిన వేలాది వాహనాలు.. నందిగామ వద్ద గంటపాటు ట్రాఫిక్ జామ్

నాకు పని దొరక్కపోవడానికి మతమే కారణమేమో!

- మ్యూజిక్ డైరెక్టర్‌గా నన్ను ఎంపిక చేశాక కూడా వేరేవాళ్లతో సంగీతం
- సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్




న్యూఢిల్లీ, జనవరి 17: సినీరంగంలో మత వివక్ష ఉందని అర్థం వచ్చేలా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ చేసిన తాజా వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. విక్కీ కౌశల్ హీరోగా నటించిన చిత్రం 'ఛావా'కు సంగీతం అందించిన రెహమాన్, ఆ చిత్రం గురించి, అలాగే బాలీవుడ్‌లో తనకు అవకాశాలు తగ్గడం గురించి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. బీబీసీ ఏషియన్ నెట్‌వర్క్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడుతూ.. 'ఛావా ఒక విభజనవాద చిత్రం. సమాజంలోని విభజనను అడ్డుపెట్టుకుని ఈ సినిమా సొమ్ము చేసుకుందని నేను భావిస్తున్నాను. కానీ, ఈ సినిమాలో శౌర్యాన్ని చూపించడమే ప్రధాన ఉద్దేశమని దర్శకుడు చెప్పారు. మరాఠా యోధుడు శంభాజీ మహారాజ్ గురించి తీస్తున్న సినిమాకు పని చేయడం గౌరవంగా భావించి అంగీకరించాను. కానీ సినిమాలో 'సుభాన్ అల్లా, అల్హమ్దులిల్లా' వంటి పదాలను ప్రతికూల సందర్భాల్లో వాడడం నాకు ఎబ్బెట్టుగా తోచింది. గత ఎనిమిదేళ్లుగా బాలీవుడ్‌లో నాకు పెద్దగా పని దొరకడం లేదు. బహుశా దీనికి మతపరమైన కారణాలు ఉండొచ్చు. ప్రస్తుతం సృజనాత్మకత లేని వారి చేతిలో అధికారం ఉంది. సంగీత దర్శకుడిగా నన్ను ఎంపిక చేసుకున్నాక కూడా వేరేవాళ్లతో సంగీతం చేయించుకున్న సందర్భాలున్నాయి' అని తెలిపారు.

ద్వేషంతో కళ్లు మూసుకుపోయాయి: కంగన

రెహమాన్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, వీహెచ్‌పీ నేత వినోద్ బన్సల్ తదితరులు రెహమాన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'డియర్ రెహమాన్.. నేను కాషాయ పార్టీకి మద్దతిస్తున్నాని సినీ పరిశ్రమలో ఎంతో వివక్షను ఎదుర్కొంటున్నాను. కానీ, మీ అంత పక్షపాత, ద్వేషపూరిత మనస్తత్వం ఉన్న వ్యక్తిని ఇంతవరకూ చూడలేదు' అని ఇన్‌స్టాగ్రామ్‌లో కంగన మండిపడ్డారు. సినిమా విభజనవాదాన్ని ప్రేరేపిస్తుందని తెలిసినప్పుడు, అందులో పనిచేసినందుకు డబ్బులు ఎందుకు తీసుకున్నారని వినోద్ బన్సల్ ప్రశ్నించారు. 'ఇలాంటి చిల్లర వ్యాఖ్యలు రాజకీయ నాయకులకు సరిపోతాయి. కళాకారులకు కాదు. ఒకప్పుడు హిందువు అయిన రెహమాన్, మళ్లీ హిందూ ధర్మంలోకి పునరాగమనం చేస్తే పని దొరుకుతుందేమో' అని వ్యాఖ్యానించారు. 'బాలీవుడ్‌లో మతవివక్ష ఉందనడం అవాస్తవం. షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ అగ్రహీరోలుగా కొనసాగుతున్నారు. రెహమాన్ చాలా పెద్ద స్థాయి వ్యక్తి. చిన్న నిర్మాతలు ఆయన దగ్గరకు వెళ్లడానికి భయపడుతున్నారు. అంతే తప్ప మతపరమైన కారణాలు లేవు' అని జావేద్ అఖ్తర్ అన్నారు.

లోకం తీరు



విమాన సర్వీసుల్లో సంక్షోభం..
ఇండిగోకు రూ.22 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ, జనవరి 17: విమాన సర్వీసులను అనూహ్యంగా రద్దు చేసి సంక్షోభం సృష్టించినందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థకు డీజీసీఏ రూ.22.20 కోట్ల జరిమానా విధించింది. పైలట్ల విధి నిర్వహణ సమయాల్లో మార్పులు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయనందుకు రోజుకు రూ.30 లక్షల వంతున 68 రోజులకు రూ.20.40 కోట్లు, ఏకకాల జరిమానా కింద మరో రూ.1.80 కోట్లు విధించినట్టు వివరించింది. రూ.50 కోట్లకు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించింది. గత నెల 3-5 తేదీల మధ్య ఏకంగా 2,507 విమాన సర్వీసులను రద్దు చేయగా, 1,852 సర్వీసులు ఆలస్యం కావడంతో అయోమయం నెలకొంది. మూడు లక్షల మంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దీనిపై దర్యాప్తు చేయించాలని పౌరవిమానయాన శాఖ ఆదేశించడంతో డీజీసీఏ నలుగురు నిపుణులతో కమిటీని నియమించింది. సమగ్రంగా విచారణ జరిపిన ఆ కమిటీ.. నెట్‌వర్క్ ప్లానింగ్‌లో లోపాలు, పైలట్ల రోస్టర్ విధానంలో మార్పులు చేయకపోవడంతోపాటు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంలో వైఫల్యాలు ఉన్నట్టు గుర్తించింది.

వందేమాతరం ఇతివృత్తంగా గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ, జనవరి 17: ఒకటిన్నర శతాబ్దాలు పూర్తిచేసుకున్న జాతీయ గేయం 'వందేమాతరం' ఇతివృత్తంగా దేశ రాజధానిలో ఈసారి గణతంత్ర వేడుకలు జరగనున్నాయి. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో 30 శకటాలు సందడి చేయనున్నాయి. వాటిలో 17 శకటాలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలవి కాగా, 13 శకటాలు కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందినవి ఉంటాయి. అశిరాకండి హస్తకళపై అస్సాం, వందేమాతరం ఇతివృత్తంగా గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గణేశ్ ఉత్సవాలపై మహారాష్ట్ర, స్వాతంత్ర్యోద్యమంలో బెంగాల్ పాత్రపై పశ్చిమ బెంగాల్ తమ శకటాలను ప్రదర్శిస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఎదుగుదలపై తమిళనాడు, వాటర్ మెట్రో, 100 శాతం డిజిటల్ పాలనపై కేరళ, హార్న్‌బిల్ ఫెస్టివల్‌పై నాగాలాండ్ శకటాల ప్రదర్శన ఉంటుంది. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాలు సంయుక్తంగా శకటాన్ని ప్రదర్శించనున్నాయి.

రోహిత్ వేముల చట్టం తేవాల్సిందే: రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేశంలో దళిత యువత పరిస్థితిలో ఇప్పటికీ ఏ మార్పూ రాలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. రోహిత్ వేముల పదో వర్ధంతి సందర్భంగా ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'రోహిత్ మనకు దూరమై పదేళ్లు గడిచినా అతను లేవనెత్తిన.. ఈ దేశంలో కలలు కనే హక్కు అందరికీ సమానంగా ఉందా? అనే ప్రశ్న మన గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఇన్నేళ్లయినా దళిత యువత వాస్తవ పరిస్థితుల్లో మార్పు శూన్యం. నేటికీ క్యాంపస్‌లలో అదే తిరస్కారం, హాస్టళ్లలో అదే వెలి, తరగతి గదుల్లో అదే చిన్నచూపు కొనసాగుతున్నాయి. కొన్నిసార్లు హింస, మరణాలు సంభవిస్తున్నాయి. నేటికీ ఈ దేశంలో కులమే అతిపెద్ద అడ్మిషన్ ఫారమ్‌గా ఉంది. విద్యాసంస్థల్లో కులవివక్షను నిర్మూలించేందుకు రోహిత్ వేముల చట్టం తీసుకురావడం తక్షణ అవసరం. కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాయి' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

దేశ విభజన తప్పు.. మళ్లీ జరగొద్దు: సుధామూర్తి

జైపూర్, జనవరి 17: దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజన గురించి నేటి తరం పిల్లలు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని రాజ్యసభ ఎంపీ, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం తప్పని, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా చూసుకోవాలని అభిప్రాయపడ్డారు. దేశ విభజనపై అవగాహన చేసుకోవడంలో యువతకు సహకరించేందుకు ఆయా సున్నిత అంశాలపై తాను తాజా పుస్తకం 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఎర్నింగ్స్'లో వివరించానని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో జరుగుతున్న జైపూర్ సాహిత్య వేడుకల (జేఎల్ఎఫ్) 19వ ఎడిషన్ కార్యక్రమంలో సుధామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత సంప్రదాయాలు, దేశ భాషల గురించి తెలియని ఓ వ్యక్తి ఒక పెన్సిల్ తీసుకొని గీత గీసి.. 'ఇప్పటి నుంచి ఈ భూమి ఇకపై మీకు చెందదు. అది విదేశీ భూభాగం అవుతుంది' అని చెప్పారని, అది ఎంత హృదయ విదారకరమని సుధామూర్తి అన్నారు. తన అల్లుడు, బ్రిటీష్ మాజీ ప్రధాని రిషి సునాక్ కుటుంబం గురించి చెబుతూ.. నేడు పాకిస్థాన్‌లో ఉండే ప్రాంతానికి చెందిన సునాక్ తాత దేశ విభజన సమయంలో అక్కడి నుంచి ఇల్లు, వ్యాపారాలు అన్నీ వదులుకొని, బలవంతంగా వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు.

ఎన్సీఈఆర్టీ పేరుతో నకిలీ పాఠ్యపుస్తకాలు!

న్యూఢిల్లీ, జనవరి 17: ఎన్సీఈఆర్టీ పేరుతో ఓ ముఠా పెద్ద ఎత్తున నకిలీ పాఠ్యపుస్తకాలను ముద్రించి విక్రయిస్తోంది. ఈ ముఠాను ఎన్సీఈఆర్టీతో కలిసి ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడంతోపాటు వివిధ తరగతులకు సంబంధించిన సుమారు 45వేల పాఠ్యపుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు రూ.2 కోట్ల విలువైన ముద్రణ యంత్రాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు శనివారం వెల్లడించారు.

వలసలే బెంగాల్‌కు పెద్ద సమస్య

ఈ పాపం మమతా బెనర్జీదే.. చొరబాటుదార్లతో బెంగాల్‌ను నింపేశారు

- తరచూ మత ఘర్షణలకు కారణం ఇదే
- 'ముంబై' ఫలితమే బెంగాల్‌లో సాధిస్తాం
- బీజేపీ వెంటే జన్ జీ తరం : ప్రధాని మోదీ

మాల్దా (పశ్చిమబెంగాల్), జనవరి 17 : అక్రమ వలసలతో బెంగాల్‌ను అధికార తృణమూల్ కాంగ్రెస్ నింపివేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు. దీనివల్లే బెంగాల్ తరచూ మత ఘర్షణల్లో చిక్కుకుంటోందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వలసలే బెంగాల్‌కు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించాయని, బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే చొరబాట్లు, చొరబాటుదారులను అణచివేస్తుందని మోదీ అన్నారు. శనివారం బెంగాల్‌లో పర్యటించిన ఆయన, తొలి వందేభారత్ స్లీపర్ రైలును మాల్దాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు బెంగాల్‌లోని హవ్‌డా నుంచి అసోంలోని గువాహటి వరకు నడుస్తుంది. పూర్తిగా ఏసీ కోచ్‌లతో దీనికి సిద్ధం చేశారు. మాల్దా వేదికగానే రెండో తరానికి చెందిన నాలుగు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపి మోదీ ప్రారంభించారు. రూ.3వేల కోట్లకు పైగా విలువైన రైలు, రోడ్డు ప్రాజెక్టులను ఇక్కడినుంచి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ.. మాతా కాళీ పవిత్ర భూమి నుంచి మాతా కామఖ్య పుణ్య ప్రాంతం వరకు వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం వందేభారత్ స్లీపర్ రైలులో ప్రయాణించి కొందరు ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. ఈ సర్వీసులను త్వరలోనే దేశమంతా విస్తరిస్తామన్న ఆయన, ప్రస్తుతం 150 వందేభారత్ రైళ్లు పట్టాలపై ఉన్నాయన్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉత్తర బెంగాల్‌ను పశ్చిమ, దక్షిణ భారతాలతో కలుపుతాయని తెలిపారు. అనంతరం.. బెంగాలీ యువత, విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు బెంగళూరుకు సులువుగా చేరుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా రూపొందించిన రెండు కొత్త రైలు సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు కొత్త తరం రైలు సర్వీసులు. అందుబాటు ధరల్లో, ఆధునిక సౌకర్యాలతో అంతరాష్ట్ర మార్గాల్లో ప్రయాణించేందుకు వీలుగా తయారుచేశారు. స్లీపర్ క్లాసులో 200 కిలోమీటర్లు, సెకండ్ క్లాసులో యాభై కిలోమీటర్ల వరకు కనిష్ఠ చార్జీతో ప్రయాణించవచ్చు. ఈ దూరాలకు స్లీపర్‌లో రూ.149, సెకండర్ క్లాసులో రూ.36ను వసూలు చేస్తారు. ఈ సర్వీసుల్లో ఆర్ఏసీని అనుమతించరు. స్లీపర్‌లో మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు మాత్రమే రిజర్వేషన్ కోటా ఉంటుంది.



వందేభారత్ స్లీపర్ రైలులో విద్యార్థుల టోపీలపై ఆటోగ్రాఫ్ ఇస్తున్న ప్రధాని మోదీ

అండగా ఉంటాం : మోదీ

బంగ్లాదేశ్‌లో మతదాడులకు గురయి, బెంగాల్‌లోకి వలస వచ్చిన మథువాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, 'సర్' వల్ల ఇబ్బందులు రాకుండా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. అక్రమ వలసల తాకిడివల్ల స్థానిక భాషలు, సంస్కృతులు, ఆహార్యం..అన్నీ మారిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పాపం సీఎం మమతా బెనర్జీదేనని ఆయన మండిపడ్డారు. తృణమూల్ నేతలు, చొరబాటుదారుల మధ్య కుమ్మక్కును బద్దలుకొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ముంబై మునిసిపల్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. అలాంటి ఫలితమే బీజేపీకి బెంగాల్‌లో లభించనున్నదని మోదీ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభివృద్ధి నమూనా పట్ల జన్ జీ తరం సుముఖంగా ఉన్నదన్నారు.

బంగ్లాదేశ్‌లో వాహనంతో ఢీకొట్టి మరో హిందువు హత్య!

న్యూఢిల్లీ/ ఢాకా, జనవరి 17: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య జరిగింది. ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తోన్న హిందూ యువకుడు రిపాన్ సాహా(30) పెట్రోల్‌కు డబ్బు చెల్లించకుండా వెళ్లిపోతోన్న వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా.. అతడిని వాహనంతో ఢీకొట్టి వెళ్లిపోయినట్లు బంగ్లా పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్‌లోని రాజ్‌బరి జిల్లాలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆ దేశంలో హిందువులపై జరుగుతోన్న మత పరమైన హింసాకాండలో భాగమేనా.. కాదా.. అన్న విషయం స్పష్టం కాలేదు. దీనిపై హత్య కేసు నమోదు చేస్తున్నట్లు రాజ్‌బరి జిల్లా సదర్ పోలీసు చీఫ్ ఖొండాకర్ జియాఉర్ రహ్మాన్ స్థానిక మీడియాకు తెలిపారు. హతుడు డబ్బు చెల్లించకుండా వెళ్లిపోతోన్న వాహనానికి అడ్డు నిలబడగా.. అతడిని వాహనంతో తొక్కించి నిందితులు పరారయ్యారని ఆయన పేర్కొన్నారు. బాధితుడు అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. అనంతరం ఆ వాహనాన్ని గుర్తించి.. సీజ్ చేసి, దాని యజమాని అబుల్ హాషీం(55), డ్రైవర్ కమాల్ హొసేన్(43)లను అరెస్టు చేశారు.

గర్భిణులకు పారాసెటమాల్ సురక్షితమే

- ఆటిజం, ఏడీహెచ్‌డీ ముప్పులేదు
- స్పష్టం చేసిన లాన్సెట్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 17: గర్భిణులుగా ఉన్న సమయంలో పారాసెటమాల్ వాడకం వల్ల పుట్టే పిల్లలకు ఆటిజం, అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివ్ డిజార్డర్(ఏడీహెచ్‌డీ), మేధోపరమైన వైకల్యం వచ్చే అవకాశం లేదని లాన్సెట్ తాజా నివేదిక స్పష్టం చేసింది. గర్భ సమయంలో పారాసెటమాల్ వల్ల పిల్లల్లో ఆటిజానికి సంబంధం ఉందంటూ గత ఏడాది సెప్టెంబరులో యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ చేసిన చేసిన వ్యాఖ్యలతో ఏర్పడిన గందరగోళానికి ఈ పరిశోధన తెరదించింది. 43 అధ్యయనాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక, ఇప్పటి వరకూ వెలువడిన అత్యంత పకడ్బందీ సాక్ష్యాధారాల విశ్లేషణ. సిటీ సెయింట్ జార్జెస్, లండన్ యూనివర్సిటీ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఈ విశ్లేషణ 'ది లాన్సెట్ అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ అండ్ ఉమెన్ హెల్త్' లో ప్రచురితమైంది.

వాయుకాలుష్యంతో కంటి సమస్యలు

న్యూఢిల్లీ, జనవరి 17: వాయు కాలుష్యంతో కంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని నేత్ర వైద్యులు హెచ్చరిస్తున్నారు. దుమ్ము, వాహనాల నుంచి వెలువడే పొగ, వ్యర్థాలను, పటాకులను కాల్చినప్పుడు వెలువడే పొగలో ఉండే పీఎం 2.5 అనే సూక్ష్మ కణాలు కంటిలోకి ప్రవేశించి కార్నియా మీద అతుక్కుంటాయని.. దీనివల్ల కళ్లు పొడిబారటం, కంట్లో దురద, చూపు మందగించటం వంటి సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ అజయ్‌శర్మ అనే నేత్ర వైద్యుడు తెలిపారు. గంటలకు గంటలు తదేకంగా టీవీ, ఫోన్ చూసేవారు, కాంటాక్ట్ లెన్సులను వాడేవారు, పొగ తాగేవారిలో.. ఈ సమస్యలు మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉందన్నారు.

నాటో దేశాలపై.. ట్రంప్ సుంకాల బాంబు!

వాషింగ్టన్/కోపెన్‌హాగెన్, జనవరి 17: గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా పరిధిలోకి తెచ్చుకునే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న 8 యూరోపియన్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కత్తిగట్టారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాలపై 10% సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. జూన్ 1 నుంచి సుంకాలను 25 శాతానికి పెంచుతానని.. గ్రీన్‌ల్యాండ్ పూర్తిగా అమెరికా ఆధీనంలోకి వచ్చేవరకు ఈ సుంకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ సుదీర్ఘ పోస్టు పెట్టారు. "అమెరికా దశాబ్దాలుగా డెన్మార్క్, ఇతర యూరోపియన్ దేశాల నుంచి ఎలాంటి సుంకాలు, ప్రతిఫలం ఆశించకుండా సబ్సిడీలు అందిస్తూ వస్తోంది. డెన్మార్క్ ఇప్పుడు ప్రతిఫలం చెల్లించాల్సిన సమయం వచ్చింది. ప్రస్తుతం ప్రపంచ శాంతి ప్రమాదంలో ఉంది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని చైనా, రష్యా ప్రయత్నిస్తున్నాయి. వాటిని ఎదుర్కొనే శక్తి డెన్మార్క్‌కు లేదు. అమెరికాకు మాత్రమే ఆ సామర్థ్యం ఉంది. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, యూకే, నెదర్లాండ్స్, ఫిన్‌లాండ్ దేశాలు తమ దళాలను గ్రీన్‌ల్యాండ్‌కు పంపి.. ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టాయి. ఆ దేశాలు ప్రమాదకరమైన ఆటను మొదలుపెట్టి ప్రపంచ భద్రతను ప్రమాదంలోకి నెట్టాయి. అమెరికా జాతీయ భద్రతకు, గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థ కోసం గ్రీన్‌ల్యాండ్ అత్యవసరం. ఈ అంశంలో చర్చలకు సిద్ధం" అని ట్రంప్ పేర్కొన్నారు.

యుద్ధానికి ముందు ప్రశాంతతేనా?

- ఇరాన్‌లో తగ్గిన ఆందోళనలు
- సైనిక చర్యను వాయిదా వేసిన ట్రంప్
- కానీ, దాడికి సిద్ధమనే సంకేతాలు

న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 17: ఇరాన్‌పై దాడిని అమెరికా తాత్కాలికంగా వాయిదా వేసింది. ప్రభుత్వ పాశవిక అణచివేతతో ఇరాన్‌లో ఆందోళనలూ తగ్గాయి. కానీ పరిస్థితి మాత్రం తుఫాను ముందు ప్రశాంతతలానే కనిపిస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక క్రిమినల్ అంటూ ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మండిపడ్డారు. దేశద్రోహుల వెన్నువిరుస్తామని ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ ప్రోద్బలంతో ఉగ్రవాదులు వేలాది మంది ఇరాన్ ప్రజలను చంపారని ఆరోపించారు. మరోవైపు ఇరాన్‌పై దాడికి సిద్ధంగానే ఉన్నామని ఐరాస భద్రతా మండలి భేటీలో అమెరికా రాయబారి పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్య మొదలుపెడితే.. ఇరాన్ సమీపంలో ఉన్న ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణి దాడులు చేసే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేలా సన్నద్ధమయ్యేందుకు కాస్త సమయం తీసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, గల్ఫ్ ప్రతినిధులు ట్రంప్‌ను కోరినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ చీఫ్ డేవిడ్ అమెరికాకు చేరుకుని ట్రంప్ యంత్రాంగంతో చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతానికి సైనిక చర్యను ట్రంప్ పక్కనపెట్టారని, ఏ క్షణమైనా విరుచుకుపడే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా. ఇరాన్‌లో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో సాధారణ ప్రజలెవరూ బయటికి రావడం లేదు. ఇరాన్ ఆందోళనల్లో మరణాలు 3,428కి చేరాయని నార్వేకు చెందిన 'ఇరాన్ హ్యూమన్ రైట్స్' సంస్థ శనివారం వెల్లడించింది. కాగా, అగ్రరాజ్యాల అణచివేతకు గురైన ప్రపంచానికి స్ఫూర్తిగా ఇరాన్ నిలిచే ఉంటుందని, ఇరాన్‌కు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని హెజ్బొల్లా సంస్థ ప్రకటించింది.



టెహ్రాన్‌లో నిర్వహించిన ఆందోళనకారుల సామూహిక అంత్యక్రియల్లో వారి బంధువులు

ఆందోళనలు ఉధృతం చేయండి: పహ్లావీ

ఇరాన్‌లో ఆందోళనలు ఉధృతం కావడానికి కారణమైన ఆ దేశ మాజీ యువరాజు రెజా పహ్లావీ మరోసారి ఆందోళనలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా మూకుమ్మడిగా బయటికి వచ్చి పోరాడాలని, మతవాద ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పేర్కొన్నారు. ఇరాన్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారని, అంతర్జాతీయ సమాజం వారికి మద్దతుగా నిలవాలని కోరారు. ఆందోళనలతో అట్టుడుకుతున్న ఇరాన్ నుంచి పలువురు భారతీయులు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఇంటర్నెట్, టెలికం సేవల నిలిపివేతతో అసలేం జరుగుతోందో అర్థంకాలేదని, భయం భయంగా గడిపామని వారు పేర్కొన్నారు.

అసలు క్రిమినల్ ట్రంపే: ఖమేనీ

ఇరాన్‌లో ఆందోళనలు, మరణాలు, నష్టాల వెనుక అసలు క్రిమినల్ అమెరికా అధ్యక్షుడు ట్రంపేనని ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మండిపడ్డారు. ఆందోళనకారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. "దేశాన్ని యుద్ధం వైపు నడిపించాలని మేం కోరుకోవడం లేదు. కానీ విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఆందోళనల పేరిట హింసకు పాల్పడ్డవదిలే ప్రసక్తే లేదు. ఇరాన్‌లో జోక్యం చేసుకున్న అంతర్జాతీయ క్రిమినల్స్ కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరు. ఇరాన్ నష్టాలకు అమెరికా అధ్యక్షుడే బాధ్యుడు. ఇరాన్‌ను మింగేయాలన్నదే అమెరికా లక్ష్యం" అని ఖమేనీ అన్నారు.

పురుషులకూ ఉచిత బస్సు

- రేషన్‌కార్డున్న గృహిణులకు నెలకు 2వేలు
- తమిళనాట అన్నాడీఎంకే ఎన్నికల హామీలు

చెన్నై, జనవరి 17(ఆంధ్రజ్యోతి): త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష అన్నాడీఎంకే తొలి విడత హామీలను ప్రకటించింది. అన్నాడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీఆర్ 109వ జయంతి సందర్భంగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) శనివారం 5కీలక హామీలను ప్రకటించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైతే సిటీ, టౌన్ బస్సుల్లో మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. రేషన్‌కార్డు ఉన్న గృహిణులందరికీ ప్రతినెలా రూ.2వేల ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఈ మొత్తాన్ని కుటుంబంలోని మహిళ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. సొంత ఇల్లు లేని పేదలందరికీ కాంక్రీట్ ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించి ఇస్తుందని, నగర ప్రాంతాల్లోనూ ప్రభుత్వమే రెసిడెన్షియల్ ఫ్లాట్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. ఉమ్మడి కుటుంబంలో ఉండి, వివాహం అయిన తర్వాత వేరు కాపురం పెట్టేవారికి కూడా ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి కాంక్రీటు ఇల్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. కాగా, డీఎంకే ప్రభుత్వం ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు రేషన్‌కార్డు ఉన్నవారికి నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తోంది.

ముంబైలో రిసార్టు రాజకీయాలు

ముంబై, జనవరి 17: దేశంలోనే అత్యంత ధనిక కార్పొరేషన్ అయిన బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎన్నికల్లో ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాకపోవటంతో రిసార్టు రాజకీయాలకు తెరలేచింది. తన మద్దతు(శివసేన) లేకుండా పాలకమండలి కొలువుదీరే పరిస్థితి లేకపోవటంతో ఏక్‌నాథ్ షిండే బీజేపీతో బేరసారాలు మొదలుపెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయన శనివారం తన కార్పొరేటర్లను ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌కు తరలించారు. ఏకంగా బీఎంసీ మేయర్ పదవి కోసమే బీజేపీ ముందు డిమాండ్ పెట్టనున్నట్లు సమాచారం. ఈ పదవి దశాబ్దాలుగా శివసేన చేతిలోనే ఉందని షిండే పార్టీ కార్పొరేటర్లు తమ అధినేతకు గట్టిగా చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. శుక్రవారం వెల్లడైన బీఎంసీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 89 సీట్లు గెలిచింది. దాని మిత్రపక్షాలైన శివసేన 29, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 3స్థానాల్లో గెలిచాయి. 227 వార్డులున్న బీఎంసీలో మేయర్ సీటు దక్కించుకోవాలంటే 114మంది మద్దతు అవసరం. బీజేపీ, శివసేన సభ్యులను కలిపితే 118 అవుతుంది. మరోవైపు ప్రతిపక్షాలన్నీ కలిపితే మెజారిటీ మార్కుకు 8 సీట్లు మాత్రమే తగ్గుతున్నాయి.

డీఎన్‌బీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

▸▸ 22 వరకూ దరఖాస్తులకు అవకాశం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ కోటా అభ్యర్థులకు సంబంధించి డీఎన్‌బీ(డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్) సీట్ల భర్తీకి ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2025-26 అడ్మిషన్లకు సంబంధించి డీఎన్‌బీ పోస్ట్ ఎంబీబీఎస్ కోర్సులు, పోస్ట్ ఎంబీబీఎస్ డిప్లొమా కోర్సుల్లో సీట్లు భర్తీ చేయనుంది. ఇన్ సర్వీస్ కోటా అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఈ ఏడాది జరిగిన పీజీ నీట్‌లో అర్హత సాధించి ఉండాలి. గత ఏడాది జూలై 31న నాటికి ఇంటర్న్‌షిప్ చేసి ఉండాలి. నీట్ నోటిఫికేషన్ సమయానికి 50 ఏళ్ల వయసు దాటి ఉండకూడదన్న నిబంధనలను అనుసరించాలి. ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఖమ్మంలో సీపీఐ శతాబ్ది ముగింపు వేడుకలు

విజయవాడ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మొట్టమొదటిసారిగా పార్టీ శతాబ్ది ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య వెల్లడించారు. సుమారు ఐదు లక్షల మంది ఈ వేడుకలకు హాజరవుతారని చెప్పారు. ప్రజలు వచ్చేందుకు వీలుగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో పాటు ప్రజల జీవన విధానాల్లో ప్రముఖ పాత్ర పోషించేలా ఈ వేడుకలు జరుగుతాయని చెప్పారు. దేశంలోని ఐదు వామపక్ష పార్టీలు, ఇతర దేశాల నుంచి వివిధ కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు వస్తారని పేర్కొన్నారు.

పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణరావు కన్నుమూత



విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజం కోసం కృషిచేసిన పద్మశ్రీ డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావు (86) శనివారం విశాఖపట్నంలో కన్నుమూశారు. ఆయన కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. వైద్యవృత్తి చేపట్టిన తరువాత ఆయన దేశవ్యాప్తంగా వేయి వరకు శిబిరాలు నిర్వహించి మూడు లక్షల పైచిలుకు పోలియో ఆపరేషన్లు నిర్వహించారు. విశాఖలో ప్రేమ ఆస్పత్రిని స్థాపించి, ఎక్కడెక్కడి నుంచో వచ్చినవారికి ఉచితంగా చికిత్సలు అందించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 1939 జూన్ 30లో శేషమ్మ, కనకం దంపతులకు ఆదినారాయణరావు జన్మించారు. భీమవరంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివి, ఆ తరువాత ఆర్థోపెడిక్‌లో ఎంఎస్ చేశారు. ఆ కాలేజీలోనే ఉద్యోగ జీవితం ప్రారంభించి ట్యూటర్ నుంచి ప్రొఫెసర్ స్థాయి వరకు పనిచేశారు. విశాఖలో దివ్యాంగులకు సేవలు అందించే రాణీ చంద్రమదేవి ఆస్పత్రిలోని రీహేబిటేషన్ సెంటర్‌కు సూపరింటెండెంట్‌గా సేవలు అందించారు. రిటైరైన తరువాత ప్రీ పోలియో సర్జికల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి, దానికి మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. ఆయన భార్య శశికళ కూడా వైద్యురాలే. గైనకాలజిస్ట్ అయిన ఆమె కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆదినారాయణరావు 1988లో ప్రధానమంత్రి జాతీయ అవార్డు, 2013, 2014లలో వరుసగా నేషనల్ చైల్డ్ వెల్ఫేర్ అవార్డును నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులు మీదుగా అందుకున్నారు. 2022లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంలో అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఆయన గంభీరంలో రెండు ఎకరాల స్థలాన్ని ఉచితంగా సమకూర్చారు.

ఆటోడ్రైవర్‌పై అమానుషం

▸▸ ఆటో తగిలిందని స్తంభానికి కట్టేసి చితకబాదిన వైనం, ఆరుగురి అరెస్ట్





ఆటోడ్రైవర్‌ను స్తంభానికి కట్టేసి కొడుతున్న దృశ్యం, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న మహర్షిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలబడి ఉన్న వ్యక్తికి ఆటో తగిలిందనే కారణంతో స్థానికులు ఆటోడ్రైవర్‌ను విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదిన అమానుష ఘటన శుక్రవారం రాత్రి ప్రకాశం పామూరు మండలంలోని బొట్లగూడూరులో జరిగింది. బాధితుడిని కట్టేసి కొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ శనివారం పామూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను తెలిపారు. పీసీపల్లి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన చీమలదిన్నె మహర్షి శుక్రవారం రాత్రి నిమ్మకాయల లోడుతో ఆటోలో పామూరుకు వెళుతున్నాడు. బొట్లగూడూరు సెంటర్‌లో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని ఆపి రోడ్డు పక్కన నిలబడి ఉండగా ఎదురుగా మరో వాహనం వచ్చేసరికి దానిని తప్పించే క్రమంలో ఆటో మద్దినేని తిరుపతయ్య అనే వ్యక్తి తగలటంతో స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కొందరు మహర్షితో వాగ్వాదానికి దిగారు. అతన్ని కిందకు దించి ఆటో అద్దాలను పగులగొట్టారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టారు. ఈ దాడిలో మహర్షికి ఎడమ చేతి వద్ద, కుడి కన్ను దగ్గర, నడుం భాగంలో రక్తగాయాలయ్యాయి. స్థానికంగా ఉండే పెద్ద మనుషులు కలుగజేసుకుని అతన్ని విడిపించగా మహర్షి నేరుగా పామూరు పోలీసు స్టేషన్‌కు చేరుకుని దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం పామూరు ఆస్పత్రికి, ఆ తర్వాత కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలిసి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. వెంటనే మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగానే ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు. కాగా.. బాధితుడి తరపున బీసీ సంఘాలకు చెందిన పలువురు నాయకులు శనివారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుడికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

పొలాలకు 'పూర్వోదయం'!

29.9 లక్షల ఎకరాలకు జల సిరులు

▸▸ రూ.14,100 కోట్ల కేంద్ర నిధులతో రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం

▸▸ రెండేళ్లలో పెండింగ్ నిర్మాణాలు పూర్తి.. ఉత్తరాంధ్రకు 5 వేల కోట్లు కేటాయింపు

▸▸ కోస్తాంధ్ర జిల్లాల్లో 9 వేల కోట్లతో పనులు.. కేంద్రానికి నివేదిక పంపనున్న ప్రభుత్వం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను వడివడిగా పూర్తి చేయడం ద్వారా పొలాలకు సమృద్ధిగా నీటిని అందించాలన్న బృహత్తర లక్ష్యం దిశగా ప్రభుత్వ ం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పూర్వోదయ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకోనుంది. ఈ పథకం కింద రూ.14,100 కోట్లను తీసుకువచ్చి రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయించింది. తద్వారా ప్రస్తుతం ఉన్న ఆయకట్టుతోపాటు కొత్త ఆయకట్టును కూడా స్థిరీకరించాలని జలవనరుల శాఖ భావిస్తోంది. పూర్వోదయ నిధులను ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు కేటాయించి, ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉత్తరాంధ్రలో రూ.5 వేల కోట్లతో 2,69,369 ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2,49,690 ఎకరాల ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించనున్నారు. కోస్తాంధ్రలో రూ.9100 కోట్ల నిధులు వెచ్చించి.. 1,27,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించాలని కార్యాచరణను సిద్ధం చేసింది. పూర్వోదయ పథకం ద్వారా రూ.14,100 కోట్లతో 3,97,339 ఎకరాల కొత్త ఆయకట్టు, 25,96,690 ఎకరాల ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించనున్నారు. దీనికి సంబంధించిన నివేదికను కేంద్రానికి పంపనున్నారు. ఈ ప్రతిపాదనలను అధికారులు ఇటీవల సీఎం చంద్రబాబు ముందు ఉంచారు. ఆర్థిక శాఖ ఆమోదం, సీఎం అనుమతి రాగానే కేంద్రానికి పంపాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. పూర్వోదయ పథకం కింద నిధులు అందగానే.. వచ్చే రెండేళ్లలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి.. పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందనుంది.

ప్రాజెక్టులు	బ్యాలెన్సు వ్యయం (రూ.కోట్లలో)	కొత్త ఆయకట్టు ఎకరాల్లో	స్థిరీకరణ ఎకరాల్లో
తోటపల్లి బ్యారేజీ	263.36	47188	-
తారకరామ తీర్థ రిజర్వాయర్	808.36	16538	8172
వంశధార ప్రాజెక్టు రెండో దశ గొట్టాబ్యారేజీ కుడి ప్రధానకాలువ-	171.91	20000	-
హిరమండలం రిజర్వాయర్	176.35	-	211364
మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్	506.68	24600	-
గజపతినగరం బ్రాంచి కెనాల్	218.07	15000	-
వంశధార-నాగావళి అనుసంధానం	72.5	5000	18527
మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ	30.04	7300	-
జంఝావతి ప్రాజెక్టు	59	4013	11627
నాగావళి-చంపావతి నదుల అనుసంధానం	21.53	-	-
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	2672.2	130000	-
ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల మొత్తం	5000	269639	249690
గోదావరి డెల్టా సిస్టమ్ కెనాల్స్ అభివృద్ధి	2500	-	1047000
కృష్ణా డెల్టాసిస్టమ్ కెనాల్స్ అభివృద్ధి	1000	-	13000001
బుడమేరు, ఉప్పుటేరు అభివృద్ధి	1500	-	-
బుడమేరు డైవర్షన్ కెనాల్	530	-	-
వరికెలపూడిశెల ఎత్తిపోతల	3100	84500	-
ఏఎస్ఆర్ సోమశిల హైలెవల్ కెనాల్ తొలిదశ	470	43200	-
కోస్తాంధ్ర ప్రాజెక్టుల మొత్తం	9100	127700	-



వైసీపీ హయాంలో గురజాల నియోజకవర్గంలో హత్యకు గురైన దళిత యువకుల ఫొటో చూపిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

12 మందిని పొట్టన పెట్టుకున్న

పాపం వైసీపీదే

▸▸ పల్నాడులో రక్తపుటేరులు పారించారు

▸▸ శవ రాజకీయాలు మానుకోకపోతే శాశ్వత సమాధే

▸▸ జగన్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి: యరపతినేని

గుంటూరు సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎక్కడ శవం కనిపిస్తుందా.. ఎప్పుడు రాజకీయం చేయాలా అని వైసీపీ నేతలు తెగ ఎదురు చూస్తుంటారని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో గురజాల నియోజకవర్గంలో 12 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం వాళ్లకే దక్కుతుందన్నారు. శనివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇద్దరు దళితుల మధ్య గొడవ జరిగి ఆ నేపథ్యంలో ఒకరిపై ఒకరు కర్రలతో దాడులకు పాల్పడ్డారని తెలిపారు. సాల్మన్ అనే వ్యక్తి తలకి బలమైన గాయం కావటంతో గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. వాస్తవానికి గొడవకు దిగిన ఇద్దరు దళిత యువకులూ ఏ పార్టీలోనూ అంత చురుకుగా ఉండే వారు కాదని యరపతినేని వెల్లడించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగి ఒకరు మరణిస్తే దానికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. ఇదే మహేష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని 12 మందిని అత్యంత కిరాతకంగా హత్యలు చేయించారని ఆరోపించారు. అంత మంది దళితులను దారుణంగా హత్య చేస్తున్నా అధికారంలో ఉన్న మహేష్ రెడ్డి కళ్లు మూసుకొని కూర్చున్నారని విమర్శించారు. కనీసం ఆ హత్యలపై సరైన ఎఫ్‌ఐఆర్‌లు కూడా నమోదు కాకుండా అడ్డుకున్నారని దుయ్యబట్టారు. అంతేకాకుండా కాసు ధన దాహానికి, అక్రమ మైనింగ్‌కు ముక్కుపచ్చలారని 8 మంది పిల్లలు చనిపోయారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పల్నాడులో రక్తపు టేరులు పారించి సీఎం హోదాలో ఉండి కూడా జగన్ రెడ్డి సైంధవుడి పాత్ర పోషించారని యరపతినేని మండిపడ్డారు. ఇప్పుడు అసలు పిన్నెల్లిలో ఏమి జరిగిందో తెలుసుకోకుండానే జగన్ విమర్శలు చేయటం అవివేకమని తెలిపారు. శవ రాజకీయాలు.. రఫ్ఫా.. రఫ్ఫా రాజకీయాలకు స్వస్తి పలకకపోతే రానున్న రోజుల్లో వైసీపీకి ప్రజలు శాశ్వత సమాధి కడతారని యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు.

వ్యక్తిగత గొడవలకు

రాజకీయ రంగు!

▸▸ జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలకు.. కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం విరుద్ధమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పల్నాడు ఘటనకు రాజకీయం చేసే ప్రయత్నం దురదృష్టకరమని, వ్యక్తిగత గొడవలకు కుల, రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడులో వైసీపీ ఐదేళ్ల పాలనలో హింస, దౌర్జన్యాలు రాజ్యమేలాయన్నారు.. పిన్నెల్లి సోదరుల అరాచకాలు.. వైసీపీ దాష్టీకానికి నిదర్శనాలని పేర్కొన్నారు. కుట్ర రాజకీయాలే వైసీపీ పతనానికి కారణమన్న విషయాన్ని విస్మరించి మళ్లీ అవే రాజకీయాలకు తెరతీస్తున్నారని విమర్శించారు. కుట్రలు చేసేవారు ఎవరైనా.. ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని మంత్రి స్పష్టంచేశారు.

రేపు ఏప్రిల్ నెల ఆర్జిత సేవల కోటా విడుదల

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఏప్రిల్ నెల కోటాను టీటీడీ సోమవారం విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల లక్కీడిప్ కోటాను ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు వీటి కోసం నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీన ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారసేవ, వసంతోత్సవం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవాటికెట్లు విడుదల చేస్తారు. అలాగే 23 ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి టోకెన్లు అందుబాటులో ఉంచుతారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం, 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటా విడుదల చేస్తారు. 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారిసేవా, పరకామణిసేవా టోకెన్లు కూడా విడుదల చేయనున్నారు. వీటికోసం భక్తులు 'టీటీడీదేవస్థానమ్స్ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ లేదా, 'టీటీడీదేవస్థానమ్స్' అనే మొబైల్ యాప్‌ను వినియోగించవచ్చు.



తిరుమల రింగురోడ్డులోని క్యూలో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పండుగ సెలవుల దృష్ట్యా తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. శనివారం సర్వదర్శనం కోసం భక్తులు భారీగా క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీవారి ఆలయం ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూకౌంటర్, ప్రధాన కూడళ్లు, బస్టాండ్, గదులు కేటాయించే కౌంటర్లు, కల్యాణకట్టలు, యాత్రికుల వసతి సముదాయాలు.. ఎక్కడ చూసినా భక్తజనంతో నిండిపోయి కనిపించాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు నిండిపోయి నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో కిటకిటలాడుతున్నాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 14 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే స్లాటెడ్ భక్తులకూ దాదాపు మూడు గంటల తర్వాతే దర్శనం లభిస్తోంది. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.


వచ్చే నెల 17న విశాఖకు రాష్ట్రపతి ముర్ము

▸▸ ఐఎఫ్ఆర్, మిలాన్‌కు ముఖ్య అతిథిగా హాజరు

విశాఖపట్నం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వచ్చే నెల 17వ తేదీన విశాఖపట్నం రానున్నారు. భారత నౌకాదళం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాష్ట్రపతి ముర్ము 17న నగరానికి చేరుకుని ఐఎన్ఎస్ చోళాలో బస చేస్తారు. 18న నేవీ ఫ్లీట్ రివ్యూలో పాల్గొని, అదేరోజు తిరిగి ఢిల్లీ వెళతారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగానికి, తూర్పు నౌకాదళం అధికారులకు అధికారిక సమాచారం వచ్చింది. కాగా, ఈ కార్యక్రమాల్లో భారత్‌తోపాటు, స్నేహపూర్వక దేశాలకు చెందిన 70 యుద్ధనౌకలు పాల్గొంటాయి. అలాగే, అమెరికా, జపాన్, రష్యా, ఆస్ట్రేలియా సహా 55 దేశాల ప్రతినిధులు ఈ అంతర్జాతీయ నౌకాదళ సమ్మేళనానికి హాజరవుతారు.

ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు నిబంధనల్లో సవరణలు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయాలనుకునే ప్రైవేటు యూనివర్సిటీలకు సంబంధించిన నిబంధనల్లో ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ మేరకు శనివారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు వర్సిటీల కోసం చేసుకునే దరఖాస్తులు ఎలా ఉండాలనే దానిపై తాజా ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. వర్సిటీల యాజమాన్యాలు.. డీపీఆర్, దరఖాస్తు, సంబంధిత డాక్యుమెంట్లు వంటి వివరాలను ఉన్నత విద్యాశాఖకు సమర్పించాలని తెలిపింది. ప్రైవేటు వర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద ఇచ్చే 35 శాతం సీట్లను ఉమ్మడి ప్రవేశ పరీక్షల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఆ సీట్లకు ఏపీ విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది. కన్వీనర్ కోటా మినహా మిగిలిన 65 శాతం సీట్లను యూనివర్సిటీలు వారి సొంత ప్రవేశ పరీక్షల ద్వారా భర్తీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. వీటితో పాటు మరికొన్ని వర్సిటీలకు మినహాయింపులు ఇచ్చింది.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

బొగ్గు కోసం... నీచ కథనం!

నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తన ప్రయోజనాలు కాపాడుకునేందుకు ఎన్టీవీ యాజమాన్యం హద్దు మీరింది. తమ మీడియా సంస్థను దుర్వినియోగం చేశారు. ఇక్కడ జర్నలిస్టులు బలిపశువులు అయ్యారుగానీ, పత్రికా స్వేచ్ఛకు ఏర్పడిన ముప్పు ఏమీ లేదు. పర్సనల్ వ్యవహారాల్లో అది నిజమైనా అబద్ధమైనా తలదూర్చే అధికారం ఎవరికీ ఉండదు. సమాజానికి నష్టం జరగనంత వరకు వ్యక్తిగత వ్యవహారాల్లో వేలుపెట్టే అధికారం మీడియాకు కూడా ఉండదు.

అసలేం జరిగింది? ఎన్టీవీ జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేయడానికి కారణమేమిటి? గతంలో ఎన్నడూ లేనంతగా అఖిల భారత సర్వీసు అధికారులు సదరు చానల్‌పై చర్యలు తీసుకోవాలనేంత పట్టుదల ఎందుకు ప్రదర్శిస్తున్నారు? మంత్రి కోమటిరెడ్డిని, మహిళా ఐఏఎస్ అధికారులను ఈ వివాదంలోకి ఎన్టీవీ లాగడం వెనుక ఏం జరిగింది? ఈ వ్యవహారంలో మీడియా హద్దులు దాటిందా? ఈ మొత్తం వ్యవహారానికి సింగరేణి సంస్థకు చెందిన నైనీ బొగ్గు బావి నుంచి బొగ్గు తవ్వకానికి సంబంధించిన టెండర్ కారణమా? భారత రాష్ట్ర సమితి నాయకులు విమర్శిస్తున్నట్టుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీడియాను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నదా? లేక మీడియానే ప్రభుత్వాన్ని లొంగదీసుకొనే ప్రయత్నం చేసిందా? ఈ వ్యవహారంపై బయట జరుగుతున్న ప్రచారమేమిటి? తెర వెనుక జరిగిందేమిటి? వ్యాపార ప్రయోజనాలకోసం మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమర్థనీయమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే అసలేం జరిగిందో తెలుసుకోవాలి! ఎక్కడో ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ కోసం టెండర్లు పిలవడమేమిటి? ఆ టెండర్ల ఖరారులో జాప్యం జరగడమేమిటి? ప్రతిగా ఎన్టీవీలో ఒక అనైతిక కథనం ప్రసారం అవడమేమిటి? ఇందులో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాత్ర ఏమిటి? ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రంగంలోకి ఎలా వచ్చారు? ఈ వ్యవహారం గురించి తెలిసి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉండిపోవలసి వచ్చింది? అని ప్రశ్నించుకుంటే మళ్లీ నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారమే మూల కారణమని స్పష్టమవుతుంది.

అప్పుడూ... ఇప్పుడూ...

నైనీ బ్లాక్ నుంచి బొగ్గు తవ్వి తీసే కాంట్రాక్టు భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు కూడా వివాదాస్పదమైంది. అప్పట్లో అదానీని ముందుపెట్టి ప్రతిమా శ్రీనివాస్‌కు చెందిన సంస్థకు ఈ కాంట్రాక్టు కట్టబెట్టాలని కేసీఆర్ ప్రభుత్వం యోచించింది. దీంతో అప్పట్లో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోరాటం చేశారు. తన సోదరుడికి చెందిన సుశీ హైటెక్ కంపెనీకి సదరు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన ఎంపీగా రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఫిర్యాదులు చేశారు. దీంతో అప్పట్లో ఆ టెండరు ఖరారు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగింది. ప్రతిమా శ్రీనివాస్‌ను దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన టెండర్‌ను రద్దు చేయడం జరిగింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మళ్లీ నైనీ బ్లాక్ వ్యవహారం తెర మీదకు వచ్చింది. ఇప్పుడు ఈ టెండర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎన్టీవీ అధిపతి నరేంద్ర చౌదరి ఆసక్తి చూపుతున్నారని... తాము తెరమీదకు తెచ్చిన సంస్థకు టెండర్ దక్కేలా టెండర్ నిబంధనలు రూపొందించారని అధికారులు చెబుతున్నారు. టెండర్‌లో పాల్గొనే సంస్థలు సదరు బొగ్గు బ్లాక్‌ను సందర్శించాలన్న వింత నిబంధనను విధించారు. బొగ్గు బ్లాక్‌ను ఎవరైనా సందర్శించవచ్చు కదా? అదేమి నిబంధన? క్షేత్ర స్థాయి పరిస్థితులు, ఓవర్ బర్డెన్ ఎంత అనేది నిర్ణయించుకోకుండా ఏ కంపెనీ అయినా రేట్ ఎలా కోట్ చేస్తుంది? అయినా, ఫీల్డ్ విజిట్ చేసి ఉండాలన్న నిబంధన విధించడం హాస్యాస్పదం కాదా? అస్మదీయులకు మాత్రమే టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించడానికే ఇటువంటి సిల్లీ నిబంధన విధించారని చిన్న పిల్లల్ని అడిగినా చెబుతారు. వ్యవహారం ఇంత దూరం రావడానికి కూడా ఈ నిబంధనే కారణం. క్షేత్ర స్థాయి సందర్శన ఏ కంపెనీ అయినా చేయవచ్చు కదా? ఇంత సింపుల్ నిబంధన పెట్టారేమిటి? అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది. అయితే ఇందులోనే తిరకాసు అంతా ఉంది. కావలసిన కంపెనీ వారికి మాత్రమే ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్‌ను అధికారులు జారీ చేస్తారు. తస్మదీయ కంపెనీలకు సర్టిఫికెట్ జారీ చేయరు. ఈ లొసుగును అడ్డు పెట్టుకొని కావాల్సిన కంపెనీకి నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయించడానికి స్కెచ్ సిద్ధమైంది. అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరగవు కదా! ఈ దశలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడైన అనిల్‌రెడ్డికి చెందిన సుశీ హైటెక్ కంపెనీ రంగంలోకి దిగింది. మైనింగ్ తవ్వకాల్లో ఈ కంపెనీకి అనుభవం ఉంది. పలు రాష్ట్రాలలో బొగ్గు తవ్వకాలు జరుపుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఒక్క కంపెనీకే టెండర్‌లో పాల్గొనే అర్హతలు ఉన్నాయి. అయితే, ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేయడంలో అధికారులు తాత్సారం చేయడంతో సింగరేణి సీఎండీ కృష్ణభాస్కర్‌కు ఆ కంపెనీ ఒక విజ్ఞాపన పత్రం అందజేసింది. దీంతో సుశీ హైటెక్ కంపెనీకి కూడా ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేయవలసిందిగా సదరు పత్రంపై సింగరేణి సీఎండీ ఎండార్స్ చేశారు. సీఎండీ ఆదేశాలు అమలైతే టెండర్లలో పోటీ ఏర్పడుతుంది. తాము అనుకున్న కంపెనీకి టెండర్ దక్కకపోవచ్చు అన్న ఉద్దేశంతో ఎన్టీవీని రంగంలోకి దించారు. ఈ వ్యవహారంలో ఎన్టీవీ ఎందుకు తలదూర్చిందన్న సందేహం కలగడం సహజం. ఈ టెండర్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందాలంటే పేరొందిన ఏదో ఒక కంపెనీ కావాలి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులకు మైనింగ్‌లో అనుభవం లేదు. ఎన్టీవీ అధిపతి నరేంద్ర చౌదరి అల్లుడికి కూడా అనుభవం లేదు. దీంతో మేఘా ఇంజనీరింగ్ కంపెనీని రంగంలోకి దించారు. మైనింగ్‌లో అనుభవం లేని మేఘా ఇంజనీరింగ్ కోసమే ఫీల్డ్ విజిట్ అనే నిబంధనను పెట్టారని అధికారులు చెబుతున్నారు. ఎన్టీవీ యజమాని చౌదరి అల్లుడికి చెందిన వెన్సర్ కంపెనీకి కూడా అర్హత లేనందున మేఘా, వెన్సర్‌లను కలిపి జాయింట్ వెంచర్‌గా ఏర్పాటుచేశారు. ఈ దశలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగప్రవేశం చేశారు. తన సోదరుడికి చెందిన సుశీ హైటెక్ కంపెనీకి ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేయవలసిందేనని ఆయన పట్టుబట్టారు. సుశీ హైటెక్ కంపెనీకి సర్టిఫికెట్ జారీ అయితే పోటీ ఏర్పడుతుంది. తమ స్కెచ్ అమలు కాదని భావించి ఒక అనైతిక కథనం వండి వార్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడి కంపెనీని పోటీ నుంచి తప్పించడానికి చేసిన ఈ ప్రయత్నాలు ఫలించలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇదే బొగ్గు బ్లాక్ కోసం ప్రధాన మంత్రిని సైతం కలిసి టెండర్లు రద్దు చేయించిన అనుభవం ఉన్న వెంకటరెడ్డి ఇప్పుడు కూడా సదరు బొగ్గు బ్లాక్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో వివాదం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. ఇదంతా కొంప ముంచే వ్యవహారంలా ఉందని భావించిన ముఖ్యమంత్రి సదరు టెండరును ఖరారు చేయకుండా వాయిదా వేయించారు. ఆ వెంటనే నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మంత్రి రాసలీలలు అని ఎన్టీవీలో కథనం ప్రసారమైంది. దీంతో మంటలు అంటుకున్నాయి. రాజకీయం–వ్యాపారం–జర్నలిజం అన్నీ కలగాపులగం అయ్యాయి.



ఏమిటీ బొగ్గు బ్లాక్?

ఒక బొగ్గు బ్లాక్‌ను దక్కించుకోవడానికి ఇంతమంది పోటీ పడటం ఏమిటి? అన్న అనుమానం ఏర్పడటం సహజం. 25 సంవత్సరాల పాటు అమలులో ఉండే ఈ కాంట్రాక్టు లభిస్తే పంట పండినట్టేనని మైనింగ్ రంగంలో అనుభవం ఉన్నవారు చెబుతున్నారు. ఈ కారణంగానే మైనింగ్‌లో తలపండిన కంపెనీలకు కూడా ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేయకుండా కట్టడి చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి చెందిన కంపెనీకి మైనింగ్‌లో అపారమైన అనుభవం ఉంది. అయినా ఆయన కంపెనీకి ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ దక్కలేదు. మంత్రి వెంకటరెడ్డి సోదరుడి కంపెనీదీ అదే పరిస్థితి. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సింగరేణి సంస్థ ప్రధానంగా ముఖ్యమంత్రి అదుపాజ్ఞల్లోనే ఉండింది. ఇప్పుడు మాత్రం సింగరేణి సంస్థ అన్ని విధాలుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కిందే ఉంది. దీంతో సదరు సంస్థలకు ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్లు జారీ కాకుండా అధికారులను భట్టి విక్రమార్క కట్టడి చేస్తున్నారన్న భావం పోటీదారుల్లో ఏర్పడింది. ఈ పరిణామం భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య విభేదాలకు కారణమైంది. వెంకటరెడ్డి సోదరుడి కంపెనీని పోటీ నుంచి తప్పించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో వివాదం ముదిరింది. వెంకటరెడ్డి వల్ల తమ లక్ష్యం దెబ్బ తింటున్నదని భావించిన ఎన్టీవీ యాజమాన్యం రంగంలోకి దిగింది. ఫలితమే మంత్రి రాసలీలలు అనే కథనం. ఈ కథనం ప్రసారమైన తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. నల్లగొండ జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన ఇద్దరు మహిళా ఐఏఎస్ అధికారులను ఇందులోకి లాగడంతో అఖిల భారత సర్వీసు అధికారులు భగ్గుమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని దృష్టిలో పెట్టుకొని రాసలీలలు అనే కథనం ప్రసారం చేయడం కూడా వికటించింది. వెంకటరెడ్డి అటువంటివారు కాదన్న అభిప్రాయం బలంగా ఉండటంతో ఈ కథనంపై ప్రజల్లో కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కుమారుడి మరణం తర్వాత రాజకీయాల్లో ఉంటూనే వెంకటరెడ్డి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మహిళలతో ఆయన అనుచితంగా ప్రవర్తించిన దాఖలాలు కూడా లేవు. అదే సమయంలో ఎన్టీవీలో ప్రస్తావించిన మహిళా ఐఏఎస్ అధికారులకు కూడా మంచి పేరుంది. ఈ కథనం ప్రసారమైన తర్వాత సదరు అధికారులు తమ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. మానసికంగా కుంగిపోయారు. ఆ ఇద్దరిలో ఒక అధికారిణి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నం చేశారు. ఈ పరిణామంతో అఖిల భారత సర్వీసు అధికారులంతా ఒక్క తాటిపైకి వచ్చారు. ఐఏఎస్ అధికారులతో ఐపీఎస్ అధికారులు కూడా చేతులు కలిపారు. ఆ వెంటనే సదరు కథనాన్ని ప్రసారం చేసిన చానల్‌పై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా అసోసియేషన్ తరఫున ఫిర్యాదు చేశారు.

చేతిలో మీడియా ఉందని అమాయకులైన ఆడవాళ్లకు మరక అంటించే ప్రయత్నం చేస్తే ప్రభుత్వంలో కీలక భూమిక పోషించే అధికారులు చేతులు ముడుచుకొని ఉంటారా? తప్పుచేసినవాళ్లు ఎవరైనా పర్యవసానాలకు సిద్ధం కావాల్సిందే. మినహాయింపులు ఉండవు. ఈ మొత్తం వ్యవహారం అన్ని మీడియా సంస్థలకు ఒక హెచ్చరిక!

అసాధారణ సిట్...

పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి శాంతించవలసిందిగా కోరారు. వివాదం ముదరకుండా ముగింపు పలకాలని అభ్యర్థించారు. అయితే, అధికారులు ఇందుకు తిరస్కరించారు. అధికారుల అవినీతిపై కథనాలు ప్రసారం చేస్తే సహించగలం కానీ మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో భట్టి విక్రమార్క నిస్సహాయంగా ఉండిపోయారు. సదరు సమావేశానికి హాజరైన అధికారులు అంతటితో ఆగకుండా ఎన్టీవీ కథనంపై సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. నిజానికి సిట్ ఏర్పాటులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా ప్రమేయం లేదు. అధికారుల స్థాయిలోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదొక అసాధారణ పరిణామం. అధికారుల మనోభావాలు ఏ స్థాయిలో దెబ్బతిన్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. పత్రికా స్వేచ్ఛ పేరిట మీడియా హద్దులు దాటితే ఏం జరుగుతుందనడానికి ఇదొక ఉదాహరణ. సిట్ ఏర్పాటు నిర్ణయం తర్వాత పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సిట్ అధికారులు ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ అధికారులకు లుక్ ఔట్ నోటీసులు పంపించారు. ఫలితంగానే ఎన్టీవీకి చెందిన దొంతు రమేశ్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. తమ చానల్‌లో ప్రసారమైన కథనంతో తమకు సంబంధం లేదని, తమ చైర్మన్ నరేంద్ర చౌదరి ఆదేశాల మేరకే ఆ కథనాన్ని రూపొందించామని ఎన్టీవీకి చెందిన జర్నలిస్టులు పోలీసుల విచారణలో చెప్పారు. దీంతో సిట్ అధికారుల తదుపరి చర్యలపై పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. న్యాయంగా అయితే ఈ వ్యవహారంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం సమర్థనీయం కాదు. చైర్మన్ ఆదేశాల మేరకే సదరు కథనాన్ని ప్రసారం చేశామని జర్నలిస్టులు చెప్పినందున చర్యలంటూ తీసుకుంటే చైర్మన్‌పై తీసుకోవాలి. ఈ విషయమై జర్నలిస్టు నాయకులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు సమర్థనీయమే.

గతంలో అధికారంలో ఉన్నప్పుడు నైనీ బ్లాక్‌ను తన వాళ్లకు కట్టబెట్టడానికి ప్రయత్నించి కేసీఆర్ విఫలమయ్యారు. ఇప్పుడు అదే బ్లాక్ నుంచి ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిన భట్టి విక్రమార్క, ఎన్టీవీ నరేంద్ర చౌదరి అల్లరిపాలయ్యారు. కాంగ్రెస్ హై కమాండ్‌కు కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. ప్రస్తుత పరిస్థితులలో టెండర్లు రద్దు చేసి పారదర్శక నిబంధనలతో మళ్లీ టెండర్లు పిలిచి వీలైనంత ఎక్కువ మంది పోటీపడేలా చర్యలు తీసుకోవడం వాంఛనీయం. బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా ఇలాగే చేస్తుంది.

చరిత్ర మరిచిన కేసీఆర్, జగన్

విచిత్రం ఏమిటంటే, తాము అధికారంలో ఉన్నప్పుడు గిట్టని మీడియా సంస్థలను, అందులో పనిచేసే జర్నలిస్టులను వేధించిన కేసీఆర్ అండ్ కో, జగన్ అండ్ కో ఇప్పుడు ఎన్టీవీ తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారు. ఎన్టీవీ విషయంలో జరగరానిదేదో జరిగిపోయినట్టుగా కేసీఆర్ సొంత పత్రికలో పేజీల కొద్దీ కథనాలు వండి వార్చారు. ఇదే కేసీఆర్ తాను అధికారంలో ఉన్నప్పుడు 'ఆంధ్రజ్యోతి' పత్రికకు ప్రకటనలు ఇవ్వకుండా వేధించిన విషయం తెలిసిందే. ఏబీఎన్ ప్రసారాలను తెలంగాణలో అకారణంగా నిలిపివేయించారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వబోమని ప్రకటించిన తెంపరితనం కేసీఆర్ సొంతం. అలాంటి కేసీఆర్ అండ్ కో ఇప్పుడు దెయ్యాలు వేదాలను వల్లిస్తున్నట్టుగా ఎన్టీవీ విషయంలో ప్రకటనలు చేస్తున్నారు. ఇక.. జగన్‌రెడ్డి విషయంలో ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. జర్నలిస్టులు, మీడియా సంస్థల అధిపతులపై ఏకంగా రాజద్రోహం కేసులు పెట్టించిన ఘనత ఆయన సొంతం. గిట్టని మీడియాపై ఆయన ఇప్పటికీ నిషేధం అమలు చేస్తున్నారు. తన ఇల్లు, పార్టీ పరిసరాల్లోకి కూడా ఆయా మీడియా సంస్థల ప్రతినిధులను రానివ్వరు. తమాషా ఏమిటంటే, చెడును సమర్థించడంలో కేసీఆర్, జగన్‌లది ఒకే మాట ఒకే బాటగా ఉంటుంది.

స్వేచ్ఛ... బాధ్యత!

ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ విషయానికి వద్దాం! మీడియాకు స్వేచ్ఛ ఎంత ముఖ్యమో హద్దులు కూడా అంతే ముఖ్యం. ప్రింట్ మీడియా ఇప్పటికీ ఎంతో కొంత బాధ్యతతో పని చేస్తోంది. ఎలక్ట్రానిక్ మీడియా, అది కూడా యూట్యూబ్ చానళ్లు వచ్చిన తర్వాత పరిస్థితి అదుపు తప్పింది. విచ్చలవిడితనం పెరిగిపోయింది. ప్రజల్లో కూడా ఈ ధోరణిపై ఏహ్యభావం ఏర్పడింది. ఈ కారణంగానే ఎన్టీవీ విషయంలో పోలీసుల చర్యపై వ్యతిరేకత ఏర్పడకపోగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, సదరు కథనంలోకి లాగబడిన మహిళా అధికారులపై సానుభూతి ఏర్పడింది. వారికి వివిధ వర్గాల నుంచి మద్దతు లభించింది. రోడ్డు ప్రమాదంలో కుమారుడి మరణంతో సగం చచ్చిపోయానని, ఇప్పుడు ఈ కథనంతో మిగతా సగం కూడా చచ్చిపోయానని వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఆయనపై సానుభూతి అమాంతంగా పెరిగిపోయింది. ఎన్టీవీలో ప్రసారమైన కథనం జర్నలిజం ప్రమాణాలకు పూర్తి విరుద్ధం. ఇలాంటి కథనాన్ని ప్రసారం చేయడానికి ఆ సంస్థలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులు ఎలా అనుమతించారో తెలియదు! యాజమాన్యం చెప్పినంత మాత్రాన ఏది పడితే అది ఎలా ప్రసారం చేస్తారు? ఎలా ప్రచురిస్తారు? ఇది ఆత్మవంచనే అవుతుంది. అనుచిత కథనాలను ప్రసారం చేయాలని లేదా ప్రచురించాలని యాజమాన్యం కోరినప్పటికీ వద్దని వారించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని, ఉండాలని మేం నమ్ముతున్నాం. మా సంస్థలలో ఈ సూత్రాన్ని పాటిస్తున్నాం! ఏదైనా అంశంపై భిన్నాభిప్రాయాలు తలెత్తినప్పుడు మెజారిటీ అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకుంటాం. అంతెందుకు! నేను ప్రతివారం రాసే వీకెండ్ కామెంట్/ కొత్త పలుకును కూడా తప్పొప్పుల పరిశీలనకోసం ఐదారుగురు సీనియర్లకు పంపుతాను. నా దృష్టిలో ఒప్పు అనుకున్నది ఇతరుల దృష్టిలో తప్పు కావచ్చు. అందుకే సీనియర్ల పరిశీలనకు పంపుతాను. ఎన్టీవీ విషయంలో అసలేం జరిగిందో ఇప్పుడు స్పష్టమైంది కనుక ప్రభుత్వం తరఫున తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయో వేచి చూడాలి. మీడియా రంగంలో ఉన్నవారు ఇతరత్రా వ్యాపారాలు ఏవీ చేయకూడదన్న నియమం ఏమీ లేదు. ప్రభుత్వంలోని పెద్దలతో ఏర్పడే సాన్నిహిత్యం వల్ల మీడియా రంగంలో ఉండేవారికి ఇతరత్రా వ్యాపారాల్లో కొన్ని వెసులుబాట్లు కూడా లభించవచ్చు. అనుకున్నదాన్ని సాధించడం కోసం మీడియాను దుర్వినియోగం చేసినప్పుడే సమస్యలు వస్తాయి. నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తన ప్రయోజనాలు కాపాడుకునేందుకు ఎన్టీవీ యాజమాన్యం హద్దు మీరింది. తమ మీడియా సంస్థను దుర్వినియోగం చేశారు. ఇక్కడ జర్నలిస్టులు బలిపశువులు అయ్యారుగానీ, పత్రికా స్వేచ్ఛకు ఏర్పడిన ముప్పు ఏమీ లేదు. పర్సనల్ వ్యవహారాల్లో అది నిజమైనా అబద్ధమైనా తలదూర్చే అధికారం ఎవరికీ ఉండదు. సమాజానికి నష్టం జరగనంత వరకు వ్యక్తిగత వ్యవహారాల్లో వేలుపెట్టే అధికారం మీడియాకు కూడా ఉండదు.

ఈ కేసులో జర్నలిస్టులు బలిపశువులు అయ్యారని చెప్పడంలో తప్పు లేదుగానీ సదరు కథనంలో పేర్కొన్న మహిళా ఐఏఎస్ అధికారుల పరిస్థితి ఏమిటి? వారి మానసిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి కదా!

తస్మాత్ జాగ్రత్త...

ఎన్టీవీ సదరు కథనాన్ని ప్రసారం చేయడం వెనుక ఎవరున్నారు? ఏం జరిగింది? ఎవరి ప్రయోజనాలు అందులో ఇమిడి ఉన్నాయి? వంటి ప్రశ్నలు ఇప్పుడు బహిరంగ రహస్యాలుగా మారాయి. నైనీ బొగ్గు బ్లాక్‌ను సొంతం చేసుకొనే క్రమంలోనే ఇదంతా జరిగిందని తేటతెల్లమైంది. ఈ కేసులో జర్నలిస్టులు బలిపశువులు అయ్యారని చెప్పడంలో తప్పు లేదుగానీ సదరు కథనంలో పేర్కొన్న మహిళా ఐఏఎస్ అధికారుల పరిస్థితి ఏమిటి? వారి మానసిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి కదా! వారికి కూడా సంసారాలు ఉంటాయి. వారిని కూడా బలి పశువులను చేశారు కదా? ఆడపిల్లలను బజారుకు ఈడ్చడం నేరమే కాదు పాపం కూడా! వ్యాపార ప్రయోజనాల కోసం మీడియా ముసుగులో ఏమైనా చేయవచ్చునని అనుకుంటే కుదరదని ఈ సంఘటనతో స్పష్టమవుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అనేక తప్పులు జరిగాయి.

ఇదే బొగ్గు బ్లాక్ కోసం ప్రధాన మంత్రిని సైతం కలిసి టెండర్లు రద్దు చేయించిన అనుభవం ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పుడు కూడా సదరు బొగ్గు బ్లాక్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో వివాదం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. ఇదంతా కొంప ముంచే వ్యవహారంలా ఉందని భావించిన ముఖ్యమంత్రి సదరు టెండరును ఖరారు చేయకుండా వాయిదా వేయించారు. ఆ వెంటనే నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మంత్రి రాసలీలలు అని ఎన్టీవీలో కథనం ప్రసారమైంది. దీంతో మంటలు అంటుకున్నాయి. రాజకీయం– వ్యాపారం–జర్నలిజం అన్నీ కలగాపులగం అయ్యాయి.

ఎందరికో భాగస్వామ్యం ఉంది. నైనీ బొగ్గు బ్లాక్‌ను సొంతం చేసుకోగలిగితే పాతికేళ్లలో కొన్ని వందల కోట్లు వెనకేసుకోవచ్చునని దానికోసం పోటీపడుతున్నవారు లెక్కలు వేసుకున్నారు. ఇప్పుడీ వ్యవహారం బయటకు పొక్కడంతో మొదటికే మోసం వచ్చే పరిస్థితి. ఒక మీడియా సంస్థ మితిమీరిన అహంభావంతో ప్రసారం చేసిన కథనం వల్ల డామిట్ కథ అడ్డం తిరిగిందని లబోదిబోమనే పరిస్థితి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఇప్పుడు వివాదంలోకి లాగబడ్డారు. ఇప్పుడీ వ్యవహారం వ్యక్తుల మధ్య వివాదం ఎంత మాత్రం కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. ఇది కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారం కూడా కాదు. మంత్రుల మధ్య ఏర్పడిన వివాదం ఇవాళ కాకపోతే రేపు సమసిపోవచ్చు. సింగరేణి సంస్థ ప్రయోజనాల మాటేమిటి? గతంలో అధికారంలో ఉన్నప్పుడు నైనీ బ్లాక్‌ను తన వాళ్లకు కట్టబెట్టడానికి ప్రయత్నించి కేసీఆర్ విఫలమయ్యారు. ఇప్పుడు అదే బ్లాక్ నుంచి ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిన భట్టి విక్రమార్క, ఎన్టీవీ నరేంద్ర చౌదరి అల్లరిపాలయ్యారు. కాంగ్రెస్ హై కమాండ్‌కు కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. ప్రస్తుత పరిస్థితులలో టెండర్లు రద్దు చేసి పారదర్శక నిబంధనలతో మళ్లీ టెండర్లు పిలిచి వీలైనంత ఎక్కువ మంది పోటీపడేలా చర్యలు తీసుకోవడం వాంఛనీయం. బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా ఇలాగే చేస్తుంది. తెలుగునాట మీడియా విశ్వసనీయత దెబ్బతింటున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఉదంతంతో మీడియాపై ప్రజల్లో మరింత చులకనభావం ఏర్పడుతుంది. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, మీడియా సంస్థలు తమ హద్దుల్లో ఉంటే మంచిది. అధికారం ఉందికదా అని ఏమైనా చేయవచ్చునని రాజకీయ నాయకులు, పత్రికా స్వేచ్ఛ పేరిట ఏమైనా చేయవచ్చునని మీడియా సంస్థలు భావించినా కుదరదని ఈ ఉదంతంతో స్పష్టమవుతోంది. తస్మాత్ జాగ్రత్త! పొరపాటు చేశామని అంగీకరించి ఎన్టీవీ యాజమాన్యం మొక్కుబడిగా కాకుండా బేషరతుగా క్షమాపణలు చెప్పి ఉండాల్సింది. అలా చేయకపోగా 'నిజం చెబితే కేసులు పెడతారా?' అని హూంకరించడం ఆత్మవంచనే అవుతుంది. చేతిలో మీడియా ఉందని అమాయకులైన ఆడవాళ్లకు మరక అంటించే ప్రయత్నం చేస్తే ప్రభుత్వంలో కీలక భూమిక పోషించే అధికారులు చేతులు ముడుచుకొని ఉంటారా? తప్పుచేసినవాళ్లు ఎవరైనా పర్యవసానాలకు సిద్ధం కావాల్సిందే. మినహాయింపులు ఉండవు. ఈ మొత్తం వ్యవహారం అన్ని మీడియా సంస్థలకు ఒక హెచ్చరిక అని చెప్పడంలో తప్పు లేదు!

నేను బతికి ఉన్నానని తెలిసింది అలాగే!

సుమారు మూడేళ్ల క్రితం అనుకుంటా... రాజకుమారి ఇందిరాదేవి ధనరాజ్‌గిర్‌ని నేను తొలిసారి కలిసింది. జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌కు వెళ్తూ ఓల్డ్ సిటీలో దారి తప్పితే ఆవిడ నాకు వరుసగా కాల్స్ చేస్తూ దారి చెబుతూనే ఉన్నారు. ఆవిడతో మాట్లాడుతుంటే బాగా సన్నిహితమైన మనిషితో సంభాషిస్తున్నట్లే అనిపించింది. నేను తిరిగి వచ్చేస్తుంటే... 'మళ్లీ ఎప్పుడు వస్తారు?' అని అడిగారు. ఆ తర్వాత వృత్తిపరంగా.. స్నేహపూర్వకంగా కలుస్తూనే ఉన్నాం. మంగళవారం సాయంత్రం ఆమె మరణించారని తెలిసిన వెంటనే వెలితిగా అనిపించింది. ఆమె నుంచి ఇక మెసేజ్‌లు రావంటే బెంగగా అనిపించింది. "అన్‌వెల్.. గ్రేట్ ఫుల్ టూ యూ" అనేది శుక్రవారం నాకు పంపిన ఆఖరి మెసేజ్. "మీ ఆరోగ్యం త్వరలోనే మెరుగుపడుతుంది.. త్వరగా కలుద్దాం.." అని నేను రిప్లై ఇచ్చాను. స్పందన లేదు. 96 ఏళ్ల వయస్సులో... అనారోగ్యం పట్టి పీడిస్తున్నా... సన్నిహితులతో కనెక్ట్ కావాలనే కాంక్షతో ఆమె మెసేజ్‌లు పంపటం– జీవితం పట్ల ఆమెకు ఉన్న మమకారానికి ప్రత్యక్ష సాక్ష్యం.

మొదట్లో రాజకుమారి నన్ను 'ప్రసాద్ గారు' అని పిలిచేవారు. ఒక రోజు– మీరు వయస్సులో నా కన్నా చాలా పెద్దవారు.. నాకు 'గారు' అని తగిలించద్దు.. ప్రసాద్ అని పిలవండి" అన్నా. నవ్వేసి "నా బంధువులు.. కొందరు ముఖ్యమైన స్నేహితులు నన్ను 'అక్క రాజే' అని పిలుస్తారు. నువ్వు అలాగే పిలు.." అన్నారు. ఆ రోజు నుంచి ఆమె నాకు 'అక్క రాజే'నే! కానీ ఆవిడ మాత్రం ఎప్పుడూ 'ప్రసాద్ గారు' అని పిలిచేవారు. నెల రోజుల క్రితం ఆవిడ పుస్తకం– 'అలనాటి కథ' ముందుమాటలో– 'ప్రసాద్' అని ఉంటే కొట్టేసి– 'ప్రసాద్‌గారు' అని రాశారు. వ్యక్తులకు గౌరవం ఇవ్వటం బహుశా ఆవిడకు చిన్నప్పుడే నేర్పిన విద్య అనుకుంటా! ఈ సందర్భంలో ఇంకో జ్ఞాపకం గుర్తుకొస్తోంది. వయస్సులో కొద్దిగా చిన్నదయినా– ప్రిన్సెస్ ఎస్రాతో ఆమెకు మంచి అనుబంధం ఉండేది. సుమారు ఏడాది క్రితం కొత్త నిజాం పట్టాభిషేకం జరిగినప్పుడు– ప్రిన్సెస్ ఎస్రా గౌరవార్థం ఆమె ఒక విందు ఇచ్చారు. హైదరాబాద్, మహారాష్ట్రలలో ఉన్న అనేక మంది రాజకుటుంబీకులు ఆ విందుకు వచ్చారు. బహుశా ఆ అతిథుల్లో సామాన్యుడిని నేనొక్కడినే అనుకుంటా! అప్పటికే ఆమె ఎక్కువ సేపు నిలబడలేని స్థితిలో ఉన్నారు. అయినా ప్రిన్సెస్ వచ్చిన వెంటనే లేచి నిలబడి నన్ను పరిచయం చేశారు. ఆ తర్వాత– "మీరు స్నేహితులే కదా.. ఎందుకు లేచి నిలబడ్డారు?" అని అడిగాను. నవ్వేసి– "మా నాన్న రాజా. వాళ్ల మామ గారు నిజాం.. వాళ్ల అబ్బాయి ప్రస్తుత నిజాం" అన్నారు. ఇలా సంప్రదాయాలను పాటించే వ్యక్తులు బహుశా మన చుట్టూ అతి తక్కువ మంది ఉంటారనుకుంటా!




రాజకుమారితో మాట్లాడుతుంటే చరిత్రలో సుప్రసిద్ధమైన వ్యక్తులందరూ కళ్ల ముందుకు వచ్చి నిలిచేవారు. భుట్టో రాసిన ప్రేమలేఖలు గురించి.. ప్రిన్సెస్ ఎస్రా తిరుపతి యాత్ర గురించి.. పంజాబ్ యువరాజుతో ప్రేమ పెళ్లి దాకా వచ్చి తప్పిపోవటం గురించి.. ఊటీలో శేషేంద్ర రాసిన కవిత్వం గురించి.. ఎన్టీఆర్ కుటుంబం గురించి.. ముఖ్దుంతో కవిత్వ చర్చల గురించి.. జనరల్ మానెక్ షా అందమైన భార్య గురించి.. నెహ్రూ నుంచి తీసుకున్న ఆటోగ్రాఫ్ గురించి.. నిజాం చనిపోయిన తర్వాత వారి కుటుంబ వ్యవహారాల గురించి.. చిన్నప్పుడు పిఠాపురం మహారాణి భారతీదేవి ఇంట్లో గోడ దూకి కాలు విరగ్గొట్టుకోవటం గురించి.. సి.కె.నాయుడు తనతో ఆడిన క్రికెట్ గురించి– వందల విషయాలు వచ్చిపోతూ ఉండేవి. ఏరుకోవాలే తప్ప– అన్నీ చరిత్రలో నిలిచే ఆణిముత్యాలే!

ఆంధ్రజ్యోతి– నవ్య డైలీలో ఆమె రాసిన కాలమ్‌కు చాలా మంచి పేరు వచ్చింది. ఆమెకు ఆరోగ్యం సహకరించకపోవటంతో కాలమ్‌ను ఆపివేయాల్సి వచ్చింది. తన సహచరుడు, కవిమిత్రుడు, భర్త శేషేంద్ర శర్మ మరణం తర్వాత రాజకుమారి చాలా వేదనకు గురయ్యారు. తన చుట్టూ ఉన్నవారికి దూరంగా జరిగారు. 'నవ్య' కాలమ్ ద్వారా మళ్లీ వారికి దగ్గరయ్యానని.. మళ్లీ అందరూ పలకరిస్తుంటే ఆనందంగా ఉందని చెప్పిన సందర్భాలెన్నో! 'ఈ కాలమ్‌తో నేను బతికి ఉన్నానని చాలా మందికి తెలిసింది' అనేవారు. ఇక గుంటూరు శేషేంద్ర శర్మ ద్వారా పరోక్షంగా.. ఉర్దు అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రత్యక్షంగా తెలుగు రాష్ట్రాలకు ఆమె ఎంతో భాషా సేవ చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)కి, సీసీఎంబీకి కూడా ఆమె అనేక ఎండోమెంట్స్ అందచేశారు. అనేక స్వచ్ఛంద సంస్థలకు కూడా ప్యాట్రన్‌గా ఉండేవారు.

శేషేంద్ర మరణం తర్వాత ఆమె తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. ప్యాలెస్ నుంచి అరుదుగా బయటకు వచ్చేవారు. కాలంతో పాటు ఆమె స్నేహితులందరూ చరిత్రలో కలిసిపోయారు. చాలా దురదృష్టకరమైన విషయమేమిటంటే– ఆమెతో అనేక సందర్భాలో జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌లో విందుల్లో పాల్గొన్న రాజకుటుంబీకులెవ్వరూ ఆమె అంత్యక్రియలకు హాజరు కాకపోవటం. వందలాది మంది మధ్య రాజలాంఛనాలతో జరగాల్సిన ఆమె అంత్యక్రియలు– అత్యంత నిడారంబరంగా– తెలుగు బ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో జరగటం. చివరి రోజుల్లో ఆమెకు రెండు కోరికలు ఉండేవి. ఒకటి– బేగంబజార్‌లో 250 ఏళ్ల నాడు కట్టిన తన తాతల సమాధుల పరిరక్షణ. జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ సమీపంలో ఉన్న తన తండ్రి భవంతి పునరుద్ధరణ. ఈ రెండు తీరకుండానే ఆమె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఆమెతో పాటుగా 150 ఏళ్ల చరిత్ర ఉన్న జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ కూడా చరిత్రలో కలిసిపోవచ్చు. హైదరాబాద్ చరిత్రలో మరొక రాణి నిశబ్దంగా ఎవ్వరికీ తెలియకుండానే నిష్క్రమించింది. జీవితం పట్ల ఆమెకు ఉన్న ఆసక్తికి.. అనురక్తికి నివాళి!

• సి.వి.ఎల్.ఎన్. ప్రసాద్ (సీనియర్ జర్నలిస్ట్)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 18 జనవరి 2026



నరకాసురుడు

- 12 మందిని పొట్టన పెట్టుకున్నారు
- కూలీ డబ్బులు అడిగితే కుత్తుకలు కోశారు
- అందరూ దళితులు, బీసీ, ముస్లిం, కాపులే
- హత్యలు తర్వాత ఎఫ్ఐఆర్‌లు కూడా కానివ్వలేదు
- 8 మంది చిన్నారులు చనిపోతే సమీక్ష లేదు
- ప్రశాంతంగా ఉన్న గురజాల జోలికొస్తే ఊరుకోను
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



వైసీపీ హయాంలో గురజాల నియోజకవర్గంలో హత్యకు గురైన దళిత యువకులు, క్వారీలో పడి మరణించిన చిన్నారుల ఫొటోలు చూపిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'ఎక్కడ శవం దొరికితే అక్కడ ప్రత్యక్షం అయ్యి రాజకీయాలు చేయాలనుకునే మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డికి.. మనిషికి ఉండాల్సిన కనీస మానవత్వం లేదు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 12 మందిని పొట్టన పెట్టుకున్నారు. చివరికి కూలీ డబ్బులు అడిగితే పేగులు బయటకు వచ్చేలా పొడిచి చంపారు. కాసు అక్రమ మైనింగ్ పాపానికి 8 మంది చిన్నారులు చనిపోయారు. కానీ, ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదు. తన కుమార్తె వయసు ఉన్న పిల్లలు చనిపోతే సరిగా పట్టించుకోని నరకాసురుడు.. ఇప్పుడు వట్టి అరుపులు అరుస్తున్నాడు' అంటూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు.

గుంటూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పిన్నెల్లి ఘటనలో మృతి చెందిన సాల్మన్‌రాజు, దాడికి పాల్పడ్డ పేతురు ఇద్దరూ దళితులేనని, వారి మధ్య జరిగింది పూర్తిగా వ్యక్తిగత గొడవేనని ఆయన పునరుద్ఘాటించారు. మాటామాటా పెరిగి పేతురు కర్రతో దాడి చేయడంతో సాల్మన్ మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనకు రాజకీయ ప్రేరణ లేదని, ఇద్దరూ (మిగతా 8వ పేజీలో)

సరస్..సక్సెస్!



సందర్శకులతో రద్దీగా ఉన్న సరస్ మేళా

- గుంటూరు బ్రాండ్ ఇమేజ్ పెంచిన మేళా!
- దాదాపు 13 లక్షల మంది సందర్శన
- నేటితో ప్రదర్శన, విక్రయాల ముగింపు
- మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ

8



అంగన్వాడీ మరింత స్మార్ట్!



గుంటూరు జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు, సీడీపీవోలకు కలిపి 1,541, పల్నాడు జిల్లాలో 2,098, బాపట్ల జిల్లాలో 3 వేల 5జీ స్మార్టు ఫోన్లు ప్రభుత్వం పంపిణీ చేసింది.

- కార్యకర్తలకు 5జీ స్మార్ట్ ఫోన్లు
- మూడు జిల్లాల్లో 6,639 పంపిణీ
- సులభతరమైన యాప్‌ల నిర్వహణ
- రికార్డుల భారాన్ని తగ్గించిన ఐసీడీఎస్
- పనితీరు, పదార్థాల నాణ్యతపై ఐవీఆర్ఎస్ సర్వే

ఎప్పటి కప్పుడు సర్వే

అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై స్వయంగా రాష్ట్ర ఉన్నతాధికారులే సర్వే చేస్తున్నారు. లబ్ధిదారుల మొబైల్ నంబర్లకు కాల్ చేసి ఐవీఆర్ఎస్ పద్ధతి ద్వారా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పోషణ వివరాలు తెలుసుకుంటున్నారు. సరఫరా అవుతున్న పదార్థాల నాణ్యత, పరిమాణంపై అభిప్రాయాలు ప్రతి నెలా సేకరిస్తున్నారు.

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల సేవలను కూటమి ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. అంగన్వాడీ కార్యకర్తలందరికీ 5జీ స్మార్ట్ ఫోన్లు ఇవ్వడంతో వారి పని మరింత మెరుగవుతోంది. దీంతో దాదాపు 15 ఏళ్ల క్రితం ఇచ్చిన మొబైల్స్ పనిచేయక అవస్థలు పడ్డ అంగన్వాడీల కష్టాలు తీరనున్నాయి.

మూడు జిల్లాల్లో 6,639 స్మార్ట్ ఫోన్లు

గుంటూరు జిల్లాలో 1,480, పల్నాడు జిల్లాలో 2,031 అంగన్వాడీలు ఉన్నాయి. వీటి ద్వారా 50 వేల మంది గర్భిణులు, 55 వేల మంది బాలింతలు, 1.15 లక్షల మంది మూడేళ్లలోపు చిన్నారులు, 1.40 లక్షల మంది 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రతి నెలా పోషకాహారాన్ని అందిస్తున్నారు. బాపట్ల జిల్లాలో మరో 3 వేల అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా అందించే పౌష్టికాహారం, హాజరు నమోదు చేయడానికి స్మార్ట్ ఫోన్లు ఎంతో అవసరం. అయితే గతంలో ఇచ్చిన 4జీ స్మార్ట్ ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రభుత్వం కొత్త స్మార్ట్ ఫోన్లు అందజేసింది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు అంగన్వాడీ కార్యకర్తలు స్మార్ట్ ఫోన్ల కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. అయినా ప్రభుత్వం పట్టించు కోలేదు.

తప్పిన యాప్‌ల నిర్వహణ కష్టాలు

అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్‌లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. రెండు యాప్‌లలో ప్రతి రోజూ మరుగుదొడ్లు, ప్రీ-స్కూలు నిర్వహించి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. నెలకు రెండుసార్లు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ముఖ ఆధారిత హాజరు తీసుకోవాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. వీటిన్నంటి నిర్వహణకు గతంలో ఉన్న స్మార్ట్ ఫోన్లు అందుకు ఎంతమాత్రం సహకరించ లేదు.

15 రకాల రికార్డుల మోత తగ్గింపు

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. ఒక్కో అంగన్వాడీ ఉద్యోగి 15 రికార్డులు నమోదు చేయాల్సి ఉండేది. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రీస్కూల్ అటెండెన్స్, గర్భిణి, బాలింతల రికార్డులు ప్రతి రోజూ నమోదు చేయాలి. వాటితో పాటు ఎప్పటికప్పుడు టీకా రికార్డు, విటమిన్ ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శనలు రికార్డు చేయాలి. ప్రతి మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టు నిర్వహణతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రికార్డులను ఉద్యోగులు మోయాల్సి వచ్చేది. వీటి కొనుగోలు ఖర్చు కూడా ఉద్యోగుల మీదే పడేది. ఈ భారాన్ని కూడా ప్రభుత్వం తగ్గించింది. ఇప్పుడు వీటికి కూడా స్మార్ట్ ఫోన్ల ద్వారా పరిష్కారం చూపింది. తద్వారా రికార్డుల మోత తగ్గి లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి.





8

బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, బౌలింగ్ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహణ భేష్

- గిద్దలూరు, పర్చూరు ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావు



తూర్పుపాలెంలో వీఐపీ బరిలో కొనసాగుతున్న కోడిపందేలు

పండగ పొద్దుపోయినా.. ఆగని కూత



తూర్పుపాలెంలో జోరుగా కోడిపందేలు

చెరుకుపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ ముగిసినా తీర ప్రాంతంలో అడ్డూ అదుపు లేకుండా అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం కోడి పందేలు యథేచ్ఛగా కొనసాగాయి. సుమారు 25 వేలమంది రావడంతో నిర్వాహకులు పందేలు కొనసాగించారు. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పోలీసు అధికారులు మాత్రం ఇంకా నిద్రమత్తు వీడడం లేదు. అటు వైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదు. ఆరు రోజులుగా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో కోడి పందేలు కొనసాగుతున్నాయి. ఏడవ రోజు అన్నిచోట్ల పందేలు ముగిసినా.. ఇక్కడ కోడి కూత ఆగట్లేదు. పేకాట, నంబర్లాట, గుండాట పందేలు కాస్తూనే ఉన్నారు.

బస్సులన్నీ ఫుల్..

బస్టాండ్లలో తిరుగు ప్రయాణికులతో రద్దీ

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వ దినం ముగిసిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. శనివారం సాయంత్రం నుంచే ఎన్టీఆర్ బస్టాండ్‌లో తిరుగు ప్రయాణికులతో రద్దీ నెలకొంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇతర దూర ప్రాంతాల నుంచి పండగకు వచ్చిన వారు రాత్రి నుంచే తిరుగు పయన మయ్యారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో.. తాకిడి మరింత పెరిగింది. గుంటూరుతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు బస్టాండ్లలోనూ రద్దీ కనిపించింది. గుంటూరు నుంచి బాపట్ల, తెనాలి, పర్చూరు, విజయవాడ, పల్నాడు ప్రాంతాల వైపునకు వెళ్లే బస్సులు 90 నుంచి 100 మందికిపైగా ప్రయాణికులతో నడుస్తున్నాయి. ఆదివారం మరింత రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని డీపీటీవో సామ్రాజ్యం ప్రకటించారు.



గుంటూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- బాధ్యతలు అప్పగించిన సీఎంకు కృతజ్ఞతలు
- జీఎంసీ కమిషనర్ కె.మయూర్ అశోక్



గుంటూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా ఇతర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తానని గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో నూతన కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రదేశాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి.. ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. 10 లక్షల మంది జనాభా, సీఆర్డీఏ పరిధిలోని గుంటూరు నగరాన్ని.. అధికారులు, సిబ్బంది సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేసి.. త్వరితగతిన పూర్తి చేసి, నంబరు వన్ నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని నూతన కమిషనర్ చెప్పారు.



భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పీజీఆర్ఎస్‌కు ప్రత్యేక భవనం

- పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పీజీఆర్ఎస్, మీడియా సెల్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం భవనాన్ని పరిశీలించారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మించినట్లు ఆయన తెలిపారు. అలాగే మీడియా సెల్‌నూ ఏర్పాటు చేశామన్నారు. పరిశీలనలో భాగంగా.. పనులను త్వరితగతిన పూర్తి చేసి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రారంభోత్సవానికి భవనం సిద్ధం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, పోలీస్ అధికారులు ఉన్నారు.

21 నుంచి జేఈఈ మెయిన్స్

- ఉమ్మడి జిల్లాలో 15 వేల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం

తెలుగు... వెలుగుల గని ఎన్టీఆర్

- తరాలు మారినా మరువని చరిత్ర ఆయనకే సొంతం
- మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా ప్రారంభమైన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు
- విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం ప్రదానం

మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన

6

అన్నదాతల్లో బయోత్పాతం

గుంటూరు జిల్లాలో బయో ఉత్పత్తుల తయారీకి కేంద్రం విధించిన నిబంధనలు ఫైళ్లకే పరిమితం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు మండలాల్లో ల్యాబ్‌లు లేని చోట, ఒక్క యంత్రం కూడా లేకుండా ఖాళీ షెడ్లను మాత్రమే చూపించి బయో ఉత్పత్తుల తయారీ, అమ్మకాల లైసెన్సులు పొందినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 18 మండలాల్లో సుమారు 15 కొత్త బయో ఉత్పత్తుల లైసెన్సులు మంజూరు కాగా, వాటిలో చాలా యూనిట్లు నిబంధనలలో పేర్కొన్న కనీస ప్రమాణాలు కూడా పాటించలేదన్న విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం జరగాల్సిన భౌతిక తనిఖీలు, సాంకేతిక పరిశీలనలు కేవలం పేరుకే జరిగాయన్న ఆరోపణలున్నాయి.

- బయో ఉత్పత్తుల లైసెన్సుల్లో అవినీతి
- యంత్రాలు, పరికరాలు లేకుండానే మంజూరు
- ఆరోపణలు, కేసులున్నా వ్యవసాయశాఖ క్లీన్‌చిట్
- కేంద్రం నిబంధనలకు నీళ్లొదిలేసిన అధికారులు
- రైతులకు తప్పని నష్టం..



గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నకిలీ బయో ఉత్పత్తుల(బయో ఫర్టిలైజర్స్, బయో పెస్టిసైడ్స్, బయో స్టిములెంట్స్) తయారీ, అమ్మకాలకు పెట్టింది పేరు. అటువంటి వ్యాపారం చేసే వాళ్లకు జిల్లా వ్యవసాయ అధికారులు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. బయో ఉత్పత్తుల తయారీకి వినియోగించే యంత్రాలు, పరికరాలు లేని వాళ్లకూ లైసెన్స్‌లు మంజూరు చేశారు. సరిగ్గా తనిఖీలు చేపట్టకుండానే.. కేంద్రం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు గుంటూరు జిల్లా అధికారులు నీళ్లొదిలేశారు. తీవ్ర అవినీతి, అక్రమాలు జరిగాయని కొందరు రైతులు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో జిల్లా వ్యవసాయ శాఖలో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. జీ-2, 3 తాత్కాలిక అనుమతుల గడువు 2025 జూన్ 6వతేదీతో ముగిసిన నేపథ్యంలో.. ఇకపై శాశ్వత లైసెన్సుల మంజూరుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని (మిగతా 8వ పేజీలో)

లైసెన్సుకు రూ.2 లక్షలు

లైసెన్సుల మంజూరుకు ఒక్కో దరఖాస్తుదారు నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అక్రమ వసూళ్లు జరిగినట్లు సమాచారం. అధికారుల ఆశీస్సులు లేకుండా ఈ స్థాయి వ్యవహారం సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహా శివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



కోటప్పకొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి వార్షిక తిరుణాళ్ల మహోత్సవానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోటప్పకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా కోటప్పకొండ ఘాట్ రోడ్డు, భక్తులు స్నానం చేసే చిలకలూరిపేట మేజరు ప్రాంతం, భక్తులు బోటింగ్ చేసే ప్రదేశం, ఘాట్ రోడ్డు, పార్కులు, అలాగే కొండపై తిరుణాళ్ల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. గత సంవత్సరం 25 లక్షల మంది భక్తులు తిరునాళ్లకు హాజరైన నేపథ్యంలో, ఈ సంవత్సరం మరింత రద్దీ ఉండే అవకాశం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కోటప్పకొండ తిరుణాళ్ల విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు, పోలీసు శాఖ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో దాసరి చంద్ర శేఖర్, బండారు పల్లి విశ్వేశ్వరరావు, హనుమంతరావు, కడియాల తాండవ కృష్ణ, మన్నాన్ షరీఫ్, రామకృష్ణ, లింగాల వీరప్పయ్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

● యువకుడి మృతి ● మరొకరికి తీవ్రగాయాలు

మంగళగిరి సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన స్వర్ణకారుడు పెండెం రామకృష్ణ కుమారుడు పెండెం జయంత్ భవన్ (21) బీబీఏ పూర్తి చేశాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ నాడు స్నేహితులతో కలిసి బయటకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి కారును తీసుకుని వెళ్లాడు. శుక్రవారం రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో జయంత్‌తోపాటు అతని స్నేహితుడు నాగార్జునతో కలిసి విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపు వెళుతుండగా మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు పల్టీలు కొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. డ్రైవింగ్ చేస్తున్న జయంత్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108కి పోలీసులకు సమాచారం అందించారు. జయంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, గాయపడిన నాగార్జునను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 553.30 అడుగులు ఉంది. ఇది 217.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,110 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,478 క్యూసెక్కులు ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 45,588 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 33,138 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

తెలుగు.. వెలుగుల గని ఎన్టీఆర్

● తరాలు మారినా మరువని చరిత్ర ఆయనకే సొంతం
● మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
● ఘనంగా ప్రారంభమైన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు
● విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం



డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం ప్రదానం చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, తరాలు మారినా ఆయన చరిత్ర మరవనిదని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ కొనియాడారు. గుంటూరు, బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాల ప్రారంభ సభలో డాక్టర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు నిర్వహించిన ముఖ్యమంత్రులు అందరూ కలిసి చేసిన సంక్షేమం, అభివృద్ధిని అంతకంటే ఎక్కువగా ఎన్టీఆర్ ఒక్కరే చేశారని గుర్తుచేసుకున్నారు. ప్రచారం, ప్రమాణ స్వీకారం, పాలనలో నూతన ఒరవడికి ఆయన శ్రీకారం చుట్టారని, ముఖ్యంగా పేదవారికి సంక్షేమం అందుతుందంటే వెంటనే ఫైల్‌పై సంతకం పెట్టేవారని గుర్తుచేసుకున్నారు. వేగంగా స్పందించే క్రమంలో తప్పులు దొర్లుతాయేమో కానీ ఆయన ఎప్పుడూ తప్పు చేయలేదన్నారు. ఆయన విలువలు, క్రమశిక్షణ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అందరికీ దోహదపడేలా అనేక కార్యక్రమాలను ఎన్టీఆర్ రూపొందించారని అన్నారు. శ్రమజీవులకు, బడుగు జీవులకు మేలు చేసేవారే చట్టసభల్లో ఉండాలని నమ్మి అనేక మందికి అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన పోరాటాల ఫలితమే రాష్ట్రాలకు నిధులను సాధించి పెట్టిందన్నారు. సంక్షేమం అంటే ఎన్టీఆర్ గుర్తుకు వస్తారని అన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రజల గుండెల్లో బతికుండే ఒకే వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. నెహ్రూ, గాంధీలాగానే ఎన్టీఆర్ కూడా చిరస్మరణీయులని అన్నారు. అటువంటి వ్యక్తి పురస్కారాన్ని తాను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తనను ఎంపిక చేసిన కళా పరిషత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మద్యపానం నిషేధం సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వ్యాసం రాశానని, ఆ సమయంలో ఎన్టీఆర్ తనను పిలిచి మాట్లాడారని గుర్తుచేసుకున్నారు. తాను ప్రతి ఏడాది పది వేల మంది ఇంజనీర్లు దేశానికి అందజేస్తున్నానని, అదే తనకు నిజమైన సంతృప్తిగా భావిస్తున్నానని అన్నా రు. అనంతరం డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారాన్ని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్య క్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఘంటా పున్నారావు, గౌరవ అధ్యక్షుడు అంబటి మధు మోహనకృష్ణ, సభ్యులు యర్రా ఈశ్వరరావు, ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు నూకవరపు వేంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కేతేపల్లి సాంబశివరావు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిపోతు మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. వేములపల్లి విఠల్ సభకు అధ్యక్షత వహించారు. కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న యాగం నాటకం

కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి, హైదరాబాద్ వారు ప్రదర్శించిన యాగం నాటకం ప్రేక్షకులను అలరించింది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఎడ్ల పందేల బ్రోచర్లు ఆవిష్కరణ

● పోటీలు ప్రారంభించనున్న మంత్రి, ఎంపీ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, నిర్వాహక కమిటీ సభ్యులు

చిలకలూరిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎడ్ల పందేలను ఆదివారం రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రారంభిస్తారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, దాతల సహకారంతో స్థానిక గోల్కొండ గార్డెన్స్‌లో పందేలను ఆరు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. నిర్వాహకులు, కూటమి నాయకులతో కలిసి ఆయన ఎడ్ల పందేల నిర్వహణ ఏర్పాట్లు పరిశీలించి పందేల బ్రోచర్లు ఆవిష్కరించారు. ఎడ్ల పందేలతో పాటు ఈ నెల 20న ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల నిర్వహణకు తరలివచ్చే ఎడ్ల యజమానులు, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, నిర్వహణకు 11 ప్రత్యేక కమిటీలు వేశామని వెల్లడించారు. పోటీలను సుదీర్ఘ అనుభవమున్న యలం సాంబశివరావు సారథ్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరు రోజుల పాటు 8 విభాగాలలో 160 వరకు ఎడ్ల జతలు పోటీలలో పాల్గొంటాయని వివరించారు. తొలి రోజు పోటీకి పాలపళ్ల సైజు విభాగంలో 30 జతలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పాలపళ్ల విభాగానంతరం రెండుపళ్లు, నాలుగుపళ్లు, 6 పళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. సీనియర్స్ విభాగంతో పోటీలను ముగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు, పేర్ని వీర నారాయణ, యలం సాంబశివరావు, తెల్లప్రోలు వీరయ్య చౌదరి, తేళ్ల సుబ్బారావు, నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, షేక్ రఫాని, జవ్వాజి మదన్ మోహన్ పాల్గొన్నారు.

రెండోసారి ల్యాండ్ పూలింగ్ సరికాదు

● రాజధాని ప్రజల కన్నీరు రాష్ట్రానికి, టీడీపీకి మంచిది కాదు
● దురుద్దేశంతో భూములు లాక్కోవడం క్రిమినల్ చర్య
● చంద్రబాబు, నితీష్‌కుమార్ అండతోనే కేంద్రంలో బీజేపీ నిలబడింది
● రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలి
● విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ నారాయణ, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్

విజయవాడ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం రైతుల నుంచి రెండో దఫా భూములు లాక్కోవడం సరికాదని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అభిప్రాపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కారణంగా అమరావతి రైతులు ఎన్నో కష్టాలు పడ్డారని, కూటమి ప్రభుత్వం మరలా అదే పంథాలో రైతులను ఇబ్బంది పెట్టడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన అమరావతి రైతుల కన్నీరు రాష్ట్రానికి, టీడీపీకి మంచిది కాదన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. జగన్ హయాంలో అమరావతి రైతులు చేసిన ఉద్యమం టీడీపీ ఆక్సిజన్‌లా మారిందని, ఆక్సిజ్ ఇచ్చిన వారికి ద్రోహం తలపెట్టడం సీఎం చంద్రబాబుకు తగదన్నారు. అయినోళ్లకు ఆకుల్లో, కానోళ్లకు కంచాల్లో పెట్టే సంస్కృతిని సీఎం చంద్రబాబు విడనాడాలని, అమరావతి రైతులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. ఇటీవల ఓ రైతు ఆవేదనతో మరణిస్తే, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య కాదా అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చిత్తశుద్ధితో లేకపోవడం బాధాకరమన్నారు. మొదటి ప్రాధాన్యతను అమరావతి రైతులకు ఇచ్చి, అక్కడ ప్రజలను సంతృప్తిపరచాలని ప్రభుత్వానికి సూచించారు. భూముల ధరలు పెరగకుండా ఉన్నపుడే దురుద్దేశంతో భూములు బలవంతంగా లాక్కోవడం క్రిమినల్ చర్య అన్నారు. భూములు రైతుల వద్ద ఉంటే., ధరలు పెరిగినపుడు రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్పొరేట్‌లకు అప్పగించేందుకు భూములు బలవంతంగా లాక్కుని రైతుల నోట్లో మట్టి కొడతావా అంటూ ధ్వజమెత్తారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ అండతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, ఈ సమయంలోనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ తన స్వప్రయోజనాల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు దాసోహం అయ్యారన్నారు. దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ట్రంప్ బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

● మృతదేహాన్ని పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ




పూలూరి శ్రీదేవి (ఫైల్ ఫోటో)

వినుకొండటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ నిమిత్తం భర్తతో కూలీ పనులకు వెళ్లి అనుమానాస్పదంగా మహిళ మృతిచెందడంపై మృతురాలి బంధువులు శనివారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని ఉమ్మడివరం గ్రామపంచాయతీ పరిధిలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన పూలూరి శ్రీదేవి (22) భర్త మరియదాసుతో కలిసి నెల రోజుల క్రితం హైదరాబాద్‌లో సిమెంటు పనులకు వెళ్లింది. రెండు రోజుల క్రితం శ్రీదేవి ఉరేసుకొని మృతిచెందినట్లు భర్త మరియదాసు బంధువులకు సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మరియదాసు స్వగ్రామమైన ప్రకాశం జిల్లాలోని దొడ్డారం గ్రామానికి తండ్రి సాయంతో మృతదేహాన్ని తరలిస్తుండగా మృతురాలి బంధువులకు అనుమానం వచ్చి వారిని అడ్డుకొని వాస్తవాలను వెలికితీయాలంటూ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరియదాసుకు గతంలో అక్రమ సంబంధం ఉండేదని దానికి తోడు అతనికి మద్యం అలవాటుందని బంధువులు పేర్కొన్నారు. శ్రీదేవి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, మరియదాసే చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. వాస్తవాలు వెలికితీసి న్యాయం చేయాలంటూ మృతురాలి పెంపుడు తల్లి జిర్రా కోటేశ్వరమ్మ డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు సమాచారం అందించడంతో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, వాస్తవాలను వెలికితీయాలంటూ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు పట్టణ సీఐ ప్రభాకరావును ఆదేశించారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. మృతురాలి తండ్రి జిర్రా ఏసుబాబు ఫిర్యాదు మేరకు వినుకొండ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువత ఉపాధికి ఊతం

● ఎన్నారై దంపతులు బండారు అశోక్ కుమార్, జయలక్ష్మి
● ఆటోనగర్ బైపాస్ వద్ద బీఎస్ఆర్ స్కిల్ సెంటర్



సమావేశంలో ప్రవాస భారతీయులు బండారు అశోక్ కుమార్, జయలక్ష్మి, తదితరులు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఎన్నారై దంపతులు ముందుకొచ్చారు. దీని కోసం ఆటోనగర్ సమీపంలోని వై జంక్షన్ వద్ద నిర్మించిన షిరిడి సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో నూతనంగా బీఎస్ఆర్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నారై దంపతులు బండారు అశోక్ కుమార్, జయలక్ష్మి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఉద్యోగ అవకాశాలు, విదేశాల్లో ఉన్నటువంటి ఉద్యోగ సదుపాయాలు అన్ని అంశాలపై యువతకు సమగ్రమైన స్కిల్ పై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణను ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణకు ఎటువంటి ఫీజు చెల్లించే అవసరంలేదని దంపతుల పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగంగుంట్ల సాల్మన్ రాజు, జనసేన నాయకులు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జేఈఈ మెయిన్స్

● 15 వేల మంది హాజరు

గుంటూరు (విద్య), జనవరి 17 (ఆంధ్ర జ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష జేఈఈ ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 21,22,23,24,28వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మొదటి షిఫ్ట్‌లో పేపర్ 1 పరీక్ష (బీఈ, బీటెక్) ప్రవేశాలకు జరగనుండగా ఈ నెల 29న పేపర్ 2 బి ఆర్క్ ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు నగర సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ కంప్యూటర్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఎన్టీఏ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ సంబంధించి అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి డౌన్లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

దామాషా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు

● కేసన శంకరరావు



కేసన శంకరరావు

తెనాలి అ ర్బన్, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి): ఎస్సీలకు జనాభా దామాషాన రిజర్వేషన్లు వర్గీకరించి మేలు చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, బీసీ రిజర్వేషన్లు కూడా అదే విధంగా వర్గీకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం తెనాలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనాభా గణనలో కులాల వారీగా లెక్కలు సేకరించాలన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని రద్దు చేయాలని, ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేపట్టాలన్నారు. తమిళనాడు తరహాలో షెడ్యూల్ 9లో చేర్చాలని, 50 శాతం మించి రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకునేలా ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. జాతీయ స్థాయిలో జరిగే జనగణనతో పాటు కులగణనను సమగ్రంగా జరిపించాలని, బీసీ పార్టీగా పేరొందిన టీడీపీ వల్లే ఈ ప్రక్రియ సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ సాధికారితకు కృషి చేయాలని కోరారు.

కౌలు రైతు ఆత్మహత్య

దుర్గి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ముటుకూరులో జరిగింది. గ్రామానికి చెందిన మట్టపల్లి లింగయ్య (38) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. నాలుగేళ్లుగా సరైన దిగుబడి రాక పోవడంతో సుమారు రూ. 25 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం తోచక మనస్తాపానికి గురై తన పొలంలో పురుగుమందు తాగి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, లింగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సూర్యలంకలో పర్యాటకుల సందడి

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు తరలివచ్చిన వారంతా శనివారం బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి వచ్చారు. స్నానాలు చేస్తూ, ఆటలు ఆడుతూ సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల రాకపోకలతో సూర్యలంకబీచ్ కిక్కిరిసింది. గుర్రపు స్వారీ, ఒంటెపై తిరగటం, బైక్‌పై సరదాగా తిరగటం వంటి వాటితో చిన్నారులు, యువత సందడి చేశారు. బాపట్ల పరిసర ప్రాంతాలు నుంచే కాకుండా ఇతర ప్రాంతాలు నుంచి కూడా పర్యాటకులు వచ్చారు.



సూర్యలంక సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	180, 189, 200
చికెన్ విత్ స్కిన్(కిలో)	350.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	360.00



ఉద్యోగావకాశాలు

➾ గుంటూరు, మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429. SPA-6407

➾ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ గుంటూరు నందు పనిచేయుటకు సెకూరిటీ గార్డ్‌లు మరియు ఆయమ్మలు కావలెను. వయస్సు : 45. సంప్ర॥ 90147 99522 AJG-277231

➾ ఎలక్ట్రానిక్ కాటలు షాపు నందు పని చేయుటకు 10th or ITI వారు యువకులు కావలెను. బాబు సేల్స్, NTR బొమ్మ సెంటర్, గుంటూరు. సంప్ర॥ 92473 28868. AJG-277207

➾ తెనాలి DSL బ్యాటరీస్ & సోలార్ ఎనర్జీస్ నందు మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : 10వేలు + ఇన్‌సెంటివ్స్, బస్టాండ్ రోడ్డు, గంగానమ్మపేట, ఉమ్మారెడ్డి కాంప్లెక్స్, తెనాలి. సెల్ : 8187011717. AJG-277054

➾ ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. అర్హత : ఐ.టి.ఐ/ ఇంటర్ / డిప్లొమా / డిగ్రీ (పాస్ లేదా ఫెయిల్) విద్యార్థులు పార్ట్‌టైమ్‌గా కూడా చేసుకోవచ్చు. వేతనం: కమీషన్ ఆధారంగా. సంప్ర : 8977759977, 9618209171 AJA-257739

FOR SALE

➾ Labbipet, Vijayawada. Prime Plot 750 sq.yds. East Facing, MG Road Proximity. Call: 9866219067 AJH-38835

రియల్ ఎస్టేట్

➾ సంక్రాంతి ఆఫర్ : పల్నాడు జిల్లా, నరసరావుపేట & చిలకలూరిపేట, NH-16 హైవే వద్ద తక్కు ధరకే ప్లాట్లు - స్పాట్ రిజిస్ట్రేషన్, సంప్ర॥ 98487 39686, 88975 98338. AJG-277223

అమ్మకము

➾ నేషనల్ హైవేకి 500 మీ.దూరంలో, కాటూరు టు ప్రత్తిపాడు రోడ్, చిన్నకొండ్రపాడు వద్ద 2000 గజాల స్థలంలో 60x30, 20x60 షెడ్లు 2 100hp పవర్‌తో అమ్మకానికి కలదు. సంప్ర॥73962 49686. AJG-277257

➾ సంక్రాంతి: కోటి గ్రానైట్స్ - క్లియరెన్స్ సేల్ ! బల్క్ స్టాక్ క్లియరెన్స్ కారణంగా గ్రానైట్ స్లాబులపై ప్రత్యేక రాయితీలు ! సాయిబాబా రోడ్, కొరిటెపాడు, గుంటూరు. సెల్ : 94402 49796. AJG-277225

PLOT FOR SALE

➾ గుంటూరు సిటీకి దగ్గర దామరపల్లి గ్రామంలో అన్ని వసతులతో గల 1100 గ॥, 1222గ॥. 1466గ॥ N/E కార్నర్ ఓపెన్ ప్లాట్స్ గలవు. గజం : 6,500/- సంప్ర॥ +91 96763 77243. AJG-277236

➾ అమరావతి ORR దగ్గరగా, సత్తెనపల్లి పట్టణంలో CRDA, RERA అప్రూవుడ్‌తో, మంచి నీటి భూగర్భ జలాలలో, 80% లోన్ సౌకర్యంతో కల ప్లాట్లు అమ్మబడును. Details Cont : 95738 73810 AJG-277230

➾ గోరంట్ల మరియు బుడంపాడు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో రాబోయే ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరలో నివాసయోగ్యానికి అనువైన ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. 89785 63337 AJG-277232

➾ చ॥గ॥ 10999/- మాత్రమే ORR దగ్గరగా కొర్రపాడులో గుంటూరు To హైదరాబాద్ హైవే ఫేసింగ్ APCRDA & RERA వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ కలవు. 70% లోన్, సంప్ర॥ 970 14 86 924 AAA-10422

FLAT FOR SALE

➾ నల్లపాడు రోడ్డు సాయి భార్గవి కన్‌స్ట్రక్షన్, మధు ఎన్‌క్లేవ్ 2BHK ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 100% వాస్తు మంచి నీటి సౌకర్యంతో ఫ్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర॥ 9849851331, 7989958789 AJG-277262

అద్దెకు

➾ గుంటూరు సిటీ, గోరంట్ల, సున్నం బట్టీల సెంటర్, మెయిన్ రోడ్డు, డి.నెం: నందు 1050 చ॥అ॥ విస్తీర్ణం గల ఆర్‌సిసి దాబా, బ్యాంకులకు గాని, ఆఫీసులకు గానీ అద్దెకు ఇవ్వబడును. స్ట్రాంగ్ రూమ్ సదుపాయం కూడా కలదు. సంప్ర॥ 9492025230, 9493824187, 8008004507. AJG-239494

బిల్డింగ్ డిమాలిష్

➾ పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగల కొట్టబడును మరియు పాత కలప, ఐరన్ రేకులు, సిమెంట్ రేకులు కొనబడును. ఫోన్ : 98494 81424, 80746 77449. AJG-0277032

➾ కోటి పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగల కొట్టి నేలమట్టం చేయబడును. పాత దర్వాజాలు, కిటికీలు, కలప, ఐరన్ కొనబడును. సెల్లార్ తీయబడును. ఫోన్ : 99497 60367, 99664 33122. RK-643

లీకేజీ సమస్యలా?

➾ బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజీపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892 AJG-0267616

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న నగర కమిషనర్ మయూర్ అశోక్

కలెక్టర్, ఎస్పీలను కలిసిన కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా కె.మయూర్ అశోక్ శనివారం బాధ్యతలు తీసుకున్న అనంతరం కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్‌లను మర్యాదపూర్వకంగా కలిసి నగర అభివృద్ధి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. తొలుత కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సీనియర్ సిటిజన్స్, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుటకై వంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. అనంతరం జరిగిన విభాగాధిపతుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరికి వస్తున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సోమవారం నుంచి ప్రతి విభాగంపై సమగ్ర సమీక్ష చేస్తామని, అందుకు తగిన విధంగా సమాచారం సిద్ధం చేయాలన్నారు.

నగరాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేయాలి

● నూతన కమిషనర్ కు అభినందనలు తెలిపిన మేయర్



నూతన కమిషనర్ కె.మయూర్ అశోక్‌ను అభినందిస్తున్న నగర మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేస్తూ నగరాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా శనివారం బాధ్యతలు తీసుకున్న కె.మయూర్ అశోక్‌ను కలిసి అభినందనలు తెలిపారు. తొలుత కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కి శాలువా కప్పి మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో వార్డుల వారీగా అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. అలాగే ప్రజలకు కీలకమైన తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులపై అధిక దృష్టి సారించాలన్నారు. గుంటూరు నగరం రాజధాని పరిధిలో ఉన్నందున, దానికి తగ్గట్టుగా నగరాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు.

అభినందనలు తెలిపిన జీఎంసీ అధికారులు

నూతన కమిషనర్ కె.మయూర్ అశోక్‌ను జీఎంసీ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ బొల్లినేని శ్రీనివాసరావు, ఎస్ఈ జి వెంకటేశ్వరరావు, సీపీ రాంబాబు, ఏసీపీలు, ఆర్ఓలు, మినిస్టీరియల్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నగర కమిషనర్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో సంఘ సభ్యులు



మయూర్ అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవో సంఘ సభ్యులు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నగర మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మయూర్ అశోక్‌ను ఆయన ఛాంబర్‌లో ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగర అభివృద్ధి, పరిపాలనలో తమవంతు సహకారం అందిస్తామని కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంగసాని శ్రీనివాస్, కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్ సుందర్, అనిల్‌కుమార్, దుర్గారావు, జానీ బాషా, కృష్ణ కిషోర్, విజయ్, విజయలక్ష్మి, సూరి, వి.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, సోమశేఖర్ పాల్గొన్నారు.

రూరల్ వాటర్ స్కీం ఉద్యోగులకు న్యాయం చేయాలి

● టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి

● ఏపీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూరల్ వాటర్ స్కీంలో గత 33 సంవత్సరాలుగా నిరంతరంగా సేవలందిస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 215 మంది టైం స్కేల్ ఉద్యోగులు ప్రస్తుతం రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్నారని తెలిపారు. దశాబ్దాల పాటు ప్రజలకు తాగునీటి సరఫరా వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన ఈ ఉద్యోగుల సేవలను గౌరవిస్తూ, రాబోయే మంత్రి మండలి సమావేశంలో వారి సర్వీసులను క్రమబద్ధీకరించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్‌ను కోరారు. క్రమబద్ధీకరణలో ఏమైనా ఆలస్యాలు జరిగితే, ఆయా ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కూటమి ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను, వారి అర్హతలను పరిగణనలోకి తీసుకుని దశల వారీగా క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేసి, కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవస్థను నిర్మూలించాలని ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మందికి శిక్ష

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్ సూచనల ప్రకారం, ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.అశోక్ కుమార్ ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మంది వాహనదారులను పోలీసులు గుర్తించి, వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి శిక్షలు విధించింది.

శిక్షల వివరాలు ఇలా ఉన్నాయి...

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు ఆటో డ్రైవర్లకు న్యాయస్థానం ఒక్కొక్కరికి 7 రోజుల చొప్పున జైలు శిక్ష విధించింది. అలాగే ఒక వాహనదారుడికి రూ.10 వేల జరిమానా, నలుగురికి ఒక్కొక్కరికి రూ.7 వేలు జరిమానా, నలుగురికి ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించారు. ప్రజల భద్రత దృష్ట్యా మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని గుంటూరు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని హెచ్చరించారు.



సరస్ మేళాలో సందర్శకులతో మాట్లాడుతున్న మేయర్ నాని, ఎమ్మెల్యే పుల్లారావు



టీడీపీ శ్రేణులతో కలిసి స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

సరస్ మేళాతో మహిళలకు సాధికారత

● మేయర్ నాని, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, నసీర్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సరస్ మేళా ఏర్పాటుతో మహిళల ఆర్థిక సాధికారతకు మార్గం ఏర్పడిందని గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, నసీర్ అన్నారు. నల్లపాడు రోడ్డులో రెడ్డి కళాశాల సమీపంలో జరుగుతున్న సరస్ మేళా అఖిల భారత డ్వాక్రా బజార్‌ను శనివారం వారు సందర్శించారు. ప్రాంగణంలో స్టాల్స్ వద్ద, ఫుడ్ కోర్ట్ పరిశీలించారు. వివిధ రాష్ట్రాల వంటకాలను రుచి చూశారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి పలు వస్తువులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతకు సమగ్ర వేదికగా సరస్ మేళా అఖిల భారత డ్వాక్రా బజార్ ఉందని తెలిపారు. ఢిల్లీ స్థాయిలో జరిగే జాతీయస్థాయి డ్వాక్రా బజార్‌ను గుంటూరులో ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. మేళాలో దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకంతో పాటు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక సాధికారిత సాధించాలన్న మహిళలకు ప్రేరణ కలిగించేలా ఉందన్నారు. సరస్ మేళాను ఇక్కడ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, ఏపీడీ కిరణ్ కుమార్, డీపీఎం అశోక్ కుమార్, ఏపీఎం సురేష్, కార్పొరేటర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన డోకిపర్రు గ్రామ రైతులు

వాస్తవ విలువను లెక్కించి పరిహారం అందించాలి

● కలెక్టర్‌కు డోకిపర్రు రైతుల వినతి

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్ భూ సేకరణలో భూమి వాస్తవ విలువను లెక్కించి పరిహారం ఇవ్వాలని మేడికొండూరు మండలం, డోకిపర్రు గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 8న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తే ఇప్పటి వరకు రైతులకు నోటీసులు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అధికారులు వచ్చి అభ్యంతరాలు గడువు ముగిసిందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలు, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండానే భూ సేకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. పాస్ పుస్తకాల కోసం సచివాలయానికి వెళ్లినప్పుడు.. గ్రామాల్లో సేకరిస్తున్న భూముల వివరాల గురించి తెలుసుకున్నామని చెప్పారు. గ్రామంలో 720 ఎకరాలు ఉంటే 365 తీసుకుంటే మా పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి నుంచి రెండు కోట్లు రూపాయలు ఉంటే, ప్రభుత్వ విలువ కేవలం రూ.30 లక్షల మాత్రమే ఉందన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గుంటుపల్లి సాంబశివరావు, మొక్కల బ్రహ్మం, కమిశెట్టి తిరుపతయ్య, గంజి భాస్కరరావు, ఒంటేటి నాగురయ్య, మేఘన ఉన్నారు.

సర్వైవర్ నెట్‌వర్క్ బలోపేతానికి కృషి

● జిల్లా పథక సంచాలకులు, పీపీ జి.ప్రసూన

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సర్వైవర్ నెట్‌వర్క్ మీటింగ్ శనివారం నగరంలోని ఎంపీడీవో హాలులో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ట్రస్ట్, జిల్లా బాలల పరిరక్షణ విభాగము సంయుక్తంగా మహిళా శిశు సంక్షేమ శాఖ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పథక సంచాలకులు, పీపీ జి. ప్రసూన, జిల్లా బాలల రక్షణ అధికారి విజయ్ కుమార్, క్రాఫ్ట్ రాష్ట్ర ప్రోగ్రాం డైరెక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ రాష్ట్ర ప్రతినిధి జి.తిరుపతిరావు పాల్గొన్నారు. క్రాఫ్ట్ రాష్ట్ర ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించటం లో భాగంగా సర్వైవర్ నెట్‌వర్క్‌ని బలోపేతం చేయటానికి జిల్లాలో క్రాఫ్ తమ వంతు బాధ్యతను నిర్వహిస్తుందన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్. విజయకుమార్ ప్రసంగిస్తూ ప్రభుత్వం అతి ముఖ్యమైన బాధ్యతల్లో బాలల హక్కుల పరిరక్షణ అన్నది చాలా ముఖ్యమైన అంశమని, ఇది ప్రభుత్వం చేయాల్సిన పనిగా ఎవరూ భావించకూడదని, దీనిని బాధ్యతగా చూడాలన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ కోఆర్డినేటర్లు కోలా సమీర్ కుమార్, ప్రభాకర్‌రావు, వెంకయ్య క్రాఫ్ట్ కమ్యూనిటీ సోషల్ వర్కర్లు, అక్కయ్య, సుల్తానా, అరుణ, కీర్తి, పద్మజ మండల కోఆర్డినేటర్లు, జయరాజ్ సిబ్బంది, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సమన్వయకర్తలు పోతురాజు, విజయలక్ష్మి, నాగమణి సిబ్బంది జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, సర్వైవర్స్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పథక సంచాలకులు జి.ప్రసూన

ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం విజయవంతం చేయాలి

● టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఈనెల 18న జరిగే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, 9 నెలల్లోనే అధికారం చేపట్టి అద్భుతమైన సంస్కరణలు, సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారన్నారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారికి గుర్తింపు తెచ్చారన్నారు. అటువంటి మహనీయుడి వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఉదయం 8.30 గంటలకు టీడీపీ జిల్లా కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొంటారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహన తనిఖీలు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేసే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక రోడ్డు భద్రతా డ్రైవ్ నిర్వహించారు. శనివారం సాయంత్రం 4:00 గంటల నుండి 6:00 గంటల వరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఆకస్మికంగా రోడ్డు భద్రతా తనిఖీలు చేపట్టారు. ఆయా రహదారులపై ఉన్న ప్రమాద స్థలాలు (బ్లాక్ స్పాట్స్) వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా నియంత్రించే దిశగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు సహా అన్ని రకాల వాహనాలను పరిశీలించారు. ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదేవిధంగా వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు కలిగి ఉన్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వాహనదారులకు పోలీస్ అధికారులు అవగాహన కల్పిస్తూ, అధిక వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. "మీ భద్రత -- మీ బాధ్యత.", "హెల్మెట్ ధరించండి -- క్షేమంగా గమ్యం చేరండి.", "రోడ్డు భద్రతా నియమాలు పాటించండి – ప్రమాదాల బారిన పడకండి." అంటూ పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, సరైన వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండడం తప్పనిసరి అని, ట్రిపుల్ రైడింగ్, అతి వేగం, ప్రమాదకర రీతిలో వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు తెలిపారు. ఆకస్మిక రోడ్డు భద్రత డ్రైవ్‌లో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు (హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగంతో వాహనాలు) నడిపే వారి 2,146 వాహనాలు తనిఖీ చేయగా సరైన వాహన ధ్రువపత్రాలు లేకపోవడం వలన 61 వాహనాలు సీజ్ చేసారు. నిబంధనలు పాటించని 896 వాహన యజమానులకు రూ.4 లక్షల 77 వేల 190 జరిమానాగా విధించారు.

మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా శక్తి బృందాలు

● ఎస్పీ వకుల్ జిందాల్



అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న శక్తి బృందాలు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారుల రక్షణ, భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గడచిన మూడు నెలల కాలంలో స్కూళ్లు, కాలేజీలు, ఇతర ప్రదేశాల్లో సుమారు 99 అవగాహన కార్యక్రమాల ద్వారా సుమారు 2000 మందికి అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 శక్తి బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కు ఒక్క శక్తి బృందం చొప్పున, అలాగే గుంటూరు నగర పరిధిలో ప్రత్యేకంగా 2 శక్తి బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రతి శక్తి బృందంలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జీగా, ఐదుగురు అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోమ్ గార్డ్‌లు సభ్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) పర్యవేక్షణలో, జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి శక్తి బృందాల క్షేత్రస్థాయి పర్యటనలు, తనిఖీలు నిర్వహించబడుతున్నా యన్నారు. స్కూళ్లు, కాలేజీలు, పని ప్రదేశాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, వంటి నేరాలను అరికట్టడంతో పాటు, శక్తి యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణ స్పందన, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణ, మహిళా సాధికారత దిశగా శక్తి బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు.

శక్తి టీమ్స్ ముఖ్య లక్ష్యాలు

మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపులు, దాడులు, అదృశ్యాలు, మోసపూరిత వివాహాలు వంటి నేరాలను నిరోధించడం, "శక్తి" యాప్, డయల్ 112 ద్వారా వచ్చే అత్యవసర కాల్స్‌కు వేగంగా స్పందించి, తక్షణ రక్షణ సహాయం అందించడం, విద్యార్థులు, మహిళలు, ప్రజలకు తమ హక్కులు, శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించి, శక్తి యాప్స్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించి, పోలీస్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం, మహిళలు, బాలికలలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారికి భద్రతతో కూడిన స్వేచ్ఛ కల్పించడమే శక్తి బృందాల ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.



మంత్రి లోకేశ్‌ను కలిసిన కార్మిక పరిషత్ నాయకులు

ఆర్టీసీ పురోభివృద్ధికి అన్ని విధాలా సహకారం

● మంత్రి నారా లోకేశ్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పురోభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ ఆర్టీసీ అనుబంధ విభాగం కార్మిక పరిషత్ రీజనల్ కార్యదర్శి మండవ రాజేశ్ నేతృత్వంలో సంఘం మంగళగిరి, గుంటూరు-2 డిపో నాయకులు, ఉద్యోగులు ఉండవల్లిలోని లోకేశ్ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీలోని వివిధ సమస్యలతో పాటు ఉద్యోగుల ప్రయోజనాలపై వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, దీనిపై రవాణా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు తగు సూచనలు ఇస్తామన్నారు. ఆర్టీసీ అభివృద్ధితో పాటు ఉద్యోగులకు కూడా మరింత మేలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే స్త్రీ శక్తి పథకాన్ని కూడా అమలు చేస్తున్నామని, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఉద్యోగులు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు 2 డిపో కమిటీ చైర్మన్ టి.గోవర్ధనరావు, అధ్యక్షుడు శ్రీనివాస్, మంగళగిరి డిపో ప్రెసిడెంట్ పద్మావతి, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్ తదితరులున్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శనక్కాయల రాజకుమారి

డాక్టర్ రాజకుమారికి ప్రతిష్టాత్మక పురస్కారం

గుంటూరు మెడికల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ మాధ్యమాల ద్వారా మహిళలు, యువతులపై జరుగుతున్న వేధింపులు, హింసకు వ్యతిరేఖంగా కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని ధైర్యంగా ఎదుర్కోవడంపై చైతన్యం కల్పించిన స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణుల సంఘం గుంటూరు సొసైటీ ప్రతినిధి డాక్టర్ శనక్కాయల రాజకుమారికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఫాక్సీ పురస్కారం లభించింది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు జరిగిన జీరో టాలరెన్స్ ట్వార్డ్స్ డిజిటల్ ఎబ్యూజ్ అనే ప్రచారంలో మహిళలపై డిజిటల్ మాధ్యమాల ద్వారా మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింస, అసభ్యకర పోస్టింగ్‌ల నుంచి యువతులు తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలనే అంశంపై డాక్టర్ రాజకుమారి జిల్లాలో పలు కళాశాలల్లో 5 వేల మంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డిజిటల్ ఎబ్యూజింగ్‌పై యువతుల్లో చైతన్యం కల్పించినందుకు ఆమెను ఈ పురస్కారం కోసం ఎంపిక చేశారు. న్యూఢిల్లీలో శనివారం జరిగిన 68వ ఆలిండియా కాంగ్రెస్ ఆఫ్ ఆబ్‌స్ట్రెటిక్స్ అండ్ గైనకాలజీ సదస్సులో ఫాక్సీ కోశాధికారి డాక్టర్ శాంతకుమారి, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్ట్రెటిక్స్, అండ్ గైనకాలజీ ప్రతినిధి యాన్నీ బియాట్రిస్ కియారా ఈ అవార్డును డాక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నో టు వావ్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్మయి దేవినేని, గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా శనివారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటి అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

వీనుల విందుగా వేణుగాన కచేరి

గుంటూరు(తూర్పు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ మందిరం కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాల్లో భాగంగా శనివారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ శశాంక్, చెన్నై వేణుగాన కచేరి సంగీతాభిమానులను అలరించింది. వీరికి వయోలిన్‌పై శృతి సారథి, మృదంగంపై సుబ్బరాయ ఫాల్గుణ, బుర్ర శ్రీరామ్ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాలను అతిథులు, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వడ్లమాని రవి, త్యాగరాజ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామ రాజు శ్రీనివాసరావు, వింజమూరి రంగసాయి, సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, కార్యవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం కార్యక్రమాలలో లఘు గాత్ర, వీణ వయోలిన్ కచేరీలు జరిగాయి.



వేణుగాన కచేరి చేస్తున్న శశాంక్

పశ్చిమ డెల్టాకు 2258 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 2258 క్యూసెక్కు నీరు శనివారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 48 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 288 క్యూసెక్కులనీరు, పశ్చిమకాల్వకు 135 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 135 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1428 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.


సందర్శకులతో రద్దీగా ఉన్న సరస్ మేళా

సరస్..సక్సెస్!

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బ్రాండ్ ఇమేజ్‌ని దేశ స్థాయిలో మరోసారి పెంచేలా జిల్లా యంత్రాంగం సరస్ మేళా.. అఖిలభారత డ్వాక్రా బజార్‌ను విజయవంతంగా నిర్వహించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నిరంతర. పర్యవేక్షణతో మేళా అద్భుతంగా జరిగింది. స్థలం గుర్తింపు, స్టాల్స్ ఏర్పాటు, నిర్వహణకు అమలు చేసిన ప్రణాళికలు మంచి ఫలితాలు ఇచ్చాయి. జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లపై స్టాల్స్ నిర్వాహకులు, సందర్శకులు ప్రశంసలు కురిపించారు. ఈ నెల 6 నుంచి జరుగుతున్న సరస్ మేళా జనవరి 18తో ముగియనుంది.

● గుంటూరు బ్రాండ్ ఇమేజ్ పెంచిన మేళా!
● దాదాపు 13 లక్షల మంది సందర్శన
● నేటితో ప్రదర్శన, విక్రయాల ముగింపు
● మంత్రి పెమ్మసాని, కలెక్టర్ అన్సారియా నిరంతర పర్యవేక్షణ

- గుంటూరులోని రెడ్డి కళాశాల సమీపంలో 12 ఎకరాల్లో 320కి పైగా స్టాల్స్‌తో ఫుడ్ కోర్ట్, అమ్యూజ్మెంట్ పార్క్, కళా వేదిక, శిక్షణ కేంద్రంతో సరస్ మేళాను ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల, ప్రదర్శన, అమ్మకం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారం అందించాయి.
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 65 స్టాల్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, నాబార్డ్ ఆర్థిక సహకారంతో వ్యాపారాలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలకు చెందిన 180 స్టాల్స్, మరికొన్ని ఇతర స్టాల్స్ మేళాలో ఏర్పాటు చేశారు.
- మేళాలో చేతివృత్తులకు 74, చేనేతకు 95, న్యాచురల్ ఫుడ్స్ 76, బ్యాంకర్స్‌కు 20, ఇతర స్టాల్స్ ఉన్నాయి. ప్రాంగణంలో 12 రాష్ట్రాలకు చెందిన 18 స్టాల్స్ లైవ్ కిచెన్‌తో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రసిద్ధ కళారూపాలను ప్రదర్శించారు.
- మేళాను దాదాపు 13 లక్షలకు పైగా ప్రజలు సందర్శించారని అధికారులు చెబుతున్నారు. సెలవు రోజుల్లో, పండుగ రోజుల్లో లక్షకు పైగా ప్రజల రద్దీ ఉన్నప్పటికీ అధికారులు, జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసి మేళా సజావుగా కొనసాగేలా చూశారన్నారు.
- కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నిరంతర పర్యవేక్షణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఇతర శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖతోపాటు, మున్సిపల్, పోలీస్, వైద్యారోగ్య, అగ్నిమాపక, విద్యుత్తు తదితర శాఖల సమన్వయంతో మేళాను విజయవంతంగా నిర్వహించారు.



- ప్రాంగణంలో నగరపాలక సంస్థ అధికారులు నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ సెక్రటరీల పర్యవేక్షణలో ప్రతి షిఫ్ట్‌కి 50 మంది పారిశుద్ధ్య కార్మికులు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహించారు.
- మేళా వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలో నల్లపాడు సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బందితో 24 గంటలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడం, ప్రాంగణంలో క్రౌడ్ మేనేజ్మెంట్ నిర్వహణ సక్రమంగా చేపట్టారు.
- జిల్లా వైద్యారోగ్య శాఖ వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశాలతో ప్రాంగణంలో రెండు బెడ్‌లతో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్టాల్స్ నిర్వాహకులతోపాటు, సందర్శకులకు వైద్య సలహాలు, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. అంబులెన్స్‌ను అత్యవసర వైద్య సేవల కోసం అందుబాటులో ఉంచారు.
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్ని మాపక శాఖ జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గుంటూరు-2 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో లీడింగ్ ఫైర్ మెన్, డ్రైవర్ ఆపరేటర్, ఇద్దరు ఫైర్ మెన్లు, ఒక ఫైర్ ఇంజన్‌తో 24 గంటలు మేళాలో ప్రత్యేకంగా ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేశారు.
- డీపీఓ కోమలి పద్మ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్లు స్టాల్స్ నిర్వాహకులకు, విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు అందించేలా పరివేక్షించారు. వీరితోపాటు విద్యుత్, జిల్లా పరిషత్, పరిశ్రమలు, వాణిజ్య, బ్యాంకర్లు, మహిళా స్త్రీ సంక్షేమ, రెవెన్యూ శాఖలు అధికారులు, ఉద్యోగులు సిబ్బంది విధులు నిర్వహించారు. వీరందరి సమష్టి కృషితో సరస్ మేళా విజయవంతమయిందని అధికారులు తెలిపారు..


సాంస్కృతిక కార్యక్రమాలు..

ఉత్సాహంగా సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సరస్ మేళా ప్రాంగణంలోని కళా వేదికపై శనివారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా కొనసాగాయి. తమిళనాడులోని తిరుచ్చి కళాకారులు వాయిద్యాలు, సాంప్రదాయ వేషధారణతో ప్రదర్శించిన కరకట్ట నృత్యం వారి సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించాయి. విశాఖపట్నం జాలరి నృత్యం అద్భుతంగా సాగింది. స్వాతి కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. డీఆర్డీఏ ఉద్యోగులు పంజాబీ భల్లే..భల్లే నృత్యం కట్టిపడేసింది. సినీ గీతాల ఆలాపన, జానపద నృత్యం అలరించాయి. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ కె మయూర్ అశోక్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, పెద్ద సంఖ్యలో సందర్శకులు వీక్షించారు.

నేడు సరస్ మేళాలో..

సరస్ మేళాలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి ముగింపు సభ జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి కశ్మీరి డాన్స్, సాంప్రదాయ నృత్యాలు, కర్నూలు చెక్క భజన ప్రదర్శన, కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శిస్తారు.


కళాకారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్


దర్శకుడు అనిల్ రావిపూడిని సత్కరిస్తున్న మైత్రి మాల్ ఫుడ్ కోర్టు యాజమాన్యం, జనసేన నాయకులు ఆళ్ళ హరి, మేకల రవీంద్రబాబు తదితరులు

సినీ దర్శకుడు అనిల్ రావిపూడి సందడి

● అభిమానుల కోలాహలం గుంటూరులో పర్యటన

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు అనిల్ రావిపూడి శనివారం గుంటూరులో సందడి చేశారు. నగరంలోని నాజ్ థియేటర్, జీటీ రోడ్డులో గల మైత్రి మాల్‌లో పర్యటించారు. ముందుగా నాజ్ థియేటర్‌లో ఆయన మాట్లాడుతూ, మన శంకరవరప్రసాదు గారు చిత్ర విజయంతో చిరంజీవి అభిమానులు తనకు సినీ జీవితంలో మరిచిపోలేని బహుమానాన్ని అందించారన్నారు. గోదావరి జిల్లాల వంటి ప్రాంతాల్లో చాలా ఏళ్ళ తరువాత జనాలు ట్రాక్టర్‌లు ఎక్కి సినిమా చూసేందుకు తరలి వస్తున్నారని, కొన్ని థియేటర్‌ల వద్ద అదనపు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఇది చిరంజీవి అభిమానులతోనే సాధ్యమైందన్నారు. ఈ విజయం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. అన్నివర్గాల ప్రేక్షకులు మెచ్చేలా మరిన్ని చిత్రాలు అందిస్తానన్నారు. అనంతరం జీటీ రోడ్డులో మైత్రి మాల్‌లో అనిల్ రావిపూడి పర్యటించారు. మాల్ ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, కడంశెట్టి సతీష్‌కుమార్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. మన శంకరవరప్రసాద్ గారు చిత్రం విజయంపై కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించారు. అలాగే జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, చిరంజీవి అభిమాన సంఘం నాయకుడు మేకల రవీంద్రబాబు, గిడుతూరి సత్యం, సుధాకర్ రెడ్డి, శరత్, బందెల నవీన్, ఫణిశర్మ, పవన్, బద్రి, బాలాజీ, స్వామి, వీర మహిళలు మల్లేశ్వరి, ఆసియా, అరుణ తదితరులు దర్శకుడు అనిల్ రావిపూడికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

నరకాసురుడు

(5వ పేజీ తరువాయి)

వేర్వేరు పార్టీల సానుభూతిపరులేనని చెప్పారు. ఈ ఘటనను ఆధారంగా చేసుకుని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం దురుద్దేశపూరిత ప్రచారం చేస్తోందని ఆరోపించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో 12 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు హత్యకు గురయ్యారని, అందులో అన్ని కులాలకు చెందిన వారు ఉన్నారని గుర్తుచేశారు. కాసు అక్రమ మైనింగ్ కారణంగా ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను కూడా యరపతినేని ప్రస్తావించారు. కొన్ని ఘటనల్లో కేసులే నమోదు కాలేదని తెలిపారు. మాచవరం మండలం తురకపాలెంలో యువతిని సజీవ దహనం చేయబోయిన ఘటన, తంగెడలో ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లపై పెట్రోల్ బాంబుదాడులు, వృద్ధ దంపతులపై హత్యాయత్నం వంటి ఘటనలు వైసీపీ అరాచక పాలనకు నిదర్శనమని యరపతినేని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన కాసు ఇప్పుడు ఆ మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోకపోతే చట్టం తన పని తాను చేస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం గురజాల నియోజకవర్గంలోని గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని, రాజకీయాల్లో హత్యలు, అరాచకాలు చేయాల్సిన అవసరం తనకు లేదని యరపతినేని స్పష్టం చేశారు. సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీళ్లు దళితులు కాదా.. కాసు

కాసు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గురజాల నియోజకవర్గంలో మరణించిన వారి జాబితా, ఫొటోలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ రోజు వాళ్ల కుటుంబాలు.. పసుపు కుంకుమ పోగొట్టుకున్న అక్కచెల్లెమ్మలను చూస్తుంటే ప్రాణం తరుక్కు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాసు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దాచేపల్లి మండలం బట్రూపాలేనికి చెందిన కె.రాజానాయక్ (ఎస్టీ), తంగెడకు చెందిన బత్తుల సుబ్బులు (బీసీ), సైదు జాన్ (దూదేకుల), పెదగార్లపాడుకు చెందిన పురంశెట్టి అంకుల్ (కాపు), తమ్మిశెట్టి నీల కంఠబాబు (బీసీ), షేక్ అల్లీశా (ముస్లిం), గురజాల మండలం పాత అంబాపురానికి చెందిన డి.విక్రమ్ (ఎస్సీ), మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన ఖాదర్‌బాషా(ముస్లిం), పిడుగురాళ్ల మండలం పందిటివారిపాలేనికి చెందిన బి.పిచ్చయ్య (బీసీ), పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన మందా యోహాను (ఎస్సీ), దాచేపల్లి మండలం రామాపురానికి చెందిన నాగిరెడ్డి (ఓసీ), మాడుగులకు చెందిన బ్రహ్మయ్య వీరంతా వైసీపీ పాలనలో హత్య గావించబడ్డారని యరపతినేని తెలిపారు. అయినా సరిగా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. ఇప్పుడు అవే కేసులు మళ్లీ విచారణ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎవరినీ వదలబోనని యరపతినేని స్పష్టం చేశారు.

కాసు స్థానికంగా ఉండే వ్యక్తి కాదు

వైసీపీ గాలిలో గెలిచిన కాసు మహేష్‌రెడ్డి స్థానికంగా ఉండే వ్యక్తి కాదని యరపతినేని అన్నారు. గురజాలలో గెలిచాక ఇక్కడి డబ్బులు తీసుకు వెళ్లి నరసరావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నారని విమర్శించారు. బ్రాహ్మణపల్లిలో వైసీపీ కార్యకర్త కోటేశ్వరరావు మృతి చెందితే కాసు రూపాయి ఇవ్వలేదని.. తాను వెళ్లి రూ.లక్ష ఆర్థిక సహాయం చేశానని గుర్తుచేశారు. గురజాల నియోజకవర్గంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు కాసు మాటలు నమ్మి మోసపోవద్దు అని హితవు పలికారు. నియోజకవర్గంలో రూ.900 కోట్లతో నీటి పథకం, మెడికల్ కాలేజీలో అడ్మిషన్స్, రూ.6 కోట్లు సీఎం సహాయ నిధి తీసుకువచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని యరపతినేని చెప్పారు. వాటిని చూసి ఓర్వలేక కాసు మహేష్‌రెడ్డి ప్రేలాపనలు చేస్తున్నాడన్నారు.

ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహణ భేష్

● ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావు

మంగళగిరి సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరిలో నెల రోజులపాటు క్రీడాకారులకు, క్రీడాభిమానులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా క్రికెట్ టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళగిరి ప్రీమియర్ లీగ్ జరుగుతున్న నారా లోకేశ్ క్రీడా ప్రాంగణాన్ని శనివారం వారు సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని డాడీ ఎఫ్‌సీ జేఎస్సార్, భీమ్స్ ఆర్మీ జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. మైదానంలో కొద్దిసేపు క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సాంబశివరావు, అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, ఏటా మంత్రి లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీఎల్ పోటీలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. యువత టోర్నీలో మంచి ప్రతిభ కనబర్చి మంగళగిరి నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, నేతలు ఆకుల ఉమామహేశ్వరరావు, కనికళ్ల చిరంజీవి, కాసరనేని జస్వంత్, గద్దె వాసు, గోవాడ దుర్గారావు, వల్లూరు నరసింహారావు, మేళం ఆనంద మోహన్, ఇట్టా భాస్కర్, కాటాబత్తుని సాగర్, షేక్ ఖాశింబాబు, పర్వతనేని హర్ష, గోసాల రాఘవ, కట్టెపోగు కిషోర్, చెల్లూరి సత్యనారాయణ, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.


మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు ముత్తముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావు

అన్నదాతల్లో బయోత్పాతం

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ప్రత్యేక నిబంధనలు రూపొందించింది. బయో ఉత్పత్తులు తయారు చేసే ప్రతి యూనిట్ వద్ద తప్పనిసరిగా సాంకేతిక పరికరాలు, ల్యాబ్ సదుపాయాలు ఉండాలని స్పష్టం చేసింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు.. బయో ఉత్పత్తుల తయారీకి అనుమతి ఇవ్వాలంటే సంబంధిత వ్యాపారి తను తయారు చేసే ప్రతి ఉత్పత్తికి అవసరమైన పరికరాలు, ప్రయోగశాల సదుపాయాలు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను కలిగి ఉండాలి. కేవలం కాగితాలపై చూపించిన ఏర్పాట్లను ఆధారంగా చేసుకొని లైసెన్సులు మంజూరు చేయకూడదని స్పష్టంగా పేర్కొంది.

● బయో ఫర్టిలైజర్స్‌కు ఫర్మెంటేషన్ ట్యాంకులు, ఆటోక్లేవ్, కల్చర్ రూమ్, బయో పెస్టిసైడ్స్ కు స్టెరిలైజేషన్ యూనిట్లు, క్వాలిటీ టెస్టింగ్ పరికరాలు, బయో స్టిమ్యులెంట్స్‌కు ప్రత్యేక మిక్సింగ్, ప్యాకేజింగ్ యంత్రాలు తప్పనిసరిగా ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది.

రైతులకు తీవ్ర నష్టం

కేంద్రం పేర్కొన్న ప్రమాణాలు పాటించకుండా తయారయ్యే బయో ఉత్పత్తులు రైతులకు చేరితే నేల సారం దెబ్బతిని, పంట దిగుబడులు తగ్గుతాయి. దీంతో తీవ్ర ఆర్థిక నష్టం అన్నదాతలు ఎదుర్కోవాల్సి వస్తుందని.. నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో

కలెక్టర్ అన్సారియా తనిఖీ

గుంటూరు మెడికల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న కానూరి జింకానా మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అప్రోచ్ రహదారి, మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30న సీఎం చంద్రబాబు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. అనంతరం జీజీహెచ్‌లో ని పలు వార్డుల్లో పర్యటించారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే వారికి మంచి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కోరారు. జీజీహెచ్‌లో వైద్య సేవలకు మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టే విధంగా వైద్య సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి హృదయాల్లో చక్కటి స్థానం సంపాదించాలని సూచించారు. ఎదుటి వారి కష్టం.. తమ కష్టంగా భావించినప్పుడే సేవా భావం పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, పరిపాలన అధికారి సుధారాణి, తహసీల్దారు సుభాని ఉన్నారు.


ఎంసీహెచ్ కేంద్రంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

● శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్
● కేఎల్‌యూలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

తాడేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు, క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) డైరెక్టర్ ఎస్ సంతోష్ కుమార్ అన్నారు. శనివారం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల బాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, గెలుపోటములు సమాన స్థాయిలో తీసుకోవాలన్నారు. అమరావతిలో అన్ని క్రీడలను ఒకేచోట నిర్వహించేందుకు అత్యున్నతస్థాయిలో స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేఎల్‌యూలోని అంతర్జాతీయ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కేఎల్‌యూ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ, మూడు రోజులు జరిగే ఈ టోర్నమెంట్‌కు ఆలిండియా దేశవ్యాప్తంగా 160 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అందరికి ఉచిత సదుపాయాలు కల్పించామని చెప్పారు. యువ క్రీడాకారులకు ప్రోత్సాహన్ని అందించడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఒక్కో జోన్‌కు నాలుగు జట్లు చొప్పున మొత్తం 16 జట్లు 16 విశ్వవిద్యాలయాల నుంచి పాల్గొంటున్నాయన్నారు. తొలుత లీగ్ పోటీలు జరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ జి.సారధివర్మ, క్రీడల డైరెక్టర్ హరికిషోర్, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, వెంకటరామ్, డీన్‌లు కేఆర్ఎస్ ప్రసాద్, హబిబుల్లాఖాన్, రిజిస్ట్రార్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరు జట్టు విజయం

తొలిరోజు మ్యాచ్‌లో కేఐఐటీ యూనివర్సిటి ఒడిస్సాపై బెంగుళూరు జైన్ యూనివర్సిటి జట్టు విజయం సాధించగా, దీనదయాల్ యూనివర్సిటీపై యూనివర్సిటి ఆఫ్ కాలికట్ విజయం సాధించాయి వీటితోపాటు మరో 6 జట్లు విజేతలుగా నిలిచాయి. ఆదివారం 8 జట్లు తలపడతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు.


పోటీలలో తలపడుతున్న క్రీడాకారులు


క్రీడాకారులతో శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్, హరికిషోర్

పెదకాకాని మల్లేశ్వరుడి సన్నిధిలో బోయపాటి


పెదకాకాని శివయ్య సేవలో ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను వచ్చారు. ఆయనకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బోయపాటి శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ పాల్గొన్నారు.

అమరావతిలో రిపబ్లిక్ డే ట్రైల్ పరేడ్

తుళ్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల సముదాయాల మీదగా హైకోర్టుకు వెళ్లే మార్గంలో 22 ఎకరాలు సిద్ధం చేస్తున్నారు. శనివారం ట్రైల్ పరేడ్ నిర్వహించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు వేడుకల్లో పాల్గొంటారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గత రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.







సెలెబ్ టాక్



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్‌ఖాన్ కూతురు, సుహానా ఖాన్... తన తల్లితండ్రుల పెంపకం గురించీ, కుటుంబ తీరుతెన్నుల గురించీ ఆసక్తికరమైన విశేషాలను తాజాగా వెల్లడించింది. త్వరలో తండ్రితో కలిసి 'కింగ్' సినిమాలో నటించబోతున్న సుహానా చెప్పిన వ్యక్తిగత విషయాల గురించి తెలుసుకుందాం...



అంతిమ సలహా వాళ్లదే

లైమ్‌లైట్‌కు దూరంగా పెరిగిన సుహానా నటిగా మారుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ షారూఖ్, గౌరిల గారాల పట్టి, నటననే కెరీర్‌గా ఎంచుకుని అందర్నీ ఆశ్చర్యపరిచింది. సంపన్న కుటుంబంలో కుటుంబ వ్యవహారాలు భిన్నంగా ఉంటాయనీ, కుటుంబసభ్యులు ఎవరికి వారు స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారనీ అనుకుంటాం. కానీ షారూఖ్ కూతురు సుహానా ఖాన్, తన ఇంట్లో నెలకొని ఉండే పూర్తి భిన్నమైన వాతావరణం గురించి వివరిస్తూ... 'ప్రతి చిన్న విషయాన్నీ తల్లితండ్రుల దృష్టికి తీసుకువెళ్లకపోయినా, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ప్రతి సందర్భంలో తల్లితండ్రులను ఆశ్రయిస్తూ ఉంటాను. మొదట్లో ప్రవృత్తిని అనుసరించి, లాజిక్‌తో ఆలోచించి, ప్రక్రియ మొత్తాన్నీ అవసరానికి మించి విశ్లేషించడం నా నైజం. నిర్ణయం తీసుకునే ముందు, కొన్ని ఆప్షన్స్‌ను ఎంచుకుని, అంతిమంగా వాటిని తల్లిదండ్రుల ముందు ఉంచినప్పుడు, వాళ్లు అంతిమంగా సరైన నిర్ణయం వైపు నడిపిస్తూ ఉంటారు. నాన్న, అమ్మ... ఇద్దరూ జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ప్రతి సందర్భంలో నాకు మార్గనిర్దేశం చేస్తూ ఉంటారు' అంటూ మీడియాకు వివరించింది.

భిన్నమైన ధోరణులే తోడ్పడ్డాయి

సలహాలివ్వడంలో కూడా తన తల్లితండ్రులు భిన్నంగా వ్యవహరిస్తారనీ, ఇద్దరూ భిన్నమైన ధోరణులను అవలంబిస్తారనీ వివరిస్తూ... 'నాన్న కాస్త కవితాత్మకంగా సలహాలిస్తూ, జీవితం పట్ల తనకున్న బహుముఖ దృక్కోణాలను ప్రదర్శిస్తూ ఉంటారు. కానీ అమ్మ డొంకతిరుగుడు లేకుండా, సూటిగా మాట్లాడుతుంది. ఎలాంటి అయోమయానికి తావు లేకుండా, ఆచరణాత్మకంగా మార్గనిర్దేశం చేస్తుంది. ఈ రకమైన తల్లిదండ్రుల భిన్నమైన ధోరణులు సంతులనాన్ని కనిపెట్టడంలో నాకెంతో బాగా సహాయపడ్డాయి. మన పట్ల ఇతరులకున్న అభిప్రాయాల గురించిన ఒత్తిడికి లోనవడం సులభం. కానీ ఆ మార్గంలోకి ప్రవేశించకుండా జాగ్రత్త పడుతూ ఉంటాను. బదులుగా, ప్రజాభిప్రాయాల గురించి అతిగా ఆలోచించకుండా, ఒకసారికి ఒక పనిని పూర్తి చేసుకుంటూ వెళ్లే నైజాన్ని అలవాటు చేసుకున్నాను' అంటూ తల్లిదండ్రుల మార్గనిర్దేశం తనకెంతగా ఉపయోగపడుతూ ఉంటుందో వివరించింది సుహానా.

గదికి వెళ్లి ఏడ్చి....

అనేక సందర్భాల్లో నటుల సంతానం నటననే కెరీర్‌గా ఎంచుకుంటూ ఉంటుంది. కానీ సుహానా బాల్యంలో నటనను ఇష్టపడేది కాదు. ఆ విషయం గురించి వివరిస్తూ... 'చిన్నప్పుడు నటనను ఇష్టపడేదాన్ని కాదు. చాలా సందర్భాల్లో నటనను అసహ్యించుకునేదాన్ని. కానీ యుకెలో, బోర్డింగ్ స్కూల్‌లో చదివే రోజుల్లో ఒక నాటకం కోసం ఆడిషన్లు జరిగాయి. ఆ నాటకంలో ఒక పాత్రంటే నాకు చాలా ఇష్టం. దాన్లో నటించాలని గట్టి పట్టుదల పెరిగిపోయింది. కానీ చివర్లో వెల్లడించిన ఫలితాల్లో ఆ పాత్రకు బదులుగా కోరస్‌కు ఎంపికైనట్టు తెలియడంతో, ఎంతో నిరాశకు లోనయ్యాను. నాటకంలో నటించే అర్హత పొందలేకపోవడంతో, గదికి తిరిగొచ్చి, చాలాసేపు ఏడ్చాను. నటన అన్నది కుటుంబ వారసత్వం మాత్రమే కాదనీ, నాకున్న బలమైన కోరిక అదేననీ తెలిసొచ్చింది. వేదిక మీద నటించడంలో కలిగే సంతృప్తినీ, థ్రిల్‌నూ కోరుకుంటున్నానే విషయాన్ని కూడా ఆ సందర్భంలో పూర్తిగా గ్రహించగలిగాను' అంటూ నటన పట్ల తనకున్న మక్కువ గురించి వివరించింది సుహానా. ఆ అపజయంతో నటన మీద పట్టు పెంచుకోవాలనే సంకల్పం బలపడి, న్యూయార్క్ యూనివర్సిటీ, టిష్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో నటనలో శిక్షణ పొందింది. 2023లో, నెట్‌ఫ్లిక్స్, ఆర్చీస్‌లో నటించిన సుహానా తాజాగా తండ్రి షారూఖ్ ఖాన్‌తో కలిసి 'కింగ్' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాతో వెండితెర కొత్త తారగా ప్రేక్షకులకు పరిచయం కాబోతోంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సండోకాన్	వెబ్‌సిరీస్	జనవరి 19
జస్ట్ ఎ డాష్	వెబ్‌సిరీస్	జనవరి 20
తేరే ఇష్క్ మే	హిందీ చిత్రం	జనవరి 23
అమెజాన్ ప్రైమ్		
ప్రిపరేషన్ ఫర్ ది నెక్స్ట్ లైఫ్	హాలీవుడ్ మూవీ	జనవరి 18
చీకటిలో	తెలుగు చిత్రం	జనవరి 23
జియో హాట్‌స్టార్		
హిమ్	హాలీవుడ్ మూవీ	జనవరి 19
ఆహా...		
శంబాల	తెలుగు చిత్రం	జనవరి 22





సండే సెలబ్రిటీ



నిద్రంటే మెడిటేషన్

వయసు పెరుగుతున్నా తరగని అందం ఆమె సొంతం. ఐదు పదుల వయసులోనూ ఫిట్‌నెస్‌కు మారుపేరుగా నిలిచే బాలీవుడ్ నటి మలైకా అరోరా తన గ్లామర్ వెనుక ఉన్న అసలు రహస్యం జిమ్ కసరత్తులు మాత్రమే కాదని చెబుతోంది. నిద్రకు ఆమె ఇస్తున్న ప్రాధాన్యం, అనుసరిస్తున్న 'స్లీప్ మంత్రం' ఇప్పుడు వెల్‌నెస్ ప్రపంచంలో చర్చనీయాంశమయ్యాయి.

మలైకా దృష్టిలో 2026వ సంవత్సరం కేవలం శారీరక దృఢత్వానికే పరిమితం కాదు. ఆమె ఈ ఏడాది తన ప్రధాన లక్ష్యంగా 'అంతర్గత ప్రశాంతత'ను కాపాడుకోవడం అని ప్రకటించింది. మనం ఎంత కష్టపడి వ్యాయామం చేసినా మనసు ప్రశాంతంగా లేకపోతే అది శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మలైకా చెబుతోంది. అందుకే ఈ ఏడాది తన వెల్‌నెస్ ప్రయాణంలో నిద్రకు, మానసిక ప్రశాంతతకు పెద్దపీట వేసినట్టు చెప్పుకొచ్చింది.

బెడ్రూంలో ఫోన్లకు నో ఎంట్రీ

నేటి డిజిటల్ యుగంలో నిద్రలేమికి ప్రధాన కారణం స్మార్ట్‌ఫోన్లేనని మలైకా అభిప్రాయం. అందుకే తన బెడ్రూంలోకి ఫోన్లను అనుమతించదు. నిద్రపోవడానికి రెండు గంటల ముందే సోషల్ మీడియాకు, ఈమెయిల్స్‌కు స్వస్తి చెప్పి 'డిజిటల్ డిటాక్స్' పాటిస్తోంది. ఈ అలవాటు వల్ల మెదడుపై ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుందని అనుభవపూర్వకంగా చెబుతోంది. రాత్రి పది గంటలకల్లా నిద్రకు ఉపక్రమించడం ఆమె దైనందిన జీవితంలో ఒక విడదీయలేని భాగం

స్లీప్ వెకేషన్స్‌పై మక్కువ

నిత్యం షూటింగ్స్, ప్రయాణాలతో బిజీగా ఉండే మలైకా తన శరీరాన్ని రీచార్జ్ చేసుకోవడానికి 'వెల్‌నెస్ రిట్రీట్స్' లేదా 'స్లీప్ వెకేషన్స్'ను ఆశ్రయిస్తుంది. ఏడాదికి ఒకసారి బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా, కేవలం నిద్ర, ప్రకృతితో గడపడం వల్ల కోల్పోయిన శక్తిని మళ్లీ దక్కించుకోవచ్చని అంటారామె. ఇలాంటి పర్యటనలు మన శరీరంలోని సహజ సిద్ధమైన రిపేర్ వ్యవస్థను మెరుగుపరుస్తాయని ఆమె గట్టిగా విశ్వసిస్తారు.

ఆహారం.. ప్రాణాయామం

మంచి నిద్ర కోసం మలైకా ఆహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెడతారు. సూర్యాస్తమయం లోపే రాత్రి భోజనం ముగించడం ఆమె ఫిట్‌నెస్ రహస్యం. పడుకునే ముందు చేసే సులభమైన ప్రాణాయామం, శ్వాస మీద ధ్యాస ఉంచడం వంటి ప్రక్రియలు తనను పసిపాపలా నిద్రపోయేలా చేస్తాయని చెబుతోంది. "నిద్ర అనేది ఒక విలాసం కాదు, అది మన శరీరం కోరుకునే గౌరవం" అంటూ ఆమె ఇచ్చే ఈ వెల్‌నెస్ టిప్స్ ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

జెన్‌జీలు మెచ్చే జ్యువెలరీ



హుందాతనాన్ని, నూతనత్వాన్ని అమితంగా ఇష్టపడే జెన్‌జీలు ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో ఉండే సరికొత్త ఫ్యాషన్‌లపై దృష్టిపెడుతుంటారు. డ్రెస్, హెయిర్ స్టైల్, ఫుట్‌వేర్, మేకప్ తదితరాలన్నింటిమీద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంటారు. ముఖ్యంగా ఈ తరం అమ్మాయిలు ఎంపిక చేసుకునే ఆభరణాలు వారి అభిరుచిని ప్రతిబింబించేలా ఉంటాయి. సింపుల్‌గా, అహ్లాదకరంగా కనిపిస్తూ.. ఏ సందర్భానికైనా చక్కగా నప్పేలా నగలు పెట్టుకోవడం జెన్‌జీల ప్రత్యేకత. అలాంటి మినిమలిస్టిక్ మోడరన్ సింపుల్ జ్యువెలరీపై ఓ లుక్కేద్దామా...

ప్రస్తుతం 30 ఏళ్లలోపు వయసున్న యువతను జెన్‌జీలుగా పరిగణిస్తుంటారు. వీరిలో అధికశాతం విద్యావంతులే. సంప్రదాయపరమైన వైవిధ్యాలకు అతీతంగా వీరి ఆలోచన శైలి, అభిరుచులు ఉంటాయి. చదువు, ఉద్యోగాల రీత్యా ఏ ప్రాంతంలో ఉండాల్సి వచ్చినా అక్కడి సంస్కృతిని అవగాహన చేసుకొని స్థానికుల్లో ఒకరిగా మెలగడం వీరి లక్షణం. దీన్ని గమనించిన డిజైనర్లు... వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్నమైన సంప్రదాయ డిజైన్లను సరళీకరించి కొంత ఆధునికతను మేళవిస్తూ సరికొత్త సింపుల్ జ్యువెలరీని రూపొందిస్తున్నారు. ఇవి రోజువారీ ధరించడానికి అనుకూలంగా ఉండడమే కాకుండా అన్ని రకాల మోడరన్ డ్రెస్‌లమీద అందంగా సూటవుతాయి. దీంతో వీటిని కాలేజీలకెళ్లే యువతులు, ఉద్యోగినులు అమితంగా ఇష్టపడుతున్నారు.



జెన్‌జీలు బంగారు ఆభరణాల కంటే వెండి, స్టెర్లింగ్ వెండి, బ్లాక్ మెటల్, సర్జికల్ స్టెయిన్‌లెస్ స్టీల్, టైటానియంతో రూపొందించిన వాటినే ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు. అవి కూడా సింపుల్ డిజైన్లను మాత్రమే. జీన్స్ టీషర్ట్‌లు, కాటన్ సల్వార్స్ మృదువైన చీరల మీద ఒద్దికగా అమరే లేయర్డ్ చెయిన్లు, మిస్‌మ్యాచ్‌డ్ స్టడ్స్, స్పెషల్ రింగ్స్‌ను మహిళలు ఇష్టంగా కొంటున్నారు. ఇవి కార్యాలయాల్లో రోజువారీ మీటింగ్స్ నుంచి చిన్న పార్టీల వరకు అన్ని సందర్భాల్లో హుందాగా కనిపించేలా చేస్తాయి.

పుట్టిన రోజు, పండుగలు, ఏదైనా శుభకార్యం లాంటి ప్రత్యేక సందర్భాలకోసం వేచి చూడకుండా సమయం ఉన్నప్పుడల్లా షాపులను చుట్టేస్తూ రకరకాల డిజైన్లను పరిశీలించి తమకు నచ్చినవాటిని తెలివిగా కొనుగోలు చేస్తున్నారు అమ్మాయిలు. ఖరీదైన భారీ ఆభరణాలకు బదులు తక్కువ బడ్జెట్‌లో వీలైనన్ని ఎక్కువ నగలను ఎంపిక చేసుకుంటున్నారు. తేలికగా సింపుల్‌గా అందంగా చౌకగా ఉండే విభిన్నమైన డిజైన్లకు మాత్రమే ఓటేస్తున్నారు. ఆన్‌లైన్, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను సైతం చక్కగా వినియోగించుకుంటున్నారు. బంగారు నగల మీద ఆసక్తి ఉన్న మహిళలు మాత్రం 9 లేదా 14 క్యారెట్ల బంగారంతో రూపొందించిన అత్యంత నాజూకైన గొలుసులు, జుంకాలను ధరించి మురిసిపోతున్నారు.



చిన్న సైజు రత్నాలు, రంగురంగుల బీడ్స్, క్రిస్టల్స్, సీజెడ్ రాళ్లు పొదిగి తయారుచేసిన చిన్న చోకర్లు, స్పెషల్ నెక్లెస్‌లు, సన్నని పొడవైన హారాలు, నాజూగ్గా మెరిసే గాజులను పార్టీలు, శుభకార్యాలు, పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి మొగ్గు చూపుతోంది యువత. అమ్మాయిలు ఎక్కువగా సింపుల్ పెండెంట్ ఉన్న రకరకాల చెయిన్లు, బ్రేస్‌లెట్‌లు, చంకీ రింగ్‌లు, ఇయర్ కఫ్‌లు, హూప్స్, స్క్రూ బ్యాక్ ఉన్న మెరిసే స్టడ్‌లను ఇష్టపడుతున్నారు. ఇవి స్కూల్ యూనిఫామ్‌లతోపాటు క్యాజువల్ వేర్ డ్రెస్‌ల మీద ధరించడానికి వీలుగా ఉంటాయి. స్టయిల్‌గా కనిపిస్తాయి. వీటితో ఎలాంటి అభద్రతా భావం ఉండదు. సాధారణంగా కనిపిస్తూనే నలుగురిలో ప్రత్యేకంగా నిలిపే నాజూకైన సింపుల్ జ్యువెలరీనే జెన్‌జీల ప్రధాన ఎంపికగా ఉంటోంది.

వెండితెరపై చూడచక్కని అభినయం... సామాజిక కార్యకర్తగా పర్యావరణహితం... రీల్ లైఫ్‌లోనే కాదు... రియల్ లైఫ్‌లోనూ కథానాయిక ఆమె. గాలి... నీరు... మట్టి... కలుషితమవుతున్న సహజసిద్ధ వనరుల పరిరక్షణను బాధ్యతగా స్వీకరించి... ఆ దిశగా ప్రజలను ముందుండి నడిపిస్తున్నారు. దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి... డాక్యుమెంటరీలు రూపొందించి అవగాహన కల్పిస్తున్న జోతిత దోడా కథ ఇది.

సంకల్పం



నిజ జీవిత కథానాయిక

"ఏడేళ్ల కిందటి విషయం. షూటింగ్ కోసం కేరళ వెళ్లాను. అదే సమయంలో రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. నేను, నా సహాయక సిబ్బంది... చిక్కుకుపోయాము. అందులో నుంచి బయటపడటానికి పది రోజులు పట్టింది. అతికష్టం మీద తప్పించుకొని చివరకు తమిళనాడు చేరాం. కానీ వరదల్లో కొట్టుకుపోయినవారు... ఇళ్లు, జీవనాధారం కోల్పోయినవారు... చాలా రోజులు ఆ దృశ్యాలు నన్ను వెంటాడాయి. 'విపత్తులు వచ్చినప్పుడే మనం స్పందిస్తున్నాం. కానీ వాటిని నియంత్రించే దిశగా ఎందుకు ఆలోచించడంలేదు?'... అనేది నా ప్రశ్న. అసలు ఇది సాధ్యమేనా? శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలను కలిశాను. పర్యావరణ శాస్త్రంలో ప్రాథమిక శిక్షణ తీసుకున్నాను. తరువాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో దీనికి సంబంధించి కోర్సు ఒకటి చేశాను.

విపత్తులపై డాక్యుమెంటరీ...

సినిమాలే లోకంగా సాగిపోతున్న నా జీవితాన్ని కేరళ వరదలు పూర్తిగా మార్చేశాయి. ఆ సమయంలో నా అనుభవాలు, ఆ తరువాత నేను చేసిన పరిశోధన, సంపాదించిన పరిజ్ఞానంతో 2022లో 'ఇండియా: ది గోల్డెన్ స్పారో డిజాస్టర్ రిస్క్ రిడక్షన్' అనే డాక్యుమెంటరీ మొదలుపెట్టాను. అది పూర్తవడానికి ఏడాది కాలం పట్టింది. విపత్తు సంసిద్ధత, విధానపరమైన అంతరాలను అధిగమించడం తదితర అంశాలపై డాక్యుమెంటరీలో ప్రస్తావించాను. ప్రధానంగా విపత్తు అనంతర సహాయక చర్యల కంటే నివారణ ప్రణాళికలు రూపొందించడం ఎలా అనేదానిపై దృష్టి పెట్టాను. యూకే, ఇజ్రాయెల్, రష్యా తదితర అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శితమైంది. ఉత్తమ దర్శకురాలిగా, నటిగా పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా అందుకున్నాను. 2024లో జరిగిన 'సేవ్ అండ్ ప్రిజర్వ్ ఫెస్టివల్'లో పాల్గొమని రష్యా ఆహ్వానించింది. పర్యావరణ సమస్యలపై అందులో మాట్లాడే అవకాశం లభించింది. అంతే కాదు... అక్కడ నిర్వహించిన చిత్రోత్సవంలో ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపికైంది. నా సేవలకు గాను ఇండియన్ బార్ అసోసియేషన్ ప్రకటించిన అత్యంత ప్రభావవంతమైన మహిళల టాప్ 100 జాబితాలో చోటు దక్కింది.



అమ్మానాన్నల నుంచి...

ఇతర రంగాలతో పోలిస్తే చిత్ర పరిశ్రమ ఎంతో భిన్నమైనది. అందులోనే కాదు, జీవితంలోనైనా అనుకున్నది సాధించాలంటే క్రమశిక్షణ అత్యంత కీలకం. దీంతోపాటు సమాజం పట్ల బాధ్యత, సేవాభావం మా అమ్మ జస్విందర్, నాన్న ఇంద్రజిత్ దోడా నుంచి అలవడ్డాయి. ముఖ్యంగా మా నాన్నకు ప్రకృతిమీద ఉన్న అపరిమిత ప్రేమ, చేసే పనిలో నిబద్ధత నాకు ప్రేరణ. నేను పుట్టింది చండీగఢ్‌లో. చిన్నప్పటి నుంచి నటనపై మక్కువ. బడి రోజుల్లోనే నాటకాల్లో నటించేదాన్ని. ఎంబీఏ పూర్తయ్యాక పూర్తి సమయం సినిమాలకే కేటాయించాను. ముంబయికి నివాసం మార్చాను. వెండితెరపై తొలి అవకాశం కన్నడ చిత్రం 'మించు'(2010)లో వచ్చింది. ఆ సినిమా సూపర్ హిట్ అయింది. తరువాత వరుసగా నాలుగు పంజాబీ సినిమాలు చేశాను. 2017లో 'హీర్ అన్‌స్టాపబుల్'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టాను. విశేషమేమిటంటే దానికి నేనే దర్శకురాలిని. చాలా చిత్రోత్సవాలకు ఎంపికైంది. ఉత్తమ దర్శకురాలిగా నాకు అవార్డు దక్కింది. నాటి నుంచి ఎంత పని ఒత్తిడి ఉన్నా ఏడాదికి ఒక సినిమాకు తగ్గకుండా చేసుకొంటూ వస్తున్నాను.

ఫ్యాషన్ రంగంలో...

ఔత్సాహిక డిజైనర్లు, నేత కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో కొన్నేళ్ల కిందట 'చండీగఢ్ ఫ్యాషన్ వీక్' అనే సంస్థను స్థాపించాను. అలాగే మా సోదరుడు హర్దీప్‌తో కలిసి 'నియాన్‌వేల్' లనే సంస్థను నెలకొల్పాను. పర్యావరణంపై అవగాహనతోపాటు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నాను. వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, వారి ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నాను. ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నాను. మాదక ద్రవ్యాలు, ఆడ శిశు హత్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాను. ఇవన్నీ ఎవరి మెప్పు కోసమో కాదు... నా సంతృప్తి కోసం చేస్తున్నాను. తెరపై చూసి నన్ను అభిమానించేవారికి నిజ జీవితంలోనూ ఒక స్ఫూర్తిమంత్రంగా నిలవాలన్నది నా అభిలాష."

హెల్దీ లైఫ్

చర్మం పొడిబారుతోందా?

చలికాలం ప్రధానంగా వేధించే సమస్యల్లో ఒకటి... చర్మం పొడిబారడం. చర్మం త్వరగా తేమను కోల్పోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే దురదలు, దద్దుర్లు, పొలుసులవంటివి చికాకు పెడతాయి. అయితే ఇంట్లో తయారు చేసుకోగలిగే సహజసిద్ధ టోనర్‌లతో దీనికి చెక్ పెట్టవచ్చంటున్నారు బ్యూటీషియన్లు.

ఆపిల్‌సైడర్ వెనిగర్ టోనర్: ఇది అన్ని రకాల చర్మాలకూ ఉపయోగపడుతుంది. చర్మం పీహెచ్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది. ఇందులో ఎసిటిక్ యాసిడ్ ఆధారిత యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉండటంవల్ల మొటిమలు కలిగించే బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది. మృతకణాలు పోగొట్టి చర్మానికి కాంతినిస్తుంది. ఒక భాగం ఆపిల్ సైడర్ వెనిగర్‌ను మూడు భాగాల నీటితో కలిపి, కంటైనర్‌లో నిల్వ చేయండి. అందులో దూదిని ముంచి, ముఖమంతా తుడిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

రోజ్‌వాటర్ టోనర్: ఇది చర్మాన్ని తేమగా మారుస్తుంది. పీహెచ్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది. దీనిలోని యాంటీ ఇంఫ్లమేటరీ లక్షణం చర్మానికి ఉపశమనం కలిగిస్తుంది. 40 ఎంఎల్ రోజ్ వాటర్‌ను 5 ఎంఎల్ గ్లిజరిన్‌తో కలిపి ఒక కంటైనర్‌లో నిల్వ చేసుకోండి. అందులో ముంచిన దూదితో చర్మంపై రాస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఇలా రోజూ ప్రయత్నించండి. ముఖ్యంగా రసాయనాలు, కల్తీ లేని రోజ్‌వాటర్‌ను ఎంచుకోండి.



బిజినెస్ ప్లస్

గుంటూరు ● ఆదివారం 18 జనవరి 2026



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,43,780 ▲	1,31,800 ▲	3,10,000 ▲
విజయవాడ	1,46,000 ▲	1,36,000 ▲	2,90,000 ▲
విశాఖపట్నం	1,43,780 ▼	1,31,800 ▲	3,10,000 ▲
రాజమండ్రి	1,43,620 ▲	1,31,650 ▲	2,76,000 ▲
ప్రొద్దుటూరు	1,43,300 ▲	1,31,840 ▲	2,81,000 ▲
ముంబై	1,41,590 ▼	1,29,700 ▼	2,81,890 ▲

20న డిజిలాజిక్ సిస్టమ్స్ ఐపీఓ

● ఇష్యూ ధర రూ.98-104

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డిజిలాజిక్ సిస్టమ్స్ లిమిటెడ్.. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 20న ప్రారంభమై 22న ముగియనుంది. ఇష్యూ ధరను రూ.98-104గా కంపెనీ ఖరారు చేసింది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదు చేయనున్న ఈ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.81 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. తాజా ఈక్విటీ షేర్ల ద్వారా రూ.69.67 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో రూ.11.33 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. సోమవారం (19వ తేదీ) యాంకర్ ఇన్వెస్టర్ల కోసం ఇష్యూ ప్రారంభ కానుంది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.51.73 కోట్లతో హైదరాబాద్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయటంతో పాటు రూ.8 కోట్లను రుణాల చెల్లింపు కోసం వినియోగించనున్నట్లు డిజిలాజిక్ సిస్టమ్స్ సీఈఓ జే శశాంక్ వర్మ వెల్లడించారు. రక్షణ, ఏరోస్పేస్ రంగం కోసం ఆటోమేటెడ్ సిస్టమ్స్, అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ సేవలను డిజిలాజిక్ అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	583	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	164
కర్నూలు	156	నెల్లూరు	169
విశాఖపట్నం	145	అనంతపురం	169
గోదావరి	157		

కాలం మారింది..
మీరూ మారాలి..



ఆర్థిక విషయాల్లో అధిక భద్రత అభివృద్ధికి అవరోధంగా మారిందా..? మీ పెద్దల ఆర్థిక సలహాలు వారిని నష్టాల నుంచి రక్షించి ఉండవచ్చు. కానీ వేగంగా మారుతున్న పరిస్థితుల్లో అందులో కొన్ని మీ ఆర్థిక ప్రగతిని పరిమితం చేసే అవకాశం ఉంది. కాబట్టి, నాటి ఆర్థిక నియమాల్లో ఇప్పటికీ మీకు ఉపయోగ పడుతున్నవేంటి..? మీ పురోగతికి అడ్డుపడుతున్నవేంటి..? అని బేరీజు వేసుకోండి.

డబ్బు ఖర్చు, నిర్వహణ, పొదుపు లాంటి విషయాలను ప్రధానంగా మన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆ తర్వాత బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి నేర్చుకుంటుంటాం. సామాజిక ఆమోదంతో పాటు భద్రమైనవి కాబట్టి వారి సలహాలు, నియమాలనే మనమూ అనుసరిస్తుంటాం. కానీ, కాలంతో పాటు మన జీవనశైలితో సహా మార్కెట్లో పరిస్థితులు, ఆర్థిక అవసరాలూ వేగంగా మారుతూ వస్తున్నాయి. కాబట్టి, పొదుపు-పెట్టుబడులకు సంబంధించి నాటి ఆర్థిక నియమాలు నేడూ ఆచరణీయమా కాదా అని సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మీ ఆర్థిక పురోగమనం, లక్ష్యాల సాధనకు అవరోధంగా మారిన నియమమైనా, సలహానైనా పక్కన పెట్టి.. నేటి కాలంలో ఉత్తమమైన ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడంపై దృష్టి సారించండి. ప్రస్తుత తరం వారు సమీక్షించుకోవాల్సిన పెద్దల ఆర్థిక సలహాలు, నియమాల్లో కొన్ని మీకోసం..

ఎఫ్‌డీతో భద్రత సరే.. సొమ్ము వృద్ధి మాటేమిటి?

సొమ్ము భద్రంగా ఉండాలంటే ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) లేదా సేవింగ్ ఖాతాలో జమ చేయాలన్నది పెద్దలిచ్చే సలహా. ఇప్పటికీ వీటిల్లో జమ చేసిన సొమ్ముకు భద్రతకు ఢోకా లేదు. కానీ, ధరాఘాతం ప్రభావంతో వాటిల్లో దాచుకున్న డబ్బు విలువ పెరుగుదలకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లిపోయాయి. ఎందుకంటే, ఏటేటా ధరలు వేగంగా పెరుగుతూ పోతుండగా.. గడిచిన కొన్నేళ్లలో సేవింగ్ అకౌంట్ లేదా ఎఫ్‌డీపై బ్యాంక్‌లు చెల్లించే వార్షిక వడ్డీ గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత ధరల వార్షిక పెరుగుదల 6-7 శాతంగా ఉండగా.. ఎఫ్‌డీపైనా బ్యాంక్‌లు కాలపరిమితి బట్టి గరిష్ఠంగా 7 శాతం వరకు (సీనియర్ సిటిజన్లు మినహాయించి) వడ్డీ చెల్లిస్తున్నాయి. ధరాఘాతం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు మీ ఎఫ్‌డీ సొమ్ము వృద్ధి దాదాపు సున్నా. నేటి కాలంలో సంపద పెరగాలంటే, పెట్టుబడికి భద్రతతో పాటు విలువ వృద్ధికీ సమ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అప్పులకు ఆమడ దూరం అక్కర్లేదు..

అప్పుకు ఆమడ దూరంగా ఉండాలన్నది పెద్దల మాట. అనాలోచితంగా, అవసరం లేకపోయినా అధిక వడ్డీకి అప్పు తీసుకోవడం ముమ్మాటికీ తప్పే. కానీ, వ్యాపారం లేదా ఉన్నత విద్య లేదా భవిష్యత్ వృద్ధికి బాటలు వేయగలిగే ఏ పని కోసమైనా రుణం తీసుకోవడం తెలివైన నిర్ణయం. అయితే, తిరిగి చెల్లించగలిగే సామర్థ్యానికి అనుగుణంగా, వీలైనంత తక్కువ వడ్డీకి రుణం పొందడం ఉత్తమం.

షేర్లలో పెట్టుబడి జూదమేమీ కాదు..

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి బాగా నష్టపోయారు లేదా దివాలా తీశారని అడపాదడపా వింటూనే ఉంటాం. వారంతా సరైన వ్యూహం, మార్గ నిర్దేశం లేకుండా పెట్టుబడులు పెట్టినవారే. అర్హులైన ఆర్థిక సలహాదారుల పర్యవేక్షణలో, దీర్ఘకాలిక వ్యూహంతో, క్రమశిక్షణతో మార్కెట్ డేటా ఆధారంగా షేర్లలో పెట్టుబడులు మీకు ఆకర్షణీయ ప్రతిఫలాలు అందించగలవు. స్టాక్ మార్కెట్‌పై పూర్తి అవగాహన లేని పక్షంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోనూ ఇన్వెస్ట్ చేయవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలైతే (సిప్) మరింత మేలు.

అద్దె.. వ్యర్థమంటే ఎలా..?

సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. చిన్నదో పెద్దదో మనకంటూ ఓ ఇల్లు ఉంటే జీవితానికి స్థిరత్వం. భద్రత కూడా. పైగా, ఆ సంతృప్తే వేరు. కానీ, మార్కెట్లో ఇళ్లు, ఫ్లాట్స్, ప్లాట్ల ధరలు సగటు జీవి భరించలేనంత భారీగా పెరిగాయి. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లోనైతే అపార్ట్‌మెంట్ల ఎత్తుతో పాటు వాటి రేట్లూ ఆకాశాన్నంటుతున్నాయి. కాబట్టి, గృహం కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేనప్పుడు, అద్దె ఇంట్లో జీవించడమే మంచి ప్రత్యామ్నాయం. అద్దె ఇళ్లు మీకు వెసులుబాటుతో పాటు నిర్వహణ భారాన్నీ తగ్గిస్తుంది. పైగా, జీవితంలోని ఇతర అవసరాలకూ ఆదా చేసే అవకాశమూ కల్పిస్తుంది.

బీమాతో జీవితానికి ధీమా.. సంపద వృద్ధికి కాదు..

అందరికీ బీమా అవసరమే. బీమాతో మీ జీవితం, ఆరోగ్యానికి ధీమా లభిస్తుంది. అయితే, చాలా మంది ఏజెంట్లు ఎండోమెంట్, మనీబ్యాక్ పాలసీలను భద్రమైన పెట్టుబడి సాధనాలంటూ నమ్మబలికి అవసరం లేనివారికీ అంటగడుతుంటారు. కానీ, వీటిల్లో పెట్టుబడులపై లభించే వార్షిక రిటర్ను కేవలం 4-5 శాతమే. ధరాఘాత ప్రభావాన్ని (ఏటేటా 6-7 శాతం ధరల పెరుగుదల) పరిగణలోకి తీసుకుంటే, పాలసీ గడువు తీరాక లభించే ప్రతిఫలం మైనస్ 1-2 శాతం. కాబట్టి, బీమా అవసరాన్ని పెట్టుబడితో ముడిపెట్టకుండా ఉండటం మేలు.

ఆనక ఆదా.. వద్దబ్బా!

సాధారణంగా భారతీయులు పెళ్లి, విద్య, ఇంటి కోసం అధికంగా వెచ్చిస్తారు. వీటి కోసం కొందరు పొదుపును కూడా త్యాగం చేస్తారు. కానీ, రిటైర్మెంట్ అనంతరం అవసరమైన డబ్బును యవ్వనం నుంచే ఆదా చేయడం ప్రారంభించాలి. ఏదో ఒక అవసరం కోసం రిటైర్మెంట్ పొదుపును విస్మరించడం లేదా ఆలస్యం చేయవద్దు. ఆర్జించడం ఆరంభించినప్పటి నుంచే ఇందుకోసం ఎంతో కొంత సొమ్మును క్రమానుగుత పెట్టుబడి పథకాల్లో (సిప్) పెడితే, 20-30 ఏళ్లకు భారీ రిటర్నులు అందుకునే అవకాశాలుంటాయి.

కేవలం ఆదా చేస్తే సరిపోదు..

వృథా ఖర్చులు తగ్గించి వీలైనంత ఆదా చేయాలని చెప్తుంటారు పెద్దలు. ఇది ముమ్మాటికీ నిజమే. కానీ, నేటి కాలంలో కేవలం ఆదా చేస్తే సరిపోదు. మీ ఆదాయాన్ని వీలైనంత పెంచుకునేందుకూ కృషి చేయాలి. మిత వ్యయం- అధికాదాయంతో మరింతగా కూడబెట్టవచ్చు. అది మాత్రమే సరిపోదు. ఆదా సొమ్మును తెలివిగా పెట్టుబడి పెడితేనే సంపద వృద్ధిని చూడగలం. భవిష్యత్ అవసరాలకు సిద్ధం కాగలం.

యూకో బ్యాంక్ లాభం రూ.740 కోట్లు

క్యూ3లో 16 శాతం వృద్ధి నమోదు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో (క్యూ3) ప్రభుత్వ రంగ యూకో బ్యాంక్ రూ.740 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.639 కోట్ల లాభంతో పోలిస్తే 16 శాతం వృద్ధిని కనబరిచింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో పాటు మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం ఇందుకు తోడ్పడింది. ఈ క్యూ3లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.7,521 కోట్లకు పెరిగింది. 2024-25లో ఇదే కాలానికి మొత్తం రెవెన్యూ రూ.7,406 కోట్లుగా నమోదైంది. మరిన్ని విషయాలు..

- సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.6,652 కోట్లకు ఎగబాకింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 11.27 శాతం వృద్ధితో రూ.2,646 కోట్లకు చేరుకుంది. అంతర్జాతీయ వ్యాపార నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.08 శాతంగా, దేశీయంగా ఎన్ఐఎం 3.27 శాతంగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో నిర్వహణ లాభం 5.93 శాతం వృద్ధితో రూ.1,680 కోట్లుగా నమోదైంది. గత క్యూ3లో ఇది రూ.1,586 కోట్లుగా ఉంది.
- 2024 డిసెంబరు 31 నాటికి 2.91 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ).. 2025 డిసెంబరు చివరి నాటికి 2.41 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.63 శాతం నుంచి 0.36 శాతానికి జారుకున్నాయి.

మూలధన సమీకరణ యత్నాల్లో బ్యాంక్

మూలధన నిధుల సమీకరణ కోసం క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) లేదా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) సహా తదితర మార్గాలను పరిశీలిస్తున్నట్లు యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు. మార్కెట్ పరిస్థితులను బట్టి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. కనీసం 25 శాతం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనలకు అనుగుణంగా బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా తగ్గించుకునేందుకు సెబీ నుంచి అదనపు గడువు కోరనున్నట్లు ఆయన చెప్పారు. ఈ గడువు 2026 ఆగస్టు 1తో ముగియనుంది. ప్రస్తుతం యూకో బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వం 90.95 శాతం వాటా కలిగి ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 12% వృద్ధి

ముంబై: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.19,807 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.17,657 కోట్లుగా ఉంది. కాగా, ఈ క్యూ3లో బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ లాభం వార్షిక ప్రాతిపదికన 11.46 శాతం పెరిగి రూ.18,653.75 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 6.4 శాతం వృద్ధితో రూ.32,600 కోట్లకు చేరగా.. వడ్డీయేతర ఆదాయం రూ.13,250 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.35 శాతంగా నమోదైంది. కొత్త లేబర్ కోడ్ అమలులో భాగంగా ఖర్చుల కోసం సమీక్షా త్రైమాసికంలో రూ.800 కోట్లు కేటాయించినట్లు బ్యాంక్ వెల్లడించింది. 2024 డిసెంబరు చివరినాటికి 1.42 శాతంగా (రూ.36,019 కోట్లు) ఉన్న బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ).. 2025 డిసెంబరు 31 నాటికి 1.24 శాతానికి (రూ.35,179 కోట్లు) తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.46 శాతం నుంచి 0.42 శాతానికి దిగివచ్చింది. మొండి బాకీల నష్టాలను పూడ్చుకోవడంతో పాటు ఇతర అవసరాల కోసం సమీక్షా త్రైమాసికంలో రూ.2,840 కోట్ల కేటాయింపులు జరిపినట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 2.68% డౌన్

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 2.68 శాతం తగ్గి రూ.12,537.98 కోట్లకు పరిమితమైంది. స్టాండ్‌ఎలోన్ లాభం 4 శాతం తగ్గి రూ.11,318 కోట్లకు జారుకుంది. బ్యాంక్ వ్యాపారం నిలకడగా వృద్ధి చెందడంతో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడినప్పటికీ, ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా అదనపు కేటాయింపులు జరపాల్సి రావడం బ్యాంక్ లాభాలకు గండి కొట్టింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 7.7 శాతం పెరిగి రూ.21,932 కోట్లకు పెరగగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.30 శాతానికి పెరిగింది. కొత్త లేబర్ కోడ్స్ అమలు కోసం రూ.145 కోట్లు కేటాయించినట్లు బ్యాంక్ తెలిపింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ తన ఎండీ, సీఈఓ సందీప్ భక్షి పదవీకాలాన్ని మరో 2 ఏళ్లు పొడిగించింది. దీంతో ఆయన 2028 అక్టోబరు 3 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.

సిరీస్ పట్టేదెవరు?

నేడు మూడో వన్డే

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

గెలుపే లక్ష్యంగా భారత్
తొలి సిరీస్ కోసం కివీస్


విరాట్


బ్రేస్‌వెల్

ఇండోర్: స్వదేశంలో న్యూజిలాండ్‌పై భారత క్రికెట్ జట్టు తిరుగులేని ఆధిపత్యం చూపుతోంది. ఎంతలా అంటే.. గతంలో భారత గడ్డపై కివీస్ ఏడుసార్లు పర్యటించినా ఒక్కసారి కూడా ఆ జట్టు ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను నెగ్గలేదు. ప్రస్తుతం మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైన వేళ ఆదివారం ఇండోర్‌లో ఇరుజట్ల మధ్య నిర్ణాయక పోరు జరుగనుంది. ఈనేపథ్యంలో పర్యాటక జట్టుపై ఎప్పటిలాగే టీమిండియా తమ జోరును చూపుతుందా? లేక దశాబ్ధాలుగా ఊరిస్తోన్న వన్డే సిరీస్‌ను కివీస్ తొలిసారి దక్కించుకుంటుందా? అనేది ఆసక్తిగా మారింది. ఇక.. 2019 నుంచి స్వదేశంలో భారత్.. ఏ జట్టుపైనా వన్డే సిరీస్‌ను కోల్పోలేదు.

అర్ష్‌దీప్‌నకు చాన్స్!

ఆఖరి మ్యాచ్‌లో గిల్ సేన కూర్పుపై అందరి దృష్టి పడనుంది. కొత్త బంతితో చక్కగా స్వింగ్ చేయగల లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్‌ను ఆడించే అవకాశం ఉంది. కివీస్ టాప్, మిడిలార్డర్‌లో ఎక్కువ కుడిచేతి బ్యాటర్లు ఉండడంతో వారిపై తను ఒత్తిడి పెంచవచ్చు. అలాగే మధ్య ఓవర్లలో స్పిన్నర్లపై భారం తగ్గుతుంది. అలాగే నితీశ్‌ను రెండో వన్డేలో ఆడించినా అతడితో పెద్దగా బౌలింగ్ చేయించలేదు. అతడి స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ ఆయుష్ బదోనితో ముందుకెళితే ఎలా ఉంటుందనే ఆలోచనలో కోచ్ గంభీర్ ఉన్నాడు. బ్యాటింగ్‌లో కెప్టెన్ గిల్ ఫామ్‌లోకి రాగా రోహిత్ నుంచి భారీ స్కోరు రావాల్సి ఉంది. మరో ఆరు నెలల వరకు వన్డేలు లేకపోవడంతో అభిమానులు ఈ మ్యాచ్‌లో రో-కో షో చూడాలని భావిస్తున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, విరాట్, శ్రేయాస్, రాహుల్, జడేజా, నితీశ్/బదోని, హర్షిత్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్.

న్యూజిలాండ్: కాన్వే, నికోల్స్, యంగ్, మిచెల్, ఫిలిప్స్, హేయ్, బ్రేస్‌వెల్ (కెప్టెన్), ఫౌక్స్, క్లార్క్, జేమిసన్, లెనాక్స్.

గిల్ వెంట ప్యూరిఫయర్



ఇండోర్‌లో కలుషిత తాగునీటి వల్ల ఇటీవల పలువురు మృత్యువాత పడడంతో భారత క్రికెట్ జట్టు తమ ఆటగాళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా వీరు బస చేసే స్టార్ హోటల్‌తో పాటు స్టేడియంలోనూ పరిశుభ్రమైన నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. మరోవైపు కెప్టెన్ గిల్ మాత్రం ఎందుకైనా మంచిదని.. తన హోటల్ గదిలో ఏకంగా రూ.3 లక్షల ఖరీదు చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను బిగించుకున్నట్టు సమాచారం. దీనికి ప్యాకేజ్డ్ నీటిని కూడా తిరిగి శుద్ధి చేసే సామర్థ్యం ఉండనుంది.

బీసీసీఐ పరిశీలకునిగా రవీంద్ర చౌదరి



విజయవాడ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ పరిశీలకునిగా (అబ్జర్వర్)గా కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) కార్యదర్శి రవీంద్ర చౌదరి నియమితులయ్యారు. ఈ నెల 21న నాగపూర్‌లో జరిగే భారత్, న్యూజిలాండ్ జట్ల తొలి టీ20 మ్యాచ్‌కు రవీంద్ర పరిశీలకునిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా రవీంద్రకు కేడీసీఏ సభ్యులు, క్రికెట్ సంఘాలు, అభినందనలు తెలిపారు.

'చిన్నస్వామి'లో మ్యాచ్‌లకు గ్రీన్‌సిగ్నల్

బెంగళూరు: ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగా స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహించుకునేలా అనుమతి లభించిందని కర్ణాటక క్రికెట్ సంఘం తెలిపింది. నిరుడు ఈ స్టేడియం వద్ద ఆర్‌సీబీ జట్టు విజయోత్సవం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంతో మ్యాచ్‌ల నిర్వహణను ఆపేసిన సంగతి తెలిసిందే.

స్పోర్ట్స్

డబ్ల్యూపీఎల్‌కు నేడు విరామం

యూపీ మళ్లీ..


మెగ్ లానింగ్ (70)

వరుసగా రెండోసారి ముంబైకి షాక్

నవీముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓటమి. మరో జట్టు ఏదైనా అయితే పూర్తిగా డీలా పడేదే! కానీ యూపీ వారియర్స్ వరుస ఓటముల నుంచి అద్భుతంగా కోలుకుంది. ఆపై రెండు వరుస విజయాలతో అదరగొట్టింది. ఆ రెండు మ్యాచ్‌ల్లో కూడా నెగ్గింది డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్‌పై కావడం విశేషం. శనివారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 22 పరుగులతో ముంబైని చిత్తుచేసింది. మొదట యూపీ 20 ఓవర్లలో 187/8 స్కోరు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులతో 70), లిచ్‌ఫీల్డ్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులతో 61) హాఫ్ సెంచరీలతో మెరిశారు. మోస్తరు ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 165/6 స్కోరుకే పరిమితమైంది. అమీలియా కెర్ (28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులతో 41) మాత్రమే రాణించారు. ఈ సీజన్‌లో ముంబైకిది మూడో ఓటమి. లానింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 187/8 (లానింగ్ 70, లిచ్‌ఫీల్డ్ 61, హర్లీన్ డియోల్ 25, ట్రయన్ 21, కెర్ 3/28, బ్రంట్ 2/22).
ముంబై: 20 ఓవర్లలో 165/6 (కెర్ 49 నాటౌట్, అమన్‌జోత్ 41, హర్మన్ 18, శిఖా పాండే 2/30).

మంధాన మెరుపుల్..

61 బంతుల్లో 96

ఢిల్లీపై బెంగళూరు విజయం


స్మృతి మంధాన (96)

నవీ ముంబై: డబ్ల్యూపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అజేయంగా దూసుకెళుతోంది. బౌలర్లు విశేషంగా రాణించిన చోట కెప్టెన్ స్మృతి మంధాన (61 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 96) బ్యాటింగ్‌లో చెలరేగి తృటిలో శతకాన్ని కోల్పోయింది. స్మృతి జోరుతో శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఆర్‌సీబీకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. 10/4 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ షఫాలీ (41 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 62) ఆదుకుంది. చివర్లో హామిల్టన్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 36) వేగంగా ఆడి స్కోరును 150 దాటించింది. పేసర్ లారెన్ బెల్, సయాలికి మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆర్‌సీబీ 18.2 ఓవర్లలో 169/2 స్కోరు చేసి నెగ్గింది. మంధానకు జార్జియా వాల్ (54 నాటౌట్) సహకరించడంతో రెండో వికెట్‌కు 142 పరుగుల భారీ భాగస్వామ్యం సమకూరింది.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 166 ఆలౌట్ (షఫాలీ 62, హామిల్టన్ 36; బెల్ 3/26, సయాలి 3/27).
బెంగళూరు: 18.2 ఓవర్లలో 169/2 (స్మృతి మంధాన 96, వాల్ 54 నాటౌట్; కాప్ 1/21).

కుర్రాళ్ల మరో విజయం

● 18 రన్స్‌తో బంగ్లాదేశ్ ఓటమి
● అండర్-19 వరల్డ్ కప్

ఖులవాయో: అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో యువ భారత్ దూసుకుపోతోంది. వరుసగా రెండో విజయంతో సూపర్ సిక్స్ దశకు దాదాపు అర్హత సాధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో 18 పరుగులతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన) బంగ్లాదేశ్‌ను ఓడించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించగా..తొలుత భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. అభిగ్యాన్ కుందు (80), వైభవ్ సూర్యవంశీ (72) అర్ధ శతకాలతో సత్తా చాటారు. అల్ ఫహద్ 5 వికెట్లు తీశాడు. ఆ తర్వాతా వర్షం కారణంగా మ్యాచ్ ఆగడంతో రెండో ఇన్నింగ్స్‌ను 29 ఓవర్లకు కుదించి బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 165 రన్స్‌గా నిర్దేశించారు. అయితే బంగ్లా 28.3 ఓవర్లలో 146 పరుగులకు కుప్పకూలింది. అజిజుల్ హకీమ్ (51), రిఫత్ బేగ్ (37) మాత్రమే రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విహాన్ మల్హోత్ర 4, ఖిలన్ పటేల్ 2 వికెట్లు సాధించారు.

తొలుత కరచాలనం లేదు: భారత్-బంగ్లాదేశ్ మధ్య దెబ్బతిన్న దౌత్య సంబంధాల ప్రభావం క్రికెట్ మైదానంపైనా పడినట్టు కనిపిస్తోంది. దాంతో మ్యాచ్ సందర్భంగా భారత్ కెప్టెన్ మాత్రే, బంగ్లాదేశ్ వైస్-కెప్టెన్ అబ్రార్ కరచాలనం చేసుకోలేదు. అయితే మ్యాచ్ ముగిశాక రెండుజట్ల ఆటగాళ్లు పరస్పర కరచాలనం చేసుకోవడం విశేషం.

రికార్డు ఊరిస్తోంది..

ఆస్ట్రేలియన్ ఓపెన్ నేటినుంచే
ఉదయం 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

టైటిల్ వేటలో అల్కారజ్, సినర్, జొకోవిచ్
మహిళల ఫేవరెట్లు సబలెంక, స్వియటెక్


అల్కారజ్


సబలెంక

మెల్‌బోర్న్: టెన్నిస్ పండుగ వచ్చేసింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆదివారం మొదలవనుంది. ఎప్పటిలాగే ఈసారి కూడా టాప్‌సీడ్ అల్కారజ్, డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సినర్, సీనియర్ స్టార్ జొకోవిచ్ పురుషుల సింగిల్స్‌లో హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే మిగతా మూడు గ్రాండ్‌స్లామ్స్ ఖాతాలో వేసుకున్న ప్రపంచ నెంబర్‌వన్ అల్కారజ్‌కు ఇక్కడ మాత్రం ట్రోఫీ ఊరిస్తూనే ఉంది. అందుకే ఈసారైనా విజేతగా నిలిచి కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను (నాలుగు మేజర్ ట్రోఫీలు నెగ్గడం) అందుకోవాలన్న లక్ష్యంతో పోటీపడుతున్నాడు. ఒకవేళ తాను గెలిస్తే, కెరీర్ గ్రాండ్‌స్లామ్ సాధించిన పిన్న వయసు ఆటగాడిగా 22 ఏళ్ల అల్కారజ్ చరిత్ర సృష్టిస్తాడు. మరోవైపు వరుసగా గత రెండేళ్లు ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన రెండోసీడ్ సినర్.. మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టాలన్న పట్టుదలతో ఉన్నాడు. ఇక, రెండేళ్లుగా మేజర్ ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్న 38 ఏళ్ల జొకోవిచ్.. ఇప్పుడైనా 24వ గ్రాండ్‌స్లామ్‌ను గెలిచి అరుదైన రికార్డు అందుకోవాలని ఆరాటపడుతున్నాడు. ఇక.. పై ముగ్గురికి పోటీ ఇవ్వాలని జ్వెరెవ్, రూడ్, అలెక్స్ డిమినార్, ముసెట్టిలాంటి టాప్ ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో పోటీ రసవత్తరంగా ఉండబోతోంది. డిఫెండింగ్ చాంప్‌గా మాడిసన్ కీస్ బరిలోకి దిగుతున్నా, ఫామ్ లేమి ఆమెను కలవరపెడుతోంది. ప్రస్తుతం సూపర్‌ఫామ్‌లో ఉన్న సబలెంక మూడోసారి విజేతగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండోసీడ్ స్వియటెక్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసింది. కొకొ గాఫ్, పొలిని, ఆండ్రీవా, పెగులా, రిబకినా, స్విటోలినాకు తోడు వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ టైటిల్ వేటలో ఉన్నారు.

ఫైనల్లో అన్, జొనాథన్

ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ డిఫెండింగ్ చాంపియన్ అన్ సే యంగ్ (దక్షిణ కొరియా) ఫైనల్‌కు దూసుకొచ్చింది. సెమీఫైనల్లో టాప్‌సీడ్ అన్ 21-11, 21-7తో రచానోక్ (థాయ్‌లాండ్)ను ఓడించింది. మరో సెమీస్‌లో చైనా స్టార్ వాంగ్ జియి 21-15, 23-21తో తన దేశానికే చెందిన చెన్ యుఫీపై నెగ్గి అన్ సే యంగ్‌తో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో జొనాథన్ క్రిస్టీ (ఇండొనేసియా), లిన్ చున్ యి (చైనీస్ తైపీ) తుదిపోరులో నిలిచారు. సెమీస్‌లో జొనాథన్ 21-18, 22-20తో లో కీన్ యే (సింగపూర్)పై, లిన్ చున్ 21-9, 6-21, 22-20తో విక్టర్ లాయ్ (కెనడా)పై గెలిచారు.

సాయిరెడ్డికి ఈడీ సమన్లు

(మొదటి పేజీ తరువాయి)



లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మద్యం సరఫరాదారులకు చేసిన చెల్లింపుల నుంచి వైసీపీ లిక్కర్ మాఫియా పలు మార్గాల్లో కమీషన్ వసూలు చేసింది. ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెట్టుబడులు, ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు వైసీపీ అభ్యర్థులకు ఎలక్షన్ ఫండ్, విదేశాలకు మనీ లాండరింగ్, దుస్తులు-బంగారం కొనుగోలు పేరుతో నకిలీ బిల్లులు సృష్టించడం లాంటి బాగోతాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెలికి తీసింది. ఈ వివరాలు తీసుకున్న ఈడీ అందులో వాస్తవాలను నిర్ధారించుకుని, మనీలాండరింగ్ బాగోతాన్ని వెలికి తీస్తోంది. దశల వారీ మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్ పాలనలో లిక్కర్ పాలసీ మొదలుకొని సరఫరా ఆర్డర్లలో అవకతవకలు, నకిలీ డిస్టిలరీల ఏర్పాటు, తప్పుడు లావాదేవీలతో బిల్లులు పొందడం, సరఫరాదారులను ముడుపుల కోసం బెదిరించడం...ఇలా రూ.మూడున్నర వేల కోట్ల దోపిడీలో ప్రతి విషయం తెలిసిన విజయసాయి రెడ్డి, విజిల్ బ్లోయర్‌గా ఉంటానని గత ఏడాది ప్రకటించారు. 2019-24లో మద్యం వ్యాపారుల నుంచి వసూలు చేసిన కమీషన్ అక్రమ మార్గంలో విదేశాలకు మళ్లించారనే ఆరోపణలపై ఈడీ విచారణ జరుపుతోంది. మద్యం దుకాణాల్లో కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు నిర్వహించడం, డిజిటల్ పే మెంట్లు అనుమతించకపోవడం వెనకున్న గుట్టును వెలికి తీసే ప్రయత్నం చేస్తోంది. లిక్కర్ సరఫరాతోపాటు డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియలో కొన్ని కంపెనీలకు మాత్రమే అనుచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలపై సిట్ సేకరించిన ఆధారాల మేరకు ఈడీ పలువురిని ప్రశ్నించింది. అందులో ప్రధానంగా 16 కంపెనీలు, వ్యాపారుల పాత్రపై కీలక ఆధారాలు ఇప్పటికే సేకరించింది. జగన్ హయాంలో ఏపీఎస్‌బీసీఎల్ కొనుగోలు చేసిన 23 వేల కోట్ల రూపాయల మద్యంలో కమీషన్లు చెల్లించిన ఆ పదహారు సంస్థలకే భారీగా ఆర్డర్లు ఇచ్చినట్లు నిర్ధారణకు వచ్చింది. కుంభకోణంలో జగన్ మాజీ సలహాదారు (ఐటీ) రాజ్ కసిరెడ్డి (ఏ1) పాత్రే అత్యంత కీలకమంటూ గత ఏడాది ఏప్రిల్ 18న విజయవాడ సిట్ కార్యాలయానికి వచ్చిన విజయ సాయి రెడ్డి అధికారులకు వివరించారు. మద్యం ముడుపుల సొమ్ము సేకరించిన రాజ్ కసిరెడ్డి, బంధువు ముప్పిడి అవినాశ్ రెడ్డి, మరికొందరితో కలిసి హవాలా మార్గాల్లో విదేశాలకు తరలించినట్లు నాడు సాయిరెడ్డి తెలిపారు.

16 మంది అరెస్ట్.. 50 మంది నిందితులు..

దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్‌లో 16 మందిని సిట్ అరెస్ట్ చేసింది. రాజ్ కసిరెడ్డితో పాటు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, ముంబైకి చెందిన హవాలా వ్యాపారి అనిల్ చోక్రా తదితరులను సిట్ అరెస్టు చేసింది. వీరిలో కొందరు బెయిల్‌పై విడుదలవ్వగా, మరికొందరు జైల్లోనే ఉన్నారు. అయితే ఈ కేసులో వ్యాపారులు, సంస్థలు కలిపి మొత్తం 50మందికి పైగా నిందితుల్ని చేరుస్తూ సిట్ అధికారులు కోర్టుకు వివరాలు సమర్పించారు.

మూడు చార్జిషీట్లు దాఖలు..

గత ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటైన సిట్ అధునాతన టెక్నాలజీ వినియోగించి అత్యంత వేగంగా కేసు దర్యాప్తు చేపట్టింది. ఎప్పటికప్పుడు ఊహించని వ్యక్తుల పాత్రపై ఆధారాలు సేకరించి వివిధ రాష్ట్రాల్లో దాక్కున్న వారిని లాక్కొచ్చి జైల్లోకి తోసింది. గత ఏడాది జూలై 19న మొదటి చార్జిషీట్ 305 పేజీలతో దాఖలు చేసింది. అందులో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ప్రస్తావించింది. ఆగస్టు 12న సుమారు 200 పేజీలతో మరో అనుబంధ చార్జిషీట్‌ను, సెప్టెంబరులో మూడో చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది.

'హద్దులు' దాటిన తమిళ జాలర్లు!

- పులికాట్ సరస్సులో దుందుడుకు చర్యలు
- 3 కి.మీ మేర ఏపీ పరిధిలోకి చొరబాటు
- ప్రశ్నించిన రాష్ట్ర మత్స్యకారులపై దాడులు



ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం సమర్పిస్తున్న మత్స్యకార నాయకులు

తడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సులో తమిళనాడు మత్స్యకారులు దుందుడుకు చర్యలకు దిగుతున్నారు. సరిహద్దుల విషయంలో దశాబ్దాల నాటి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారు. తాజాగా కొత్త సరిహద్దులు నిర్ణయిస్తూ సరస్సులో తాటిమొద్దులు నాటారు. ఆ సమీపానికి వెళ్లిన ఏపీ మత్స్యకారులపై దాడులకు తెగబడ్డారు. నాలుగైదు రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతుండడంతో.. రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు శనివారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కలుసుకొని, తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని, సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని కోరారు. లేకుంటే తీవ్ర ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉందని మత్స్యకార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. 600 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తరించిన పులికాట్ ఉప్పునీటి సరస్సులో 84 శాతం ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే ఉంది. చేపల వేట సమయంలో రెండు రాష్ట్రాల జాలర్ల మధ్య సరిహద్దుల విషయంలో తరచూ వివాదాలు జరుగుతుంటాయి. దీనికి పరిష్కారంగా 40 ఏళ్ల కిందట పెద్ద మనుషుల ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం పులికాట్‌లో సరిహద్దులను నిర్ణయిస్తూ తాటి మొద్దులను నాటారు. రెండు రాష్ట్రాల జాలర్లూ హద్దులు దాటి చేపల వేట చేయరాదని నిర్ణయించారు. అయితే ఇందుకు విరుద్ధంగా తమిళనాడు జాలర్లు నాలుగు రోజుల కిందట ఈ సరిహద్దులు దాటి ఏపీ పరిధిలో మూడు కిలోమీటర్లు ముందుకు వచ్చారు. కొత్త సరిహద్దులు నిర్ణయిస్తూ తాటి మొద్దులు నాటారు. తమిళనాడుకు చెందిన చిన్నమాంగోడు, పెదమాంగోడు, పుదుకుప్పం మత్స్యకారులు ఈ చర్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. దీనిని ప్రశ్నించిన ఏపీ మత్స్యకారుల మీద వారు దాడులకు దిగారు. దీంతో బాధితులు ఈ విషయాన్ని పులికాట్ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు తమిళనాడు మత్స్యకారుల సంఘంతో చర్చించినా ఫలితం లేకపోవడంతో ఎమ్మెల్యే విజయశ్రీని కలిసి సమస్యను వివరించారు. ఈ విషయాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్, తమిళనాడులోని తిరువళ్లూరు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి.. శాంతియుతంగా ఆ తాటి మొద్దులను తొలగించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం మత్స్యకారులు బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, పులికాట్ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్డీవో, నాయుడుపేట డీఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించారు.

బఠానీలు సహా పప్పులపై భారత్ అధిక సుంకాలు

- సుంకాల తగ్గింపునకు చర్యలు తీసుకోండి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇద్దరు సెనెటర్ల లేఖ

న్యూయార్క్/వాషింగ్టన్, జనవరి 17: భారత్‌లో భవిష్యత్తులో వాణిజ్య ఒప్పందం జరిగితే పప్పు ధాన్యాలపై సుంకాలు తగ్గించేందుకు కృషి చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సెనెటర్లు స్టీవ్ డైనీస్ (మొంతానా), కెవిన్ క్రామర్ (నార్త్ డకోటా) విజ్ఞప్తి చేశారు. భారత్ విధించే అనుచిత సుంకాలతో అమెరికాలోని మొంతానా, నార్త్ డకోటా రాష్ట్రాల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. బఠానీలు సహా ప్రపంచ దేశాల్లో భారత్ సుమారు 27% పప్పు ధాన్యాలను వినియోగిస్తుందని ట్రంప్‌కు రాసిన లేఖలో తెలిపారు. శనగలు, కందిపప్పు, ఎండబెట్టిన చిక్కుళ్లు భారతీయులు ఎక్కువగా వాడుతున్నారు. పచ్చి బఠానీల దిగుమతిపై గతేడాది అక్టోబరు 30న భారత్ 30% సుంకాలు విధించిందని, గతేడాది నవంబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయని స్టీవ్ డైనీస్, కెవిన్ క్రామర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల నాణ్యమైన పప్పులను అమెరికా రైతులు అధిక ధరలకు భారత్‌కు ఎగుమతి చేయాల్సి వస్తోందన్నారు. భారత్ ప్రధానితో జరిగే చర్చల్లో పప్పుల దిగుమతి సుంకాల విషయమై రెండు దేశాలకు పరస్పర ఆర్థిక సహకారం పెంపుదలతోపాటు పరస్పర ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్‌ను కోరారు.

ముంచిన బరి

జూదంతో జనం జేబులకు గండి.. అప్పులు చేసి మరీ కోడి పందేలు



- చివరికి నెత్తిన చేతులతో లబోదిబో
- చిన్న బరుల నిర్వాహకులకు పెద్ద నష్టం
- ముడుపుల డబ్బూ తిరిగి రాలేదు
- పెద్ద బరులకు కోట్లలో లాభాలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతికి రా..రమ్మంటూ పిలిచిన బరులకు అప్పులు చేసిన డబ్బుతో పందెం రాయుళ్లు గొప్పగా వెళ్లారు. మూడు రోజుల్లో డబ్బంతా పోగొట్టుకుని నెత్తిన చేతులతో ఇప్పుడు లబోదిబో మంటున్నారు. ఇలాంటి వారు కోస్తా జిల్లాల్లో ఊరూరా కనబడుతున్నారు. వేలల్లో పోగొట్టుకున్న వాళ్లు కొందరైతే.. లక్షల్లో జేబులకు చిల్లులు పెట్టుకున్న వారు మరికొందరు. పందేలు కాసి డబ్బు పోగొట్టుకున్న వాళ్లు కొందరైతే.. బరులు ఏర్పాటు చేసి నష్టపోయినవారు మరికొందరు. ఈసారి పెద్దబరులకు లాభాలొచ్చినా.. చిన్న బరులు ఏర్పాటు చేసిన వారు మాత్రం అధికారులకు ఇచ్చిన ముడుపుల సొమ్ము కూడా రాబట్టుకోలేకపోయారు. పెద్ద బరుల నిర్వాహకులు ఈసారి హంగామా చేయకుండా, ఖర్చు తగ్గించుకొని రూ. కోట్లలో లాభాలు పొందారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 100 వరకు బరులు లాభాల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. 30 శాతం బరులకు మాత్రం పూర్తిగా నష్టం వచ్చింది. తొలిరోజే దుకాణం సర్దేసిన బరులు కూడా ఉన్నాయి. చిన్న బరులవైపు జనం మొగ్గు చూపలేదు. బడాయికి కోడి పందేల బరి వేస్తే ఉన్నదంతా ఊడ్చికెళ్లినట్లుందని సన్నిహితుల దగ్గర కొందరు వాపోతున్నారు. ప్రతి గ్రామంలో బరులు ఏర్పాటు చేయడంతో జనం చిన్న వాటిపై ఆసక్తి చూపలేదు. అయితే తెలంగాణ, కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల వచ్చిన వారు పెద్ద బరులకే క్యూ కట్టారు. మహిళల సంఖ్య ఈసారి అమాంతం పెరిగింది. భీమవరం ప్రాంతంలో మహిళలను సెక్యూరిటీగా పెట్టడంతో అలాంటి బరులకు వారు వెళ్లి పందేల కాశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి సరైన వసతులు అందుబాటులో లేకపోవడంతో రాత్రిపూట కార్లలోనే, తామొచ్చిన ట్రావెల్స్ బస్సుల్లోనో నిద్రించారు. ఇక తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చిన వారు కుక్కుట శాస్త్రం ఆధారంగా పందేలు వేసి లాభాలు పట్టారు. చాలా బరుల్లో రూ. 2 లక్షలకు పైగా కోడి పందేల్లో గెలిచారు. వారితో పందేలకు దిగిన స్థానికులు సొమ్ములు కోల్పోయారు. పందేలు గెలిచిన వారు ఆనందంతో మందు కొట్టి చిందులేశారు. ఓడిపోయిన వారు బాధతో మరింత మద్యం తాగేశారు. సంక్రాంతి జూద క్రీడలు కొందరిలో జోష్ నింపాయి. ఎక్కువ మందికి అప్పులు మిగిలాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈసారి పందేలు జరిగిన తీరు చూస్తే..

- తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామానికి చెందిన ఓ యువకుడు సంక్రాంతి పండుగకు రూ. 20 వేలతో కోడి పందేలకు వెళ్లి.. తొలిరోజే రూ.10 వేలు పోగొట్టుకున్నాడు. గుండాటలో మొదట రూ. 5 వేలు రావడంతో ఆరోజంతా అదే బాగుందని ఆడాడు. చివరకు మొత్తం సొమ్ము పోగొట్టుకున్నాడు. తర్వాత ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి కనుమ రోజున రూ. 20 వేలు తీసుకుని వెళ్లి మళ్లీ ఆడాడు. అది కూడా పోగొట్టుకున్నాడు. సంక్రాంతి పేరు చెప్పి మొత్తం రూ. 40 వేలు జూదానికి సమర్పించాడు.
- పెంటపాడు మండలంలోని ఓ గ్రామంలో నలుగురు వ్యక్తులు రూ. 5 లక్షలు అప్పు తెచ్చి బరి ఏర్పాటు చేశారు. సామగ్రికి, పోలీసులు, నేతలు, అధికారుల ముడుపులకు రూ. 3.50 లక్షలు ఖర్చు చేశారు. మూడు రోజుల నిర్వహణకు మిగిలిన 1.50 లక్షల ఖర్చయ్యింది. గుండాట, పకోడి దుకాణాల ద్వారా రూ. 1.20 లక్షలు వచ్చింది. మూడు రోజులకు పందేల ద్వారా రూ. 60 వేలు వచ్చింది. మొత్తానికి రూ. 3.20 లక్షల నష్టం మిగిలింది. వీరవాసరంలో తమ బరికి రూ. 5 లక్షలు నష్టం వచ్చిందంటూ నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఆకివీడు రూరల్ మండలంలోని ఓ గ్రామంలోనూ బరి నిర్వాహకులది అదే పరిస్థితి.
- భీమవరంలో ఓ ప్రముఖ వ్యాపారి రూ. 20 లక్షలతో కోడి పందేలు ఆడారు. మొత్తం సొమ్ము పోవడంతో మాయదారి పందేలు అంటూ స్నేహితుల వద్ద ఆడిపోసుకుంటున్నారు.
- తణుకు రూరల్ మండలంలో ఓ గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు తన సమీప గ్రామంలో ఏర్పాటు చేసిన బరిలో కోడి పందేలు బాగానే జరిగినా గుండాట, పేకాట, కోతాటలకు జనం పెద్దగా రాకపోవడంతో వీటిని ఏక మొత్తంలో తీసుకున్న వ్యక్తి తీవ్రంగా నష్టపోయాడు.
- తెలంగాణ ప్రాంతానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువతి భీమవరంలో కోడి పందెంలో పాల్గొని రూ. 20 వేలు నెగ్గారు. కుక్కుట శాస్త్రాన్ని నమ్ముకుని ఆ యువతి కాకి పుంజుపై పందెం కాసింది. ఇదే పందెంలో భీమవరానికి చెందిన ఓ యువకుడు తేతువపై పందెం కాసి ఓడిపోయి ఆ యువతికి డబ్బు చెల్లించాడు.
- కొత్తగా ఏర్పాటు చేసిన బరుల కంటే పాత బరులకే ప్రజల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఉండి నియోజకవర్గంలో సీసలి, పెద అమిరం, ఆకివీడు బరులకు కాసుల వర్షం కురిసింది. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకులో వేల్పూరు, తేతలి, పూలపల్లి, కలగంపూడి, యలమంచిలి బరులకు జనం క్యూ కట్టారు. ప్రతి మండలంలోనూ కనిష్ఠంగా 10 బరులకు వేశారు. అంటే జిల్లాలో 200కు మించి బరులు వెలిశాయి.

నేరాల మధ్య.. బాల భారతం

- దేశంలో పిల్లలపై పెరిగిపోతున్న నేరాలు
- రెండు దశాబ్దాల్లో 12 రెట్లు అధికం
- రోజుకు సగటున 500 కేసులు నమోదు
- కొవిడ్ అనంతరం ఏకంగా 40% ఎక్కువ
- ఆరు రాష్ట్రాల్లోనే సగానికిపైగా నేరాలు
- కేసుల విచారణలోనూ తీవ్ర జాప్యం
- తాజా నివేదికలో ఎన్‌సీఆర్‌బీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో బాలలపై పెరుగుతున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు దశాబ్దాల కాలంలో బాలలపై నేరాలు ఏకంగా 12 రెట్లు పెరిగాయి. రోజుకు సగటున 40 కేసుల నుంచి ఇప్పుడు సుమారు 500 కేసులకు ఆ నేరాలు చేరుకున్నాయి. ఈ కేసుల్లో ఎక్కువ కేసులు కేవలం ఆరు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. 2004 నుంచి 2023 వరకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా డేటా ప్రకారం బాలలపై నేరాలు భారీగా పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. 2004లో 14,423 కేసులు నమోదైతే 2023లో 1.77 లక్షలు కేసులు నమోదవ్వడం ఆందోళనకు కారణమవుతోంది. కొవిడ్ అనంతర కాలంలో అయితే బాలల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. 2020 నుంచి 2023 మధ్య కేసులు ఏకంగా 40 శాతం పెరిగాయి. ఆ కాలంలో రోజుకు సగటున 135 కేసుల వరకు అదనంగా నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. నిజానికి 2001 నుంచి మాత్రమే ఎన్‌సీఆర్‌బీ బాలలపై కేసులను ప్రత్యేకంగా లెక్కిస్తోంది. కేసుల సంఖ్య 2007లో 20 వేల మార్కును, 2013లో 50 వేల మార్కును దాటాయి. ఇక అక్కడి నుంచి పెరుగుతూ 2016లో లక్ష మార్కును, 2022లో 1.5 లక్షల మార్కును అధిగమించాయి.

ఎన్‌సీఆర్‌బీ విశ్లేషణ ఇలా..

- 2014-23 మధ్య కేసులను చూస్తే, కేవలం ఆరు రాష్ట్రాల్లోనే సగానికి పైగా కేసులు నమోదైనట్లు స్పష్టమవుతోంది. ఆ రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, అస్సాం, బిహార్ ఉన్నాయి.
- 2014-23 మధ్య కాలంలో 1.77 లక్షల కేసులతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో, 1.66 లక్షల కేసులతో మహారాష్ట్ర తర్వాత స్థానంలో ఉన్నాయి. 2023లో కూడా 22,393 కేసులతో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలోనే ఉంది. 22,390 కేసులతో మహారాష్ట్ర మొదటి స్థానానికి చేరువైంది.
- అస్సాం, బిహార్‌లలో పరిస్థితులు ప్రమాద హెచ్చరికలు మోగిస్తున్నాయి. దశాబ్ద కాలంలో అస్సాంలో కేసులు ఏకంగా ఏడు రెట్లు పెరిగాయి. 2014లో ఆ రాష్ట్రంలో కేవలం 1,385 కేసులు మాత్రమే నమోదవ్వగా, 2023లో ఆ సంఖ్య 10,174కు పెరిగింది. ఈ దబాబ్ద కాలంలో అస్సాంలో బాలలపై నేరాల కేసులు 49,352గా ఉన్నాయి.
- బిహార్‌లో అయితే కేసులు ఐదు రెట్లు పెరిగాయి. 2014లో 2,255గా ఉన్న కేసులు 2023లో 9,906గా నమోదయ్యాయి. ఇక ఈ దశాబ్ద కాలంలో బిహార్‌లో బాలలపై నేరాలకు సంబంధించి 61,663 కేసులు నమోదయ్యాయి.
- దశాబ్ద కాలంలో ఒడిశాలో నాలుగు రెట్లు, తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్రల్లో మూడు రెట్లు చొప్పున కేసులు పెరిగాయి.

పెండింగ్‌లో కేసులు

బాలలపై కేసులు పెరగడం ఓ ఎత్తయితే, వాటి విచారణలో తీవ్ర జాప్యం జరగడం మరో ఎత్తులా మారింది. సమయానికి న్యాయం అందక వేలాది మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. బాలలపై నేరాలకు సంబంధించి 2018-23 మధ్య పెండింగ్ కేసుల విచారణ ఏకంగా రెండు రెట్లకు పెరిగినట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 2018 చివరి నాటికి విచారణ కోసం పెండింగ్‌లో ఉన్న కేసులు 3.06 లక్షలు ఉంటే, 2023 నాటికి దేశ వ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో 6.54 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 నాటికి పెండింగ్ రేటు 90 శాతంగా ఉంది. ఆ ఏడాదిలో 16,365 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. అలాగే మొత్తం 2.57 లక్షల కేసులు దర్యాప్తు స్థాయిలోనే ఉన్నాయి. 1.12 లక్షల కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయి. పెద్దమొత్తంలో కేసులు పెండింగ్‌లో ఉండిపోవడం, అతి తక్కువ కేసుల్లో శిక్షలు పడటం కూడా బాలలపై నేరాల కేసుల పరిష్కారంలో సవాల్‌గా నిలుస్తోంది.



రాజధాని అమరావతిలో చెత్త సేకరణకు బ్యాటరీ వాహనాలను సిద్ధం చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డుపై ఆ వాహనాలను నడపడంలో శిక్షణ తీసుకుంటున్న పారిశుధ్య కార్మికులు



అమరావతిలో నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసం వరకూ దాదాపుగా పూర్తయిన రోడ్డును ఈ చిత్రంలో చూడొచ్చు



రాజధాని అమరావతిలో హైకోర్టు కాంప్లెక్సు నిర్మాణం జరిగే ప్రాంతం ఇది. పగలూ, రాత్రి తేడా లేకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి

అల్‌ఫలాహ్ డాక్టర్లకు ఉగ్రవాదంతో సంబంధం

- చార్జిషీటులో ఈడీ ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 17: ఉగ్రవాదంతో సంబంధం ఉన్న ముగ్గురు వైద్యులను ఫరిదాబాద్‌లోని అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకులుగా నియమించినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేర్కొంది. పోలీసులు ద్వారా ఎలాంటి తనిఖీలు నిర్వహించకుండానే వీరిని నియమించినట్టు తెలిపింది. ఇందులో ఇద్దర్ని గతంలో ఎన్ఐఏ అరెస్టు చేయగా, మరొకరికి ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్లతో సంబంధం ఉందని వివరించింది. మనీ లాండరింగ్ కేసులో ఆ విశ్వవిద్యాలయం చైర్మన్ జవాద్ అహ్మద్ సిద్దికీని అరెస్టు చేసి, ఆ సంస్థకు చెందిన రూ.140 కోట్ల విలువ చేసే భూమిని స్వాధీనం చేసుకోవడంపై ఈడీ చార్జిషీటు దాఖలు చేసింది. దాంట్లోనే ఈ డాక్టర్ల నేర చరిత్రను ప్రస్తావించింది.

రాజ్యసభలో 19 పెండింగ్ బిల్లులు

- అందులో 1992 నాటి జనాభా నియంత్రణ బిల్లు కూడా..

న్యూఢిల్లీ, జనవరి 17: ఎగువ సభ అయిన రాజ్యసభలో 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1992 నాటి జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. రాజ్యసభ శాశ్వత సభ కావడంతో ఇది ఎప్పటికీ రద్దు కాదు. దీనిలోని సభ్యులు మూడింట ఒకవంతు మంది ప్రతి రెండేళ్లకోసారి పదవీ విరమణ చేస్తారు. లోక్‌సభలో పెండింగ్ బిల్లులు సభ రద్దయినప్పుడే రద్దవుతాయి. రాజ్యసభలో మాత్రం అలా కాదు.. ప్రస్తుతం ఆ సభలో పెండింగ్‌లో ఉన్న 19 బిల్లుల్లో పాతది రాజ్యాంగ (79వ సవరణ) బిల్లు-1992. ఇందులో జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాల్ని రాష్ట్రాలు ప్రోత్సహించాలంటూ ఆదేశిక సూత్రాలను సవరించాలని ప్రతిపాదించారు. అలాగే ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపీ లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల్లో విత్తనాల బిల్లు-2004తో పాటు మరికొన్ని బిల్లులున్నాయి.



ఈ నెల 26న గణతంత్ర దిన వేడుకలను రాజధానిలో నిర్వహించనున్నారు. దీనికోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఓపక్క భద్రతా బలగాలు రిహార్సల్స్ చేస్తుండగా, మరోపక్క మైదానాన్ని చదును చేసే పనులు జరుగుతున్నాయి. శకటాలూ సిద్ధమవుతున్నాయి.

తరాలు మారుతున్నా తరగని తెలుగు వెలుగు

నందమూరి తారక రామారావు.. ఎన్టీఆర్, ఎన్టీవోడు, అన్నగారు.. ఆయన పరమపదించి మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ (జనవరి 18, 1996) తెలుగు ప్రజల హృదయాల్లో ఇప్పటికీ మారుమోగుతున్న పేరు.



తరతరాల తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ అంటేనే సినిమా అన్న భావన ఏర్పడింది. ముఖ్యంగా పౌరాణిక చిత్రాల్లో ఆయన చేసిన అమర పాత్రలు వెండితెరను దాటి సామూహిక సాంస్కృతిక చైతన్యంలో భాగమయ్యాయి.

● 1950 నుండి 1992 వరకు తెలుగు సినిమాకు తిరుగులేని నంబర్‌వన్ హీరోగా నిలిచిన అన్నగారు, సాంఘిక, సామాజిక చిత్రాల్లో సాధ్యమైన ప్రతి పాత్రను పోషించడమే కాకుండా పురాణాలు, చారిత్రకాలు, జానపద కథలలోని పూజనీయమైన, గౌరవనీయమైన మహానుభావులను తను ధరించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా నిలిపారు. ఇంత విస్తృతమైన పాత్రల పరిధి, గౌరవం, దీర్ఘకాల ప్రభావం ప్రపంచంలోనే కొద్దిమంది నటులకే సాధ్యమైంది. భారతదేశంలో అయితే ఎన్టీఆర్‌కు సాధ్యమైనట్లుగా మరెవరికీ సాధ్యం కాలేదు.

● 1960లో కలియుగ దైవంగా పూజలు అందుకొనే శ్రీ వేంకటేశ్వర స్వామిగా ఆయన చేసిన పాత్ర ప్రజల మనసుల్లో ఆయన్ని దాదాపు దైవ సమాన స్థాయికి తీసుకెళ్లింది. అప్పట్లో తిరుమల దర్శనానికి వచ్చే భక్తులు మద్రాసులోని బజుల్లా రోడ్ ఉన్న ఎన్టీఆర్ నివాసాన్ని కూడా దర్శించుకోవడం ఆనవాయితీగా మారిందన్నది ఇప్పుడు ఒక ప్రసిద్ధ గాథ.

● ఎన్టీఆర్ సినిమా ప్రభావం అంత గొప్పగా ఉండడంతో అప్పటి కంచి పీఠాధిపతి ఆయనకు 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ' అనే బిరుదును ప్రసాదించారు. ఆ రోజుల్లో తెలుగు సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు లేకపోయినా, ఆ బిరుదు భవిష్యదృష్టిగా నిలిచింది. సినిమాల నుంచి ఎన్టీఆర్ నిష్క్రమించిన దశాబ్దాల తరువాత కూడా ఆయన ధరించిన అనేక పాత్రలు కాలాన్ని, మార్పులను అధిగమిస్తూ ప్రేక్షకుల హృదయాల్లో మారుమోగుతూనే ఉన్నాయి.

● ఎన్టీఆర్ కాలంలో తెలుగు సినిమాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు పరిమితంగానే ఉన్నప్పటికీ తెలుగు భాష, గర్వం, ఆత్మగౌరవాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది మాత్రం ఆయన చేసిన నిరంతర సాంస్కృతిక, ఆత్మవిశ్వాస ప్రదర్శనే! దక్షిణ భారతీయులను అవమానంగా పిలిచే 'మద్రాసీ' అనే పదాన్ని ఎన్టీఆర్ కూల్చివేసి, తెలుగు వారికి ప్రత్యేకమైన సాంస్కృతిక, రాజకీయ స్వరూపాన్ని అందించారు. అందుకే విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలంతా ఖండ ఖండాంతరాలలోని దేశవిదేశాల్లో ఆయన శత జయంతి వేడుకలు జరిపి విశ్వవిఖ్యాతి గాంచిన ఆయన విరాట్ స్వరూపానికి ఘనమైన నివాళులు అర్పించారు.

● సినిమా లేదా రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ సాధించిన ఘనతకు సాటి లేదు. అరవై ఏళ్ల వయసులో, చాలా మంది నటులు కేవలం గౌరవ ప్రదమైన ఉనికికే పరిమితమయ్యే సమయంలో, ఆయన తన మహోన్నత సినీ జీవితానికి వీడ్కోలు పలికి, ఇంతకాలం తనను ఆదరించిన తెలుగు ప్రజలకు సేవ చేయడం కోసమంటూ తెలుగుదేశం (టీడీపీ) పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. కేవలం తొమ్మిది నెలల అతి స్వల్ప కాలంలోనే, దశాబ్దాలుగా అడ్డంకి లేని పాలన సాగించిన కాంగ్రెస్‌ను ఓడించి, జనవరి 1983లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సారథిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా చరిత్ర సృష్టించి ప్రపంచ రికార్డ్ సాధించారు. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనూ, ఏ సినీ పరిశ్రమలోనూ ఇలాంటి ఘనత మరెవరికీ సాధ్యపడలేదు. ఇంతటి ఘనతను సరిగా అంచనా వేయలేక అడ్డదారిలో సాధించాలని ప్రయత్నించి వారు సైతం తీవ్ర భంగపాటుకు గురైన ఉదంతాలు కూడా మనమంతా చూసినవే.

● తెరపై ఎన్టీఆర్ పోషించిన పాత్రలు ఎంత విప్లవాత్మకమో, రాజకీయ ప్రచారంలోనూ అంతే సంచలనం సృష్టించారు. ప్రజలు నాయకుల వద్దకు రావాలి అన్న సంప్రదాయాన్ని తలకిందులు చేసి, నాయకత్వాన్ని ప్రజల వద్దకే తీసుకెళ్లారు. 1953 మోడల్ చెవ్రోలెట్ వాహనానికి 'చైతన్య రథం'గా పేరు పెట్టి ఆంధ్రప్రదేశ్ నలుమూలల తిరిగిన ఎన్టీఆర్ ప్రజా సంపర్క యాత్ర భారత ఎన్నికల చరిత్రలో మైలురాయిగా నిలిచింది. భారీ కటౌట్లు, రికార్డ్ చేసిన ప్రచార గీతాలు, దృశ్యపరంగా ప్రభావవంతమైన పోస్టర్లు... ఇవన్నీ నేడు సాధారణమైనా, వాటికి బాట వేసింది ఎన్టీఆరే!

● 1983 విజయం యాదృచ్ఛికం కాదని నిరూపిస్తూ 1994 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ 30 లోక్‌సభ స్థానాలు గెలుచుకుని, పార్లమెంట్‌లో రెండో అతి పెద్ద పార్టీగా, ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశమంతా కాంగ్రెస్ అలజడి నడిచినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎన్టీఆర్ ప్రభావం నిలిచింది. తర్వాత లెఫ్ట్ పార్టీలను, రైట్ పార్టీలను, ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి 1989లో నేషనల్ ఫ్రెంట్ ప్రభుత్వానికి దారితీసినది ఎన్టీఆర్ రాజకీయ సంకల్పమే.

(ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా)

- కొమ్మినేని వెంకటేశ్వరరావు

హృదయాలను కదిలించే కథ



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ రూపొందించిన తాజా చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. 'ధురంధర్' చిత్రంతో కథానాయికగా ఆకట్టుకున్న సారా అర్జున్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించారు. భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, అడ్డాల పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం ట్రైలర్‌ని విడుదల చేసింది. ప్రస్తుత సమాజంలోని వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా, డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేసుకుంటున్నారనే అంశాలను ఈ చిత్రంలో చర్చించనున్నట్లు ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ఈ చిత్ర కథ ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తుంది. 'ఒక్కడు' సినిమాతో భూమికకు వచ్చిన దానికంటే రెట్టింపు పేరు ఈ చిత్రంతో వస్తుంది' అని చెప్పారు. భూమిక చావ్లా మాట్లాడుతూ '23 ఏళ్ల తరవాత గుణశేఖర్ గారితో కలసి పనిచేయడం సంతోషంగా ఉంది. 'యుఫోరియా' నా సినీ రంగ ప్రయాణంలో ప్రత్యేక చిత్రం' అని అన్నారు.

నవ్వుల్లో ముంచెత్తుతోంది

- రవితేజ



'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతున్నాయి' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రమిది. ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. దర్శకుడు కిశోర్ తిరుమల మాట్లాడుతూ 'థియేటర్‌లో ప్రేక్షకుల స్పందనను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'సంక్రాంతికి అద్భుతమైన విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. అన్ని ప్రాంతాల నుంచీ మంచి స్పందన లభిస్తోంది' అని చెప్పారు. కథానాయిక డింపుల్ హయతి మాట్లాడుతూ 'ఈ చిత్రంలోని బాలామణి క్యారెక్టర్ నాకు చాలా ప్రత్యేకం. అందరూ ఈ పాత్రతో మమేకం అవుతున్నారు. కిశోర్ గారు అంత అద్భుతంగా ఈ పాత్రని మలిచారు' అని అన్నారు.

బావా మరదళ్ల సందడి



ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కొత్త మలుపు'. భైరవి అర్ధ్యా కథానాయిక. శివ వరప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కథాంశానికి కడుపుబ్బా నవ్వించే హాస్యాన్ని జోడించి రూపొందిస్తున్నాం. ఆకాశ్, భైరవి జంట బావా మరదళ్లుగా అలరిస్తారు' అని చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. సంగీతం: యశ్వంత్.

అలరించే హంగులతో



సీనియర్ నటుడు సురేశ్, శ్రీరామ్ కీలకపాత్రలు పోషిస్తున్న చిత్రం 'మిరాకిల్'. రణధీర్ భీసు, హెబ్బాపటేల్ జంటగా నటిస్తున్నారు. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో రమేశ్ ఎగ్గిడి, శ్రీకాంత్, చందర్‌గౌడ్ నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్. పోరాట సన్నివేశాలు ప్రత్యేకకార్షణగా నిలుస్తాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది' అని తెలిపారు. 'అన్ని వాణిజ్యహంగులతో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్నాయి' అని నిర్మాతలు తెలిపారు. సినిమాటోగ్రఫీ: సురేందర్ రెడ్డి, ఎడిటింగ్ :విశ్వనాథ్

ప్రేక్షకుల ముందుకు త్రిముఖ



సన్నీలియోన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'త్రిముఖ'. రాజేశ్ నాయుడు దర్శకత్వంలో శ్రీదేవి మద్దాలి, రమేశ్ ఎం. నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 30న 'త్రిముఖ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రం ఇది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. పతాక ఘట్టాలే సినిమాకు ప్రత్యేకాకర్షణ. సన్నీలియోన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. 'అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథతో దర్శకుడు ఆసక్తిరంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఇందులో ప్రతి పాత్రకు ప్రత్యేకత ఉంటుంది. త్వరలో ట్రైలర్, పాటలు విడుదల చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★




బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'పెద్ది' చిత్రం భారీ షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. కొత్త షెడ్యూల్ కోసం రామ్‌చరణ్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. జిమ్‌లో ఆయన శ్రమిస్తున్న ఫొటోను చిత్రబృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. కండలు తిరిగిన దేహంతో సీరియస్ లుక్‌లో రామ్‌చరణ్ ఆకట్టుకున్నారు.

కుటుంబ నేపథ్యంలో..



రాజ్‌తరుణ్, సంజీవ్ మాధవ్ ప్రధాన పాత్రధారులుగా సీహెచ్ సుధీర్ రాజు తెరకెక్కిస్తోన్న చిత్రం 'రామ్ భజరంగ్'. స్వాతి సుధీర్, డాక్టర్ రవి బాల నిర్మాతలు. 1980ల నాటి కుటుంబ నేపథ్యంలో రాబోతున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ని విడుదల చేసింది. 'రాజ్ తరుణ్, సంజీవ్ మాధవ్ ఇద్దరూ పోటీ పడి నటిచారు. త్వరలో టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అని దర్శకుడు సుధీర్ రాజు తెలిపారు.

నల్లమల సాగర్‌పై ముందుకే..



(మొదటి పేజీ తరువాయి)

శనివారం రాత్రి అమరావతి ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. "నల్లమలసాగర్ విషయంలో కేంద్రంతో మాట్లాడి అనుమతి సాధించాలి. పొరుగు దేశం తెలంగాణతో సంప్రదింపులు జరపాలి. వివాదాలు లేకుండా రెండు రాష్ట్రాలూ అభివృద్ధి చెందేలా సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. వృథాగా పోయే జలాలను వాడుకునేలా నల్లమలసాగర్ ప్రాజెక్టును రూపొందించాం. దీనిపై కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు పొరుగు రాష్ట్రం నుంచి కూడా అభ్యంతరం రాకుండా చూసుకోవాలి. అవసరమైన పక్షంలో తెలంగాణకూ నీటిని అందించేలా మన ప్రణాళికలు ఉండాలి" అని సీఎం నిర్దేశించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుద్దామని, ఇందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ..సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. పూర్వోదయ పథకం కింద ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే తాను వెలిగొండ ప్రాంతాన్ని సందర్శిస్తానని తెలిపారు. ప్రాధాన్యాలవారీగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని జల వనరుల శాఖను ఆదేశించారు. కేంద్రం నిధులు మంజూరు చేసే పూర్వోదయ పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీపీపీ విధానంలో చేపట్టే పథకాలపై సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. దావోస్ పర్యటనల నుంచి తిరిగి రాగానే ఆ జాబితాను తనకు సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని కోరారు. "గత ఏడాది హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులకు గడువు నిర్దేశించుకుని పూర్తి చేశాం. పోలవరం ప్రాజెక్టు పనులనూ పరుగులు పెట్టిస్తున్నాం. ఇదే తరహాలో వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణ పనులు పూర్తి చేయాలి." అంటూ దిశానిర్దేశం చేశారు. రాయలసీమలో పూర్వోదయ పథకం కింద ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఈ పథకం కింద ప్రకాశం, రాయలసీమలోని తొమ్మిది జిల్లాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. ఈ ప్రాజెక్టులను చేపడితే ఉద్యాన రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందని అన్నారు. ఈ ఏడాది రెండు లక్షల హెక్టార్లలో ఉద్యాన వన పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలని సూచించారు. ఇక పథకంలో భాగంగా చేపట్టాల్సిన రోడ్ నెట్‌వర్క్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, వేర్ హౌసింగ్ సదుపాయాలు, కోల్డ్ చెయిన్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన పనులను జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. నల్లమల సాగర్‌తోపాటు ఇరిగేషన్ ప్రాజెక్టులలో పీపీపీ ప్రాజెక్టులు, వివిధ శాఖల్లోని జల జీవన్ మిషన్, సాస్కీ నిధుల వినియోగం వంటి అంశాలపైనా సీఎం సమీక్షించారు.

చెరువులను నింపాలి

ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చూపేందుకు వీల్లేదని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులను పూర్తిచేయడం, రాష్ట్రంలోని చెరువులను నింపడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. సుమారు 200 ప్రాజెక్టులు మొదటి విడతలో పీపీపీ కింద చేపట్టాల్సిన అవసరం ఉన్నదని, జల్‌జీవన్ మిషన్ 2027 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపుల మేరకే నీటి వినియోగం!

- పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానంతో తెలంగాణకు నష్టం లేదు
- 30న ఢిల్లీలో నదీ జలాలపై కేంద్ర కమిటీ తొలి సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై ఏపీ కసరత్తు
- గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టుల వివరాలపైనా ఆరా

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాలు.. కేటాయింపుల మేరకు మాత్రమే వాడుతున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఈమేరకు ఈ నెల 30న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అనూప్ కుమార్ అధ్యక్షతన జరగనున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జల వివాద కమిటీ తొలి సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై రాష్ట్ర జల వనరుల శాఖ సమాచారాన్ని సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటికే గోదావరి నదీ జలాలపై ఆధారపడి 941 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలంగాణ ప్రకటించిన ప్రకటించిన మేరకు, ఆ ప్రాజెక్టుల వివరాలు ఇవ్వాలంటూ గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు ఆంధ్రప్రదేశ్ లేఖ రాసింది. అయితే, ఆ వివరాలు తమ వద్దలేవంటూనే.. ఈ నెల 30న జరిగే సమావేశంలో లిఖిత పూర్వకంగా ప్రశ్నించాలని జీఆర్ఎంబీ సూచించింది. ఈ సూచనమేరకు గోదావరిపై తెలంగాణ నిర్మించిన ప్రాజెక్టుల వివరాలు కోరనున్నది. ఇదే సమయంలో గోదావరి నదీ ప్రవాహానికి సంబంధించి 50 ఏళ్ల చరిత్రతో కూడిన వరద నీటి గణాంకాలను కూడా ఏపీ సిద్ధం చేసింది. ఈ సమాచారం మేరకు గోదావరి జలాలు ఏటా సగటున 3400 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిలో 200 టీఎంసీల వరద జలాలను మాత్రమే పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం ద్వారా ఎత్తిపోయనున్నామని వెల్లడించనున్నది. దీనివల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ ఉండదని స్పష్టం చేయనున్నది. దిగువన సముద్రంలో కలసి భారజలాలుగా మారే నీటిని సద్వినియోగం చేసుకోవడంలో తప్పేమీలేదంటూ ఇటీవల సుప్రీం కోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని కూడా ప్రస్తావించనుంది. అలాగే, ఈ సమావేశంలో తెలంగాణ లేవనెత్తబోయే పలు అంశాలపై ఆధారాలతో సమాధానాలు ఇచ్చేందుకు వీలుగా కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఆధారపడి నిర్మించిన ప్రాజెక్టులు, నీటి బేసిన్‌ల వారీగా నీటి వినియోగం తదితర అంశాలతో నోట్‌ను అందజేసేందుకు ఏపీ జల వనరుల శాఖ సిద్ధమవుతోంది.

శబరిమల బంగారం చోరీ కేసు.. సిట్‌కు చేరిన శాస్త్రీయ నివేదిక

కొల్లాం, జనవరి 17: శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోని బంగారు తాపడాల అదృశ్యం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆలయ ద్వార బంధాలు, వివిధ కళాఖండాలపై ఉన్న బంగారు పూతకు సంబంధించి విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ) రూపొందించిన శాస్త్రీయ విశ్లేషణ నివేదికను కొల్లాం విజిలెన్స్ కోర్టు తాజాగా ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అందజేసింది. కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు సిద్ధం చేసిన ఈ నివేదికను వీఎస్ఎస్సీ నిపుణులు సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించగా, దానిని శుక్రవారం దర్యాప్తు అధికారులకు అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టి 2019లో పునరుద్ధరణ పనుల నిమిత్తం బంగారు తాపడం ఉన్న రాగి పలకలను తీసుకెళ్లారు. అయితే, ఆ పలకలపై ఉన్న బంగారం నాణ్యత ఆయన తీసుకెళ్లక ముందు ఎలా ఉంది, తిరిగి తెచ్చిన తర్వాత ఎలా ఉంది అనే అంశాలను శాస్త్రీయంగా పోల్చి చూడాలని సిట్ కోరడంతో హైకోర్టు ఈ పరీక్షలకు ఆదేశించింది.

మాకేమీ తెలియదు...

- పోలీసు కస్టడీలో మావోయిస్టులు
- ముగిసిన కస్టడీ... రాజమండ్రి సెంట్రల్ జైలులో అప్పగింత

విజయవాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలీసు కస్టడీలో ముగ్గురు మావోయిస్టుల విచారణ శనివారంతో ముగిసింది. దీంతో అదే రోజు సాయంత్రం తమ కస్టడీలో ఉన్న వారిని పోలీసులు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో అప్పగించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో చిక్కిన 28 మంది మావోయిస్టుల్లో ముగ్గురు ప్రధాన నిందితులు... యుద్ధం రఘు(ఏ1), జ్యోతి(ఏ2), దివాకర్(ఏ3)లను విచారణ నిమిత్తం రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి హైకోర్టు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో పెనమలూరు పోలీసులు మావోయిస్టులు ముగ్గురినీ కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం తమ అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా మావోయిస్టులు ఒక్కొక్కరికీ సుమారుగా 50 ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. అత్యధిక ప్రశ్నలకు తమకేమీ తెలియదని చెప్పిన వారు... కొన్ని ప్రశ్నలకు మాత్రం పొడిపొడిగా జవాబులు ఇచ్చినట్టు సమాచారం.





నందిగామ వై జంక్షన్, కీసర టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు

పండగ సందడి తిరిగెళ్లిపోతోంది

- సంక్రాంతికి వచ్చిన వారు తిరుగుప్రయాణం
- విజయవాడ-హైదరాబాద్ రహదారి కిటకిట

నందిగామ, జనవరి 17: సంక్రాంతి మూడు రోజులు సొంతూరులో హుషారుగా గడిపిన వారు తిరుగుప్రయాణమయ్యారు. శనివారం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వేలాది వాహనాలతో కిటకిటలాడింది. నందిగామ సమీపంలోని బైపాస్, అప్రోచ్ రోడ్లకు మరమ్మతులు నిర్వహించడంతో ప్రయాణం సాఫీగానే సాగింది. అయితే ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ముందస్తు ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కనుమ మరుసటిరోజు నుంచి తిరుగు ప్రయాణం సాగుతుందని తెలిసి కూడా ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఒక్క క్షణం ఆపినా వేలాది వాహనాలు ఆగిపోయే పరిస్థితుల్లో స్పీడ్‌బ్రేకర్లు, బోర్డులు ఏర్పాటుచేస్తూ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. దీంతో శనివారం ఉదయం గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఓ గంట తర్వాత వాహనాలు సాఫీగా కదిలాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కీసర టోల్‌ప్లాజా వద్ద ముందస్తు ఏర్పాట్లు చేశారు. సాధారణంగా ఐదు కౌంటర్ల నుంచి వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. శనివారం ఉదయం మరో మూడు కౌంటర్లు అదనంగా తెరిచారు. దీంతో వాహనాలు వేగంగా ముందుకుసాగాయి.

జీసీసీ హబ్‌గా విశాఖ

- మార్చి నుంచి 'ఇసాయ్ ఫార్మా' కార్యకలాపాలు!
- అదే లైన్‌లో ఎన్‌టీటీ, లూలులెమన్
- రుషికొండ ఐటీ పార్కులోని హిల్-2పై 'ఇన్‌స్పైర్‌ఎడ్జ్' భవనాన్ని లీజుకు తీసుకున్న సంస్థలు
- ఆ తర్వాత క్యూలో ఏఎన్ఎస్ఆర్, రహేజా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) హబ్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సాకారమవుతోంది. జపాన్‌కు చెందిన అతిపెద్ద ఫార్మా కంపెనీ 'ఇసాయ్' విశాఖలో తొలి జీసీసీని మార్చిలో ప్రారంభించనుంది. ఈ సంస్థ ఇప్పటికే విశాఖకు 35 కిలోమీటర్ల దూరంలోని పరవాడ రాంకీ ఫార్మా సిటీలో 2009 నుంచి మందులు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జీసీసీ పాలసీ ప్రకటించగానే తామూ సంస్థ ఏర్పాటు చేస్తామని ముందుకువచ్చింది. అది మార్చిలో ప్రారంభం కానుందని ఐటీ వర్గాలు తెలిపాయి. దీని తర్వాత జపాన్‌కే చెందిన నిప్పన్ టెలిగ్రాఫ్ అండ్ టెలిఫోన్ కార్పొరేషన్ (ఎన్‌టీటీ) కూడా విశాఖలో జీసీసీని ప్రారంభించనుంది. మొబైల్, ఇంటర్నెట్, ఐటీ, కన్సల్టెన్సీ, ఏఐ, ఫొటోనిక్స్ రంగాల్లో ఈ సంస్థ 190 దేశాలకు సేవలు అందిస్తోంది. 70 దేశాల్లో కార్యాలయాలున్నాయి. రుషికొండ ఐటీ పార్కు హిల్-2 పైన ఉన్న 'ఇన్‌స్పైర్‌ఎడ్జ్' భవనంలో కొంత భాగాన్ని లీజుకు తీసుకుంది. ప్రాథమిక ఒప్పందాలన్నీ పూర్తయినట్టు సమాచారం. మరోవైపు ఇదే భవనంలోనే లూలులెమన్ కంపెనీ ఒక జీసీసీని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సంస్థ దుస్తులు, ఫుట్‌వేర్‌ను తయారు చేస్తోంది. భారత్‌లో టాటా క్లిక్‌తో కలిసి పనిచేయాలని ప్రయత్నిస్తోంది.



రుషికొండ ఐటీ పార్కులో జీసీసీలు ఏర్పాటు కానున్న ఇన్‌స్పైర్‌ఎడ్జ్ భవనం

ముందుగానే జీసీసీ కోసం విశాఖలో భవనాన్ని ఎంపిక చేసుకుంది. ఆ తర్వాత ఏఎన్ఎస్ఆర్, రహేజా వంటి సంస్థలు కూడా జీసీసీలను ఏర్పాటు చేయనున్నాయి. రాబోయే మూడేళ్లలో మొత్తం 200 జీసీసీలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. జపాన్‌కు చెందిన రెండూ జీసీసీలు మార్చిలోనే ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. ఇవి కాకుండా రియల్ ఎస్టేట్ రంగంలో పేరొందిన ఆర్ఎంజెడ్ కార్పొరేషన్ విశాఖలో పెద్ద ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. భూమి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తోంది. ఐటీ రంగానికి అవసరమైన మౌలిక వసతులతో ఐటీ పార్క్ నిర్మిస్తామని ప్రతిపాదించింది.

ఆకర్షణీయమైన పాలసీలు

ప్రభుత్వం గతేడాదిలో ఐటీ రంగానికి సంబంధించి కొత్తగా 30 పాలసీలు ప్రకటించింది. అందులో జీసీసీలకూ ప్రత్యేకంగా ఒక పాలసీ ఉంది. బిలియన్ డాలర్ల టర్నోవర్ చేసే మల్టీ నేషనల్ కంపెనీలకు ఎకరా భూమిని 99పైసలకే అందిస్తోంది. మధ్యశ్రేణి కంపెనీలకు ఎకరా రూ.10 కోట్ల విలువ చేసే భూమిని రూ.4 కోట్లకే ఇస్తోంది. కొత్తగా స్టార్టప్‌లు ప్రారంభించే వారికి ప్లగ్ అండే ప్లేతో ఇంక్యుబేషన్ సెంటర్లు సమకూరుస్తోంది. మరికొన్ని కంపెనీలకు రెంటల్ సబ్సిడీ అందిస్తోంది. ఆ క్రమంలోనే గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకువచ్చింది. కాగ్నిజెంట్ 21 ఎకరాల్లో ఐటీ క్యాంపస్ నిర్మిస్తోంది. టీసీఎస్‌కు కూడా 20 ఎకరాలు కేటాయించారు. తాత్కాలికంగా కార్యకలాపాల నిర్వహణకు మిలీనియం టవర్లలో ఒకటి పూర్తిగా ఇచ్చారు. మరోవైపు క్యాప్‌జెమినీ విశాఖలో తన ఉద్యోగుల కోసం సొంత క్యాంపస్ నిర్మించాలని భావిస్తోంది. భూమి కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తోంది.

అధికారం ఉంటే ఒకలా.. లేకుంటే మరోలా!

- జగన్ తాచుపాము బుద్ధి మారకపోవడం దౌర్భాగ్యం: పార్థసారథి



అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): 'సొంత ప్యాలెస్‌లకు రూ.వేల కోట్లు ఖర్చు చేసిన జగన్... ప్రజా రాజధానికి మాత్రం నయా పైసా ఖర్చు పెట్టలేదు' అని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రానికి మంచి రాజధాని ఎంత అవసరమో... ఆ రాజధానిపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం కూడా అంతే అవసరం. అధికారం లేనప్పుడు అసెంబ్లీ సాక్షిగా రాజధానికి జై అన్న జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత నై అని అన్నారు. నయవంచనకు అసలైన రూపం జగనే. జగన్ కారణంగా ఐదేళ్లు రాష్ట్రానికి రాజధాని లేకుండా ప్రజలు బాధపడాల్సి వచ్చింది. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం నింపడమే జగన్‌రెడ్డి నీచ రాజకీయం. అమరావతిని ఒక ప్రాంతానికే చెందిన నగరంగా చిత్రీకరించడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. పీపీపీ విధానంలో వచ్చే సంస్థల యజమానులను తాము అధికారంలోకి రాగానే అరెస్టు చేస్తామని బెదిరించడం జగన్ జుగుప్సాకర రాజకీయానికి తార్కాణం. 11 సీట్లకు పడిపోయినా, జగన్ తాచుపాము బుద్ధి మారకపోవడం దౌర్భాగ్యం' అని మంత్రి మండిపడ్డారు.

ఆర్టీసీకి జాతీయస్థాయి అవార్డు గర్వకారణం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీకి జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక 'గవర్నెన్స్ నౌ-ఆరో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్' అవార్డు రావడం గర్వకారణమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రజలకు అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించడంతో సేవలో నాణ్యత మరింత మెరుగుపడింది. డిజిటల్ సాంకేతికతను ప్రజాసేవకు వినియోగించిన ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రధాన బస్టాపుల్లో ఆటో మేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ఏఏఎస్) అమలు ప్రశంసనీయం. సాంకేతికతను అందిపుచ్చుకుని, సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఆర్టీసీ ముందడుగు వేస్తోంది. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తాం. ప్రజా రవాణా రంగంలో మహిళలకు ఉచిత బస్సు, పండుగ వేళల్లో సాధారణ చార్జీలు ఉంచుతూ ఏపీఎస్ఆర్టీసీని దేశానికి ఆదర్శంగా నిలబెడతాం. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఎండీ ద్వరకా తిరుమలరావుకు అభినందనలు' అని మంత్రి పేర్కొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా జరుపుకొందాం

- డూండీ రాకేశ్




అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): 'కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం' అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పెనుగొండలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం 25 రాష్ట్ర పండుగలను ప్రకటిస్తే వాటిలో మూడు ఆర్యవైశ్యులకు చెందినవే ఉన్నాయి. ఇది కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇచ్చిన గౌరవం. పొట్టి శ్రీరాములు పేరుతో స్మృతివనం నిర్మించాలని సీఎంని కోరగా స్పందించి అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాలను కేటాయించారు. మార్చి 16న పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నాం. పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మారుస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేసిందన్నారు.

ఉద్యానరంగంలో గేమ్ చేంజర్ ఆటోమేషన్!

సూక్ష్మసేద్యంలో సరికొత్త విధానం

మొబైల్ ఆపరేటింగ్ ద్వారా ఎక్కడి నుంచైనా తోటలకు నీరు పెట్టొచ్చు





ఆటోమేషన్ విధానంలో వినియోగించే పరికరాలు

- రియల్‌టైమ్‌లో పనిచేసే సోలెనోయిడ్ పరికరాలు
- పండ్ల తోట రైతులకు ఉద్యానశాఖ వరం!
- రైతులకు 45-55% సబ్సిడీపై పంపిణీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నీరు వృథా కాకూడదు.. విద్యుత్, సమయం ఆదా అవ్వాలి.. రైతులు అధిక సామర్థ్యం, ఉత్పాదకత, స్థిరత్వం సాధించాలి.. చివరికి పెట్టుబడులు తగ్గాలి.. అధిక దిగుబడులతో రైతులకు స్థిరమైన ఆదాయం రావాలి.. ఉద్యానవనాల సాగులతో ఆటోమేషన్ విధానంతో ఇదంతా సాధ్యమే! పండ్ల తోటలకు వినియోగించే సూక్ష్మనీటి పారుదలలో ఉద్యానశాఖ ఇలాంటి సరికొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఏపీ సూక్ష్మనీటి పారుదల ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటలకు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి వినూత్నంగా ఆటోమేషన్ ఆధారిత సూక్ష్మనీటి పారుదల వ్యవస్థను అమలు చేస్తోంది.

ఇదీ ఆటోమేషన్ విధానం!

నీరు వృథా కాకుండా, సమయం ఆదా అయ్యేలా, మొబైల్ ఆపరేటింగ్ ద్వారా ఎక్కడి నుంచైనా తోటలకు నీరు పెట్టేలా ఆటోమేషన్ విధానం ఉంటుంది. ఇది ఆధునిక వ్యవసాయ విధానంలో గేమ్ చేంజర్ అవుతోంది. దీనివల్ల రైతులు అధిక సామర్థ్యం, ఉత్పాదకత, స్థిరత్వం సాధించగలుగుతారు. ఈ విధానంలో షెడ్యూల్ చేయడం, పర్యవేక్షించడం, అవసరాల ఆధారంగా పంటలకు నీటిని సమర్థంగా అందించడం వంటివి ఉంటాయి. తోటలకు నీటిని సకాలంలో, కచ్చితమైన, తగినంత అందించడంతో పాటు మనుషులతో పని లేకుండా, రియల్‌టైమ్‌లో పనిచేసే సోలేనోయిడ్ వాల్వ్‌లు, స్మార్ట్ సెన్సార్లు, కంట్రోలర్ వంటి పరికరాలు ఉంటాయి. ఎరువుల వాడకాన్ని ఆటోమేషన్ చేయడం ద్వారా ఫర్టిగేషన్ సామర్థ్యాన్ని పెంచుతాయి. దీనివల్ల ఉద్యాన పంటల్లో నాణ్యమైన ఉత్పత్తుల స్థిరత్వం మెరుగుపడుతుంది. విద్యుత్ వినియోగం తగ్గుతుంది. ఫలితంగా రైతుకు పెట్టుబడి తగ్గి, నికరాదాయం పొందటానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ మార్చిలోగా సూక్ష్మసేద్యంలో ఆటోమేషన్ విధానాన్ని 7,500హెక్టార్లలో అమలుచేయాలని ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆటోమేషన్ పరికరాల సరఫరాకు కొన్ని కంపెనీలను ఎంపిక చేశారు. ఆటోమేషన్‌కు హెక్టారుకు రూ.40వేలు ఖర్చవుతుంది. చిన్న, మధ్యస్థ, ఎస్సీఎస్టీ రైతులకు హెక్టారుకు 55 శాతంతో రూ.22వేల వరకు సబ్సిడీ లభించనుంది. ఇతర రైతులకు 45శాతంతో రూ.18వేలు సబ్సిడీ ఉంటుందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఆటోమేషన్‌లో ఉండే ప్రధాన భాగాలు

పంపు స్టార్ట్ రిలే, ఓల్టేజ్ స్టెబిలైజర్, కంట్రోలర్లు, ఫ్లో డిడక్షన్ సెన్సార్, సోలేనాయిడ్ వాల్వ్‌లు, ఆటోమేటిక్ ప్రెజర్ రిలీఫ్ వాల్వ్, రెయిన్ సెన్సార్, రిమోట్ మానిటరింగ్, బ్లూటూత్‌తో పని చేసే కంట్రోల్ సిస్టమ్స్.

ఆటోమేషన్‌కు, సంప్రదాయ బిందు సేద్యానికి వ్యత్యాసం

ఆటోమేషన్ విధానం	సంప్రదాయ బిందు సేద్యం
డిమాండ్ ఆధారంగా నీరు తీసుకుంటుంది.	నీటి పారుదలలో హెచ్చుతగ్గులుంటాయి.
స్వయం ప్రతిపత్తితో పని చేస్తుంది.	మాన్యువల్ ఆపరేషన్ అవసరం ఉంటుంది.
అవసరాన్ని బట్టి పంపుల్ని ఆప్టిమైజ్ చేయొచ్చు.	పంపులు అనవసరం లేకున్నా పని చేస్తాయి.
నీటి విడుదలపై సెన్సార్లు, డేటా నియంత్రణ ఉంటుంది.	క్షేత్ర పరిస్థితుల్లో అభిప్రాయం లోపిస్తుంది.
ఆటోమేషన్‌లో ఏకరూపంగా పరికరాలు స్థిరంగా ఉంటుంది.	మాన్యువల్ సెట్టింగ్‌లు మారుతూ ఉంటాయి.
ఫర్టిగేషన్ అత్యంత సమర్థంగా, ప్రోగ్రాం ప్రకారం ఉంటుంది	మాన్యువల్‌లో కచ్చితత్వం తక్కువ.
డ్యాష్‌బోర్డు ద్వారా రిమోట్‌తో రియల్‌టైంలో పని చేస్తుంది.	తరచూ తనిఖీలు అవసరం.
పంట దశలకు సులభమైన అనుకూలతగా ఉంటుంది.	అనుకూలత పరిమితంగా ఉంటుంది .
వాతావరణ డేటా సెన్సార్లకు అనుసంధానమై ఉంటుంది.	రియల్ టైం అవకాశం ఉండదు.
వనరుల సద్వినియోగం వల్ల మొక్కలు బలంగా ఉంటాయి.	వివిధ ఒత్తిళ్ల వల్ల మొక్కలు సరిగ్గా, బలంగా ఉండవు.
నీటి సద్వినియోగంతో 30-45% దాకా ఉత్పత్తి పెరుగుతుంది.	పంట ఉత్పత్తి 20-30% మించి పెరగదు.
ఎరువులు 15-25% ఆదా అవుతాయి.	10% లోపే ఆదా అవుతుంది.
నీటి ఆదా 40-60% దాకా ఉంటుంది.	30%లోపే నీరు ఆదా అవుతుంది.
కూలీల అవసరం తక్కువ.	కూలీల అవసరం తప్పదు.
హెక్టారుకు నికరాదాయం 90వేల నుంచి లక్షా 40వేలు.	60వేల నుంచి రూ.90వేల వరకు మాత్రమే.

మంచుకురిసే వేళలో..



ఏలూరు నగరంలో ఉదయం 7:20 గంటలకు దట్టంగా అలుముకున్న పొగమంచు

- ఉదయం 10 గంటల వరకు పొగమంచు
- అరకులోయలో 3.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఏలూరు జిల్లాను శనివారం మంచు దుప్పటి కప్పేసింది. కోస్తాలోని అనేక ప్రాంతాల్లో ఉదయం 10గంటల వరకు మంచు కొనసాగడంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేకువజామునే వచ్చిన భక్తులు చలికి గజగజలాడారు. ఏజెన్సీ మండలాల్లో పక్కనున్న వ్యక్తి కనిపించనంతగా పొగమంచుతో కూడిన సన్నటి మంచుతుంపర కురిసింది. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఉదయం 9గంటల సమయంలోనూ వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగించారు. ఏలూరు, ఉభయ గోదావరి, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల విజిబులిటీ 100 మీటర్ల కంటే తక్కువగా నమోదైంది.



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఉదయం 8:30 గంటలకు వీడని పొగమంచు

తెల్లవారుజామున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. మధ్య భారతం నుంచి వీస్తున్న అతిశీతల గాలులతో కోస్తాలో చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు 3నుంచి 4డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 3.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో పొగమంచు, చలి తీవ్రత కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

- ద్వారకా తిరుమల/బుట్టాయగూడెం/విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి

హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్‌లు శనివారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును మొత్తం మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలో వచ్చే ఏడాదికి 5 లక్షల టన్నులు, 2028 నాటికి పది లక్షల టన్నులు.. మూడో దశకు వచ్చేసరికి పూర్తిస్థాయి సామర్థ్యం 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే...



వేదికపై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రి వాసంశెట్టి సుభాశ్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, సానా సతీశ్, ఎమ్మెల్యే పంతం నానాజీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ప్లాంట్ యజమానులు

కొనుగోలు ధర తగ్గిస్తాం..

'హబ్ అండ్ స్పోక్' పద్ధతిలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం. విద్యుత్ రంగంలో పెను మార్పులకు శ్రీకారం చుడుతున్నాం. మరింత సామర్థ్యం పెంచుకుని ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గిస్తాం. అదే సమయంలో టెక్నాలజీని ఉపయోగించుకుని మరింత ముందుకు వెళ్తున్నాం. దీనిలో భాగంగా రూ.5.19 ఉన్న యూనిట్ విద్యుత్ కొనుగోలు ధరను రూ.4.80కి తగ్గించాం. వచ్చే మూడేళ్లలో యూనిట్ సరాసరి కొనుగోలు వ్యయాన్ని రూ.1.90కి తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. సబ్‌స్టేషన్ల వారీగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ఆలోచిస్తున్నాం. దీనికి బ్యాటరీలు వినియోగిస్తాం. ఫలితంగా ట్రాన్స్‌మిషన్ నష్టాలు తగ్గుతాయి. విద్యుత సౌకర్యం ఉన్నందునే గూగుల్ విశాఖకు డేటా సెంటర్ పెడుతోంది. రాష్ట్రంలో తీర ప్రాంతంలో 20 పోర్టులు రాబోతున్నాయి.

పెట్టుబడుల వరద

పాలనలో గతం కంటే సంక్షేమానికి మరింత పెద్ద పీట వేస్తూనే అభివృద్ధి పనులు చేస్తున్నాం. నూతన పారిశ్రామిక విధానంతో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అమలు చేస్తున్నాం. ఇటీవల బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహించిన సర్వేలో దేశంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే వచ్చినట్టు తేలింది. పెట్టుబడుల సదస్సులో రూ.13.20 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. తద్వారా యువతకు 16 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. ఇప్పటివరకు జరిగిన ఏపీ పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు ద్వారా రూ.8.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 8.40 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.

నేను నిత్య విద్యార్థిని!

నేను నిత్యవిద్యార్థిని. కొత్త విషయాలు ఎక్కడున్నా నేర్చుకుని వాటిని ఆచరణలోకి పెట్టడానికి ప్రయత్నిస్తా. 2047కి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుతాం. దేశంలో సంపద సృష్టికి ఏపీని మించిన రాష్ట్రం లేదు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలతో వందలాది మంది పారిశ్రామికవేత్తలను తయారు చేస్తున్నాం. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తల కలలు నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో 'స్పేస్ సిటీ'(అంతరిక్ష నగరం) ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో ఉపగ్రహాలను కూడా ప్రయోగించబోతున్నాం. అలాగే, డ్రోన్ సిటీని కూడా అందుబాటులోకి తెస్తాం. భవిష్యత్తులో డ్రోన్ ట్యాక్సీలు రావలసిన అవసరం ఉంది. ఇప్పుడున్న రహదారులు భవిష్యత్తులో రద్దీగా మారనుండడంతో డ్రోన్ ట్యాక్సీలకు డిమాండ్ ఉంటుంది. ఇటీవల అన్నామలై యూనివర్సిటీ నుంచి ఓ వ్యక్తి వచ్చి డ్రోన్ అంబులెన్స్‌ల ప్రాధాన్యతను వివరించారు. ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం.

35 లక్షల మంది వచ్చారు

రాష్ట్రంలో సంక్రాంతి మూడు రోజులు కోడిపందేలు జోరుగా జరిగాయి. సంక్రాంతికి బయట నుంచి రాష్ట్రానికి 35 లక్షల మందికి పైగా వచ్చారు. హైదరాబాద్ నుంచే మూడు లక్షల కార్లు వచ్చాయి. మనం ఎక్కడున్నా జన్మభూమిని మరిచిపోకూడదని పిలుపునిచ్చాను. జల్లికట్టు ఉత్సాహంగా జరుగుతోంది. జగ్గన్న తోట ప్రభల తీర్థం వైభవంగా జరిగింది. ఒకపక్క సంప్రదాయాలను కాపాడుతూనే మరోవైపు సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు.

అప్పుడూ.. ఇప్పుడూ చరిత్రే..

కాకినాడలో ఏఎం గ్రీన్ కంపెనీ.. తొలి విడతలో 2027, జూన్ నాటికి 5 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. చరిత్ర తిరగరాయడంలో తెలుగువారు ముందుండటం అభినందనీయం. 1982-83లో ఎన్టీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇక్కడి ప్రజలు ఎరువుల ప్లాంటు కోరగా, ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి ఎన్ఎఫ్‌సీఎల్ ద్వారా అప్పట్లో 'గ్రే అమ్మోనియా' ప్లాంట్ ఏర్పాటు చేయించారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు ఏర్పాటైంది. ఇదొక పెనుమార్పు. వ్యవసాయ రంగానికి గ్రీన్ అమ్మోనియాతో ఎంతో మేలు కలగనుంది. ఇటీవల రాష్ట్రంలో నీటి శాంపిళ్లను పరీక్షిస్తే అత్యధిక శాతం నైట్రోజన్ ఉన్నట్టు తేలింది. ఇలా అత్యధికంగా నైట్రోజన్ ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఏడో స్థానంలో ఉంది. భూమిలో ఉప్పునీటి సాంద్రత ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఆరో స్థానంలో ఉంది. దీంతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ద్వారా భవిష్యత్తులో కలుషిత నీటి స్థాయిలను తగ్గించవచ్చు.

> పారిశ్రామిక అనుకూల విధానాల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. వచ్చే మూడేళ్లలో సరాసరి యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం రూ.1.19 వరకు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. సంపద సృష్టికి ఏపీని మించిన రాష్ట్రం లేదు.
>
> -సీఎం చంద్రబాబు

ప్రపంచం కాకినాడ వైపే!

కాకినాడలో ఏర్పాటుచేయబోయే ప్లాంట్‌లో తయారుచేసే హైడ్రోజన్‌ను నిల్వచేయలేం, దాన్ని గ్రీన్ అమ్మోనియాగా మార్చి రవాణా చేయవచ్చు. దేశంలో 500 గిగావాట్ల గ్రీన్ విద్యుదుత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకుంటే దీనిలో మన రాష్ట్ర వాటాయే 160 గిగావాట్లు. భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, గ్రీన్ మాలిక్యులర్స్. గ్రీన్ ఎనర్జీ అంటే ప్రపంచమంతా కాకినాడ వైపు చూస్తుంది.


గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు గురించి వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గత ప్రభుత్వంలో వేధింపులే

పారిశ్రామికవేత్తలను వైసీపీ నాయకులు భయపెట్టారు

- సమీక్షల పేరుతో విద్యుత్ ఒప్పందాలు ఆపేశారు
- గ్రీన్ అమ్మోనియం ఉత్పత్తితో ప్రపంచపటంలోకి రాష్ట్రం ప్రగతి
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను అనేక రకాలుగా వేధింపులకు గురిచేసిందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే విద్యుత్ కొనుగోలు ఒప్పందాల సమీక్ష పేరుతో అనేక ఒప్పందాలను నిలిపివేసిందన్నారు. దీనివల్ల ప్రభుత్వం అదనంగా సొమ్ములు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. చివరకు విదేశీ సంస్థలను కూడా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. కియా సంస్థ ప్రతినిధులను బెదిరించారని పవన్ ధ్వజమెత్తారు. పెట్టుబడిదారులను నాటి ప్రభుత్వం వేధించిందని, తమ ప్రభుత్వం అలా చేయదని, పెట్టుబడిదారులకు అండగా ఉంటూ వారికి భరోసా ఇస్తోందని పేర్కొన్నారు. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌లో భారీ యంత్ర పరికరాల ఏర్పాటును బటన్ నొక్కి ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే..

గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రం గమ్యస్థానం

కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు ఏర్పాటు ఆనందంగా ఉంది. చెలమలశెట్టి అనిల్, కొల్లి మహేశ్ సహకారంతో ఏఎం గ్రీన్‌కోను స్థాపించారు. గత వైసీపీ హయాంలో పారిశ్రామికవేత్తలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో అందరికీ తెలుసు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామికవేత్తలకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నాం. 495 ఎకరాల్లో 15 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయడం శుభపరిణామం. గ్రీన్ అమ్మోనియా కంపెనీ ఏర్పాటు దశలో 8 వేల మందికి, పనుల సమయంలో 1500 మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రధాని మోదీ కేంద్రంలో, చంద్రబాబు రాష్ట్రంలో పర్యావరణాన్ని కాపాడుకుంటూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నారు. పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికిగాను ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చాం. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి రాష్ట్రం గమ్యస్థానం కావాలి. కాలుష్యరహిత ఇంధన ఉత్పత్తిలో ఇదొక మైలురాయి. ఎరువులు, విద్యుత్ తయారీలో కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రీన్‌ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా దోహదం చేస్తాయి. పిఠాపురం ప్రాంతంలో సముద్రం తరచూ ముందుకు వచ్చి తీవ్ర నష్టం జరుగుతోంది. 2, 3 డిగ్రీల ఉష్ణోగ్రత వ్యత్యాసం కనిపించినా దాని ప్రభావం పడుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్లే ఇలా జరుగుతోంది. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి. అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

జోగి కుట్ర... జనార్దనరావు అమలు

- ములకలచెరువు నకిలీ మద్యం కేసులో రెండో చార్జిషీట్ దాఖలు

అన్నమయ్య/ములకలచెరువు, జనవరి 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 536 పేజీలతో ఎక్సైజ్ పోలీసులు రెండో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రేరణతోనే ములకలచెరువులో కూడా నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ప్రారంభించారని సిట్ అధికారులు, ఎక్సైజ్ ఉన్నతాధికారులు గుర్తించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో దాఖలు చేసిన రెండో ప్రాథమిక చార్జిషీట్‌లో ఈ వివరాలను పొందుపరిచినట్లు సమాచారం. ఈ కేసులో గత నెల మొదటి వారంలో 540 పేజీలతో మొదటి ప్రాథమిక చార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన విషయం విదితమే. తాజాగా దాఖలు చేసిన రెండో చార్జిషీట్‌లో జోగి రమేశ్, జనార్దనరావు సోదరుల ఆర్థిక, స్నేహ బంధం గురించి ప్రస్తావించినట్లు తెలిసింది. ఇద్దరి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు, కాల్‌డేటా, ముడుపులు, యూపీఐ లావాదేవీలను చార్జిషీట్‌లో పొందుపరిచినట్లు సమాచారం. జోగి రమేశ్(ఏ32), జోగి రాము(ఏ33), అద్దేపల్లి జనార్దనరావు(ఏ1), అద్దేపల్లి జగన్‌మోహనరావు(ఏ26), కేరళకు చెందిన జిగ్నేష్(ఏ24), శిబు(ఏ25), నకరికంటి రవి(ఏ16), శ్రీనివాసులు రెడ్డి(ఏ23) తదితరుల పాత్రను ప్రస్తావించినట్లు తెలిసింది. గతేడాది అక్టోబరు 3వ తేదీన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి భారీఎత్తున నకిలీ మద్యం బాటిళ్లు, స్పిరిట్ క్యాన్లు, బ్లెండ్(నకిలీ మద్యం), అత్యాధునిక పరికరాలు స్వాధీనం చేసుకుని మొత్తం 33 మందిపై కేసు నమోదు చేశారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ సస్పెండైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి మినహా అందరూ అరెస్టయ్యారు.

రాజేశ్, అన్బురసులను కస్టడీకి ఇవ్వండి

- తంబళ్లపల్లె కోర్టులో ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

ములకలచెరువు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసు నిందితులు, మదనపల్లె సబ్‌జైల్లో ఉన్న రాజేష్(ఏ5), అన్బురసు అలియాస్ బాబు(ఏ19)ను కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ సస్పెండైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేసిన రాజేష్‌ను గతనెల 9న, అలాగే జయచంద్రారెడ్డి ఇంట్లో పని చేసిన అన్బురసును గతనెల 10న అరెస్టు చేశారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వీరిద్దరినీ విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఇదే కేసులో నిందితుడైన సెంధిల్(ఏ30)ను ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. సెంధిల్ ప్రస్తుతం మదనపల్లె సబ్‌జైలులో ఉన్నాడు.

రేపు దావోస్‌కు చంద్రబాబు

- ప్రపంచ ఆర్థిక సదస్సులో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు
- ఐబీఎం, గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మేర్స్క్ సంస్థల సీఈవోలతో చర్చలు
- స్విట్జర్లాండ్, యూఏఈ సహా వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశాలు
- తొలిరోజు 20 దేశాల ఎన్నారైలతో తెలుగు డయాస్పోరా కార్యక్రమం
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం



దావోస్‌లో ఏర్పాటు చేసిన ఏపీ లాంజ్

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు సోమవారం దావోస్‌కు వెళ్లనున్నారు. వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు, కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీకి వెళ్లనున్నారు. సోమవారం తెల్లవారుజామున 1.45 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి జ్యూరిక్ చేరుకుంటారు.

తొలిరోజు పర్యటన ఇలా..

తొలిరోజు సీఎంతో స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ భేటీ అవుతారు. ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక చైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిధిమా లుల్లా, స్వనీత్ సింగ్ కూడా సీఎంతో సమావేశమవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. 20 దేశాల నుంచి వచ్చే ఎన్నారైలతో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. అనంతరం జ్యూరిక్ నుంచి రోడ్డు మార్గంలో దావోస్ వెళ్తారు. దావోస్‌లో యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే సమావేశంలో పాల్గొంటారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో సీఎంతోపాటు ఐటీ మంత్రి లోకేశ్ భేటీ అవుతారు. సీఐఐ డీజీ చంద్రజిత్ కూడా సీఎంతో సమావేశమవుతారు. మీడియా సంస్థ 'పొలిటికో'కు సీఎం ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

రెండో రోజు దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు..

రెండో రోజు పర్యటనలో 'ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్-ఏపీ అడ్వాంటేజ్' పేరిట సీఐఐ నిర్వహిస్తున్న సెషన్‌లో సీఎం పాల్గొంటారు. అనంతరం ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. తర్వాత దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం చైర్మన్ సీఈవో అరవింద్ కృష్ణతో సీఎం, లోకేశ్ సమావేశమవుతారు. గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తోనూ భేటీ అవుతారు. అనంతరం ఏపీ లాంజ్‌లో నిర్వహించనున్న వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్యానల్ డిస్కషన్‌కు సీఎం హాజరవుతారు. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్‌కు సీఎం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో సమావేశమవుతారు. ప్రపంచ ఆర్థిక సదస్సు సెషన్‌లో 'ఎనర్జీ ట్రాన్సిషన్ లీడర్స్' సమావేశంలోనూ పాల్గొంటారు. స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ హెలెన్ బడ్లిగర్ అర్టెడాతో చర్చలు జరుపుతారు. అనంతరం ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్మండ్‌తో భేటీ అవుతారు. ఇజ్రాయెల్ మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్‌తోనూ సీఎం చర్చలు జరుపుతారు. సాయంత్రం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ ఎండీ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌తో సీఎం భేటీ అవుతారు. అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మేర్స్క్, సీఈవో విన్సెంట్ క్లెర్క్‌లతో ముఖాముఖి సమావేశమవుతారు. ఈ రెండు సమావేశాలకు లోకేశ్ కూడా హాజరవుతారు. జాన్ కాక్రిల్ సంస్థ సీఈవో మారాంగేతో సీఎం భేటీ అవుతారు. 'విజన్ టు వెలాసిటీ-డెప్లాయింగ్ ఇన్నోవేషన్ ఎట్ స్కేల్' పేరుతో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారు.

మూడో రోజు వరుస సమావేశాలు..

మూడో రోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సెషన్‌లో సీఎం పాల్గొంటారు. హొరైజిస్ చైర్మన్ ఫ్రాంక్ రిచర్‌తో భేటీ కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఓఓ కుష్బు అవస్థి, కాలిబో ఏఐ అకాడమీ సీఈవో రాజ్ వట్టికూటి, స్కాట్ శాండ్స్లెఫర్‌తో సీఎం సమావేశమవుతారు. బ్లూమ్‌బర్గ్ సంస్థ నిర్వహించనున్న 'ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సెషన్‌లో సీఎం ముఖ్యవక్తగా ప్రసంగిస్తారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి సీఎం పాల్గొంటారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజెనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరుతో నిర్వహించే మరో కార్యక్రమంలోనూ పాల్గొంటారు. మొత్తంగా దావోస్‌లో 36 కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. ప్రభుత్వాల మధ్య జరిగే మూడు సమావేశాల్లో, పారిశ్రామికవేత్తలతో జరిగే 16 వన్ టు వన్ సమావేశాల్లో పాల్గొంటారు. వీటితోపాటు 9 రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్లీనరీ సెషన్స్‌లో పాల్గొంటారు. ఈ నెల 22న దావోస్ నుంచి జ్యూరిక్ చేరుకుని అక్కడి నుంచి బయల్దేరి 23వ తేదీ ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.

నేడు పార్టీ కార్యాలయానికి చంద్రబాబు

- ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, పార్టీ నేతలతో సమావేశమవుతారు. సుమారు రెండున్నర గంటలపాటు కార్యాలయంలోనే గడిపిన అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు ఉండవల్లిని నివాసానికి బయలుదేరి వెళ్తారు.

గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం పరుగులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



కాకినాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనూ దేశంలోనూ గ్రీన్ ఎనర్జీ సునామీలా వెల్లువెత్తాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆకాంక్షించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియం కంపెనీ శంకుస్థాపన సభలో ఆయన ప్రసంగిస్తూ ఇక, రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ రంగంలో పరుగులు తీస్తుందన్నారు. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ వచ్చినప్పుడు అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రారంభించారని, ఇప్పుడు కాకినాడలో ఏఎం గ్రీన్ రావడం హర్షణీయమని పేర్కొన్నారు. సన్‌రైజ్ ఏపీలో ఏఎం గ్రీన్ కొత్త కాంతులు ప్రసరింపజేయనుంది. నాలుగు రోజులు రాష్ట్రంలో సంక్రాంతి జరిగింది. పండగంటే రాక్షసత్వంపై దైవత్వం విజయం. కర్బన్ ఉద్గారాల రక్కసిని తరిమికొట్టేందుకు గ్రీన్ ఎనర్జీ అనే దైవశక్తికి ఏఎం గ్రీన్ నాంది పలుకుతోంది' అని మాధవ్ వ్యాఖ్యానించారు.

కర్బన ఉద్గారాలు తగ్గుతాయి: గ్రీన్‌కో వ్యవస్థాపకులు

ఏఎం గ్రీన్ వ్యవస్థాపకులు చెలమలశెట్టి అనిల్, కొల్లి మహేశ్ మాట్లాడుతూ తమ ప్లాంట్ ద్వారా ఇకపై దేశం అమ్మోనియం దిగుమతుల స్థాయి నుంచి వివిధ దేశాల ఎగుమతి స్థాయికి చేరుకుంటుందని చెప్పారు. కాకినాడ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందన్నారు. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో పెరిగిపోతున్న కర్బన్ ఉద్గారాలు తగ్గుతాయని వివరించారు. కాగా, సభలో వివిధ దేశాల నుంచి ఏఎం గ్రీన్ కంపెనీ అమ్మోనియం, హైడ్రోజన్ ఉత్పత్తికి సహకరిస్తున్న పలు కంపెనీలు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు వర్చువల్ విధానంలో ప్రసంగించారు. అంతకుముందు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఏఎం గ్రీన్ కంపెనీ ప్రతినిధులతో కలిసి కాంక్రీట్ బటన్ నొక్కి ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. 3డీ విధానంలో తయారు చేసిన ప్లాంట్ నమూనా పరిశీలించారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన సీఎం హెలికాప్టర్

మధ్యాహ్నం 11.30 గంటలకు సభ ప్రారంభం కావలని ఉండగా, సీఎం చంద్రబాబు అమరావతి నుంచి పయనమవ్వాల్సిన హెలికాప్టర్ అకస్మాత్తుగా సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో కాకినాడ నుంచి వేరే హెలికాప్టర్‌ను అమరావతికి పంపించగా, దానిలో చంద్రబాబు ఆలస్యంగా కాకినాడకు చేరుకున్నారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాశ్, ఎంపీలు సానా సతీశ్, ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, కొండబాబు, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, ఏఎం గ్రీన్ సంస్థ తరఫున పలువురు నిపుణులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.